మయపుత్రోఽథ మాయావీ నామ్నా పరమదుర్మదః,
కిష్కింధాం సముపాగత్య వాలినం సముపాహ్వయత్. 47

సింహనాదేన మహతా వాలీ తు తదమర్షణః,
నిర్యయౌ క్రోధతామ్రాక్షో జఘాన దృఢముష్టినా. 48

దుద్రావ తేన సంవిగ్నో జగామ స్వగుహాం ప్రతి,
అనుదుద్రావ తం వాలీ మాయావినమహం తథా. 49

తతః ప్రవిష్టమాలోక్య గుహాం మాయావినం రుషా,
వాలీ మామాహ తిష్ఠత్వం బహిర్గచ్ఛామ్యహం గుహామ్,
ఇత్యుక్త్వావిశ్య స గుహాం మాసమేకం న నిర్యయౌ. 50

మాసాదూర్ధ్వం గుహాద్వారాన్నిర్గతం రుధిరం బహు,
తద్దృష్ట్వా పరితప్తాంగో మృతో వాలీతి దుఃఖితః. 51

గుహాద్వారి శిలావేకాం నిధాయ గృహమాగతః,
తతోఽబ్రవం మృతో వాలీ గుహాయాం రక్షసా హతః.52

తచ్ఛ్రుత్వా దుఃఖితాః సర్వే మామనిచ్ఛంతమప్యుత,
రాజ్యేఽభిషేచనం చక్రుః సర్వే వానరమంత్రిణః. 53

శిష్టం తదా మయా రాజ్యం కించిత్కాలమరిందమ,
తతః సమాగతో వాలీ మామాహ పరుషం రుషా. 54

బహుధా భర్త్సయిత్వా మాం నిజఘాన చ ముష్టిభిః,
తతో నిర్గత్య నగరాదధావం పరయా భియా. 55

లోకాన్ సర్వాన్పరిక్రమ్య ఋష్యమూకం సమాశ్రితః,
ఋషేః శాపభయాత్సోఽపి నాయాతీమం గిరిం ప్రభో.
56

పరమ దుర్మదుడు, మయపుత్రుడు, మాయావి యనువాడు ఒకనాడు కిష్కింధకు చేరి, వాలిని యుద్ధమునకు పిలిచెను. (47) వాని సింహనాదమును విని సహింపలేక క్రోధముతో నెఱ్ఱబడిన కన్నులతో వాలి కిష్కింధ వెడలి దృఢమైన ముష్టిప్రహారమును మాయావిపై ప్రయోగించెను (48). దానితో అదరి, వాడు తన గుహకు పరుగెత్తెను. ఆ మాయావిని, మాయన్న వాలి, నేను అనుసరించి పరుగెత్తితిమి (49). మాయావి తన గుహలో దూరబడగా చూచి, వాలి రోషముతో ''నీవు వెలుపలనే యుండుము. నేను గుహలోనికి పోయెదను'' అని చెప్పి గుహలోనికి ప్రవేశించెను. ఒక నెల గడిచినను అతడు బయటికి రాలేదు (50). నెలదాటిన తర్వాత గుహనుండి రక్తము వెల్లువగా వెలికివచ్చెను. అది చూచి పరితపించి, వాలి మరణించెనని దుఃఖితుడనైతిని (51). గుహ ద్వారములో (వాలిని చంపిన మాయావి తిరిగి కిష్కింధపై బడునను భయముతో) ఒక శిలనుంచి మూసివేసి, ఇంటికి మరలితిని. గుహలో (ని) రాక్షసుని చేత వాలి చంపబడెనని అక్కడ చెప్పితిని (52). అది విని అందరు దుఃఖితులై, సమస్త వానరమంత్రి పుంగవులు నాకు ఇష్టము లేకున్నను (కిష్కింధకు రాజుండవలెను కనుక) నన్ను రాజ్యాభిషిక్తుని గావించిరి (53). తరువాత కొంతకాలమే నాచేత రాజ్యము పాలింపబడినది. అంతలో వాలి తిరిగి వచ్చెను. నాతో పరుషముగా క్రోధముగా పలికెను (54). పలువిధములుగా దుర్భాషలతో బెదిరించెను. ముష్టిఘాతములు ప్రహరించెను. నేను అత్యంత భయముతో నగరమువీడి పరుగు పెట్టితిని (55). ప్రభూ! రక్షణకై లోకములన్నియు తిరిగి తిరిగి, చివరకు ఋష్యమూకము నాశ్రయించితిని. వాయన్న ఋషుల శాపమునకు భయపడి ఈ కొండకు రానేరాడు (56).

తదాది మమ భార్యాం స స్వయం భుంక్తే విమూఢధీః,
అతో దుఃఖేన సంతప్తో హృతదారో హృతాశ్రయః. 57

వసామ్యద్య భవత్పాదసంస్పర్శాత్సుఖితోఽస్మ్యహమ్,
మిత్రదుఃఖేన సంతప్తో రామో రాజీవలోచనః. 58

హనిష్యామి తవ ద్వేష్యం శీఘ్రం భార్యాపహారిణమ్,
ఇతి ప్రతిజ్ఞామకరోత్సుగ్రీవస్య పురస్తదా. 59

సుగ్రీవోఽప్యాహ రాజేంద్ర వాలీ బలవతాం బలీ,
కథం హనిష్యతి భవాన్ దేవైరపి దురాసదమ్. 60

శృణు తే కథయిష్యామి తద్బలం బలినాం వర,
కదాచిద్దుందుభిర్నామ మహాకాయో మహాబలః. 61

కిష్కింధామగమద్రామ! మహామహిషరూపధృక్,
యుద్ధాయ వాలినం రాత్రౌ సమాహ్వయత భీషణః. 62

తచ్ఛ్రుత్వాఽసహమానోఽసౌ వాలీ పరమకోపనః,
మహిషం శృంగయోర్ధృత్వా పాతయామాస భూతలే.
63

పాదేనైకేన తత్కాయమవష్టభ్యాస్య శిరో మహత్,
హస్తాభ్యాం భ్రామయంశ్ఛిత్త్వా తోలయిత్వాఽక్షిపద్భువి.
64

పపాత తచ్ఛిరో రామ మాతంగాశ్రమసన్నిధౌ,
యోజనాత్పతితం తస్మాన్మునేరాశ్రమమండలే. 65

రక్తవృష్టిః పపాతోచ్చైస్తద్దృష్ట్వా తాం క్రోధమూర్ఛితః,
మాతంగో వాలినం ప్రాహ యద్యాగంతాసి మే గిరిమ్.
66

ఇతః పరం భగ్నశిరా మరిష్యసి న సంశయః,
ఏవం శప్తస్తదారభ్య ఋష్యమూకం న యాత్యసౌ. 67

నాటినుంచి మూఢాత్ముడై నా భార్యను కూడ అతడే అనుభవించుచున్నాడు. అందువలననే భార్యను కోల్పోయి, ఆశ్రయమును కోల్పోయి, దుఃఖముతో కాలము గడుపుచున్నాను. నేను ఈనాడు నీ పాదస్పర్శముతో సౌఖ్యము నందితిని''.

మిత్రుని దుఃఖముతో మరింతగా బాధపడి రాజీవనేత్రుడగు రాముడు (57-58) ''నీ శత్రువగు వానిని నీ భార్యను అపహరించినవానిని, వేగమే వధించివేసెదను'' అని సుగ్రీవుని కట్టెదుట ప్రతిజ్ఞను చేసెను (59). సుగ్రీవుడు ఇట్లనెను 'రాజేంద్రా! వాలి బలశాలురలో కెల్ల బలి! దేవతలకు కూడా లొంగిరాని అతనిని ఎటుల చంపగలవు? వినుము! వీరశ్రేష్ఠా! అతని బలము గూర్చి వివరించెదను. ఒకానొకపుడు మహాకాయుడు, మహాబలుడు అగు దుందుభియనువాడు గొప్ప అడవిదున్న రూపు ధరించి కిష్కింధకు వచ్చి చేరెను. ఆ రాత్రివేళ యుద్ధముకొరకై భీషణముగా అరచుచు వాలిని ఆహ్వానించెను (60-62). అది విని సహింపలేని ఈ వాలి అతిక్రోధము చెలరేగ, దుందుభి యొక్క కొమ్ములు రెంటిని పట్టి పెళ్లార్చి నేలకూల్చెను (63). ఒకే ఒక్క పాదముతో వాని శరీరమును తొక్కిపట్టి చేతులతో దాని శిరమును మెలిత్రిప్పి, త్రుంచివేసి చేతులతో, తలను తులతూచి దూరముగా పడునట్లు విసరివేసెను (64). రామా! వాని శిరస్సు అక్కడికి యోజనదూరములో నున్న మాతంగాశ్రమ సమీపమున పడినది. దాని వలన ఆశ్రమ మండలమంతయు రక్తము వర్షించెను. దానినిచూచి, ఆగ్రహోదగ్రుడై, మాతంగ మునివరుడు వాలిని గూర్చి ఇట్లు శపించెను - ''నీవు నా కొండపైకి ఇకముందు వచ్చిన యెడల శిరస్సు భగ్నమై మరణించెదవు. ఇది నిస్సంశయము.'' ఈ శాపము పొందిన తరువాత నుండి అతడు ఋష్యమూకము నకు రానేరాడు (65-67).

ఏతజ్జ్ఞాత్వాఽహమత్ర
వసామి భయవర్జితః,
రామ పశ్య శిరస్తస్య
దుందుభేః పర్వతోపమమ్. 68

తత్క్షిపతే యదా శక్తః శక్తస్త్వం వాలినో వధే,
ఇత్యుక్త్వా దర్శయామాస శిరస్తద్గిరిసన్నిభమ్. 69

దృష్ట్వా రామః స్మితం కృత్వా పాదాంగుష్ఠేన చాక్షిపత్,
దశయోజనపర్యంతం తదద్భుతమివాభవత్. 70

సాధు సాధ్వితి సంప్రాహ సుగ్రీవో మంత్రిభిః సహ,
పునరప్యాహ సుగ్రీవో రామం భక్తపరాయణమ్. 71

ఏతే తాలా మహాసారాః సప్త పశ్య రఘూత్తమ,
ఏకైకం చాలయిత్వాసౌ నిష్పత్రాన్కురుతేఽంజసా. 72

యది త్వమేకబాణేన విద్ధ్వా ఛిద్రం కరోషి చేత్,
హతస్త్వయా తదా వాలీ విశ్వాసో మే ప్రజాయతే,
తథేతి ధనురాదాయ సాయకం తత్ర సందధే. 73

బిభేద చ తదా రామః సప్తతాలాన్మహాబలః,
తాలాన్సప్త వినిర్భిద్య గిరిం భూమిం చ సాయకః. 74

పునరాగత్య రామస్య తూణీరే పూర్వవత్స్థితః,
తతోఽతిహర్షాత్సుగ్రీవో రామమాహాతివిస్మితః. 75

దేవ త్వం జగతాం నాథః పరమాత్మా న సంశయః,
మత్పూర్వకృతపుణ్యౌఘైః సంగతోఽద్య మయా సహ.
76

త్వాం భజంతి మహాత్మానః సంసారవినివృత్తయే,
త్వాం ప్రాప్య మోక్షసచివం ప్రార్థయేఽహం కథం భవమ్.
77

ఇదంతయు తెలియును కనుక నేనును నిర్భయముగా ఇక్కడ నివసించుచున్నాను. రామా! పర్వతముతో సాటివచ్చు దుందుభి శిరస్సు చూడుము! (68). దానిని ఎగజిమ్మి వేయగలిగితివో, వాలిని వధించుటకు నీవు చాలినవాడవే!'' అని చెప్పి గిరిసన్నిభమైన దుందుభి శిరమును రామునకు చూపించెను (69). దానిని చూచి రాముడు చిరునవ్వు నవ్వి, కాలి బొటనవ్రేలితో పదియోజనముల దూరమునకు అవలీలగా చిమ్మివేసెను. అది అద్భుతముగా (చూచువారలకు) ఆయెను (70).

మంత్రులతో సహా సుగ్రీవుడు ''భళి! భళి!'' అని రాఘవుని శ్లాఘించెను. భక్తజన పరాయణుడైన రామునితో సుగ్రీవుడు మరల ఇట్లనెను (71) - ''రఘునాథా! చాలా బలిష్ఠములైన యీ తాడిచెట్లను ఏడింటిని చూడుము. వాలి వీటిని ఒక్కొక్కటిగా అవలీలగా కదలించి, ఆకులన్నియు రాలిపోవునట్లు చేసెడివాడు (72). నీవు ఒకే బాణముతో వీనిని కొట్టి రంధ్రము చేయగలిగిన వాడవగుదువేని, వాలి నీచేత చంపబడినాడను విశ్వాసము నాకు కలగగలదు''. అట్లేయని రాముడు విల్లందుకొని శరము సంధించెను (73). అంతట మహాబలశాలి రాముడు, ఏడింటిని చీల్చివేసెను. అతని అమోఘబాణము ఏడు సాలములను ఛిద్రము చేసి, కొండను భేదించి, నేలను చొరబారి తిరిగి వచ్చి అమ్ములపొది చేరి, (ప్రయోగింపబడని ముందు ఉన్న అచ్చమైన స్థితిలో) నిలిచెను. అంతట అత్యంతము సంతోషించి, సుగ్రీవుడు ఆశ్చర్యచకితుడై మిక్కిలి హర్షము నొంది రామునితో ఇట్లనెను (74-75) - ''దేవా! నీవు జగన్నాథుడవు! పరమాత్ముడవు! ఇది నిశ్చయము. నా పురాకృత పుణ్యరాశి ఫలరూపముగనే నీ తోడి నాకు మైత్రి ప్రాప్తించినది (76). మహాత్ములైనవారు సంసారబంధ నివృత్తిని కోరి, నిన్ను సేవింతురు. అట్టి యెడ మోక్షమును ప్రసాదించు మిమ్ము (స్నేహితునిగా) పొంది ఎటుల మరల సంసారమును కోరుకొందును? (77).

దారాః పుత్రా ధనం రాజ్యం
సర్వం త్వన్మాయయా కృతమ్.
అతోఽహం దేవదేవేశ
నాకాంక్షేఽన్యత్ప్రసీద మే. 78

ఆనందానుభవం త్వాద్య ప్రాప్తోఽహం భాగ్యగౌరవాత్,
మృదర్థం యతమానేన నిధానమివ సత్పతే. 79

అనాద్యవిద్యాసంసిద్ధం బంధనం ఛిన్నమద్య నః,
యజ్ఞదానతపఃకర్మ పూర్తేష్టాదిభిరప్యసౌ. 80

న జీర్యతే పునర్దార్ఢ్యం భజతే సంసృతిః ప్రభో,
త్వత్పాదదర్శనాత్సద్యో నాశమేతి న సంశయః. 81

క్షణార్ధమపి యచ్చిత్తం త్వయి తిష్ఠత్యచంచలమ్,
తస్యాజ్ఞానమనర్థానాం మూలం నశ్యతి తత్క్షణాత్. 82

తత్తిష్ఠతు మనో రామ త్వయి నాన్యత్ర మే సదా. 83

రామరామేతి యద్వాణీ మధురం గాయతి క్షణమ్,
స బ్రహ్మహా సురాపో వా ముచ్యతే సర్వపాతకైః. 84

న కాంక్షే విజయం రామ
న చ దారసుఖాదికమ్.
భక్తిమేవ సదాకాంక్షే
త్వయి బంధవిమోచనీమ్. 85

త్వన్మాయాకృతసంసారస్త్వదంశోఽహం రఘూత్తమ,
స్వపాదభక్తిమాదిశ్య త్రాహి మాం భవసంకటాత్. 86

పూర్వం మిత్రార్యుదాసీనాస్త్వన్మాయావృతచేతసః,
ఆసన్మేఽద్య భవత్పాదదర్శనాదేవ రాఘవ. 87

భార్యాపుత్ర ధన రాజ్యములు సర్వము నీ యొక్క మాయావిలాస కార్యములే! అందువలన దేవా! దేవేశా! (దేవదేవేశ) ఇతరమును ఏదియు కోరను. నన్ను దయమాడుము (78). సత్పురుషులకు ఆశ్రయమగు స్వామీ! నా భాగ్యగరిమచే, ఆనందానుభవము (ఆనందస్వరూపులగు మీతోడి సాంగత్యము) ఇపుడు పొందితిని. ఇది మట్టి కొరకు (గోతిని) త్రవ్వువానికి నిధి లభించినట్లున్నది (79). స్వామీ! అనాది అవిద్యాప్రాప్తమైన సంసారబంధము నాకిపుడు ఛేదనమాయెను. యజ్ఞములు, దానములు, తపములు ఇష్టాపూర్తములు మొదలగు కర్మలు, ప్రక్రియల వలన కూడ ఈ సంసారబంధము చివికిపోదు సరికదా! మరింత దృఢతరమగును. కాని ప్రభూ! అదంతయు నీ పాదకమలములు దర్శించిన వెంటనే నాశనమై చనును. ఇది నిస్సంశయము (80-81). ఎవని చిత్తము అరక్షణమైనను నీయందే నిశ్చలముగా నిలవగలుగునో, తత్క్షణముననే వానియొక్క సర్వ అనర్థములకు మూల కారణము అయిన అజ్ఞానము నశించిపోవును (82). అందువలన నా మనసు నీయందే లగ్నమై యుండుగాక! ఇతరములందు ఉండకుండు గాక! (83).

''రామా! రామా! యనుచు నీ పదమును (వాక్యము/నామమును) మధురముగా ఒక క్షణమైనను గానము చేయువాడు, బ్రహ్మఘ్నుడైనను మద్యపానము చేసినవాడైనను సర్వపాపములనుండి ముక్తుడైపోవును (84). రామా! వాలిని జయించుటను గాని, (దూరమైన) భార్యాసుఖమును గాని, నేనిపుడు కోరను. సకలబంధ విమోచనమగు నీ పదములయందలి భక్తినే సదా ఆకాంక్షింతును (85). రఘూత్తమా! సంసారము నీ మాయావిలాసము. నేను నీ అంశభూతుడను. అందువలన నీ పాదభక్తిని ప్రసాదించి నన్ను సంసార సంకటమునుండి రక్షించుము (86). ఇతఃపూర్వము భవదీయ మాయాచ్ఛాదిత చిత్తవృత్తుడనైనపుడు, శత్రుమిత్రులు, ఉదాసీనులు నాకు గోచరించెడువారు. కాని నీ పాదారవింద

సర్వం బ్రహ్మైవ మే భాతి
క్వ మిత్రం క్వ చ మే రిపుః,
యావత్సాన్మాయయా
బద్ధస్తావద్గుణవిశేషతా. 88

సా యావదస్తి నానాత్వం తావద్భవతి నాన్యథా,
యావన్నానాత్వమజ్ఞానాత్తావత్కాలకృతం భయమ్.89

అతో౽విద్యాముపాస్తే యః సో౽న్ధే తమసి మజ్జతి,
మాయామూలమిదం సర్వం పుత్రదారాదిబంధనమ్,
తదుత్సారయ మాయాం త్వం దాసీం తవ రఘూత్తమ.90

త్వత్పాదపద్మార్పితచిత్తవృత్తి-
స్త్వన్నామసంగీతకథాసు వాణీ,
త్వద్భక్తసేవానిరతౌ కరౌ మే
త్వదంగసంగం లభతాం మదంగమ్. 91

త్వన్మూర్తిభక్తాన్ స్వగురుం చ చక్షుః
పశ్యత్వజస్రం స శృణోతు కర్ణః,
త్వజ్జన్మకర్మాణి చ పాదయుగ్మం
వ్రజత్వజస్రం తవ మందిరాణి. 92

అంగాని తే పాదరజోవిమిశ్ర-
తీర్థాని బిభ్రత్వహిశత్రుకేతో,
శిరస్త్వదీయం భవపద్మజాద్యై -
ర్జుష్టం పదం రామ నమత్వజస్రమ్. 93

దర్శనముచేతనే, సర్వము ఈనాడు పరబ్రహ్మ స్వరూపముగా కనవచ్చుచున్నది. ఎవడు మిత్రుడు, ఎవడు నా శత్రువు? నీ మాయ ప్రాణులను బంధించి యుండునంతవరకే త్రిగుణముల ప్రభావముండును (87-88). ఆ మాయా కార్యము ఎంతవరకుండునో అంతవరకు శత్రు మిత్రత్వాది నానావిధములగు భావ పరంపర ఉండును. ఎంతవరకీ అజ్ఞాన జనితమగు నానాత్వభావన నిలచునో, అంతవరకు మృత్యుభయముండును (89). అందువలన ఎవడు అవిద్యను ఉపాసించునో (కామ్యకర్మలను ఆచరించిన) అతడు ఘోరమగు అంధకారములో మునిగి పోవును. సర్వవిధముల ఈ పుత్రకళత్రాది బంధనము కేవలము మాయామూలము. రఘూత్తమా! నీ దాసురాలగు మాయను మానుండి దూరము చేసివేయుము (90).

''స్వామీ! నా చిత్తవృత్తి నీ పాదపద్మముల యందే తగిలియుండు గాక! పలుకు నీ నామసంకీర్తనమందు, కథాకథనమందు పులకించుగాక! నా హస్తములు నీ భక్తుల సేవలయందే అమరియుండుగాక! నా శరీరము నీ అంగ సంగమునందు నిలచుగాక! (91), నా కన్నులు ఎల్లపుడు నీ దివ్యమంగళవిగ్రహమును భక్తులను, మా గురువులను సదా దర్శించుగాక! నీ దివ్యములగు జన్మ కర్మలను నా చెవులు తనివితీర వినుచు వరలు గాక! నా పాదయుగము సర్వదా భవదీయ మందిరముల వంకకే మరలు గాక! (92)

''రామా! గరుడధ్వజా! నీ పాద పరాగముల మోసికొను పుణ్యతీర్థముల శీకరమును నా శరీరము ధరించుగాక! సర్వదేశ, సర్వకాల, సర్వఅవస్థలయందు శివబ్రహ్మాదులు పూజలందు నీ దివ్య (భవ్య) పదమునందే నా శిరము ప్రణమిల్లు గాక !'' అని ప్రార్థించెను (93).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ ప్రథమ సర్గము ॥ 1 ॥

----****----

ఓం

ద్వితీయ సర్గము

వాలి వధ - కపీశ నరేశ సంవాదము

శ్రీమహాదేవ ఉవాచ

ఇత్థం స్వాత్మపరిష్వంగనిర్ధూతాశేషకల్మషమ్,
రామః సుగ్రీవమాలోక్య సస్మితం వాక్యమబ్రవీత్. 1

మాయాం మోహకరీం తస్మిన్వితన్వన్ కార్యసిద్ధయే,
సఖే త్వదుక్తం యత్తన్మాం సత్యమేవ న సంశయః. 2

కింతు లోకా వదిష్యంతి
మామేవం రఘునందనః,
కృతవాన్కిం కపీంద్రాయ
సఖ్యం కృత్వాగ్నిసాక్షికమ్. 3

ఇతి లోకాపవాదో మే భవిష్యతి న సంశయః,
తస్మాదాహ్వయ భద్రం తే గత్వా యుద్ధాయ వాలినమ్. 4

బాణేనైకేన తం హత్వా రాజ్యే త్వామభిషేచయే,
తథేతి గత్వా సుగ్రీవః కిష్కింధోపవనం ద్రుతమ్. 5

కృత్వా శబ్దం మహానాదం
తమాహ్వాయత వాలినమ్,
తచ్ఛ్రుత్వా భ్రాతృనినదం
రోషతామ్రవిలోచనః. 6

నిర్జగామ గృహాచ్ఛీఘ్రం సుగ్రీవో యత్ర వానరః,
తమాపతంతం సుగ్రీవః శీఘ్రం వక్షస్యతాడయత్. 7

సుగ్రీవమపి ముష్టిభ్యాం
జఘాన క్రోధమూర్ఛితః,
వాలీ తమపి సుగ్రీవ
ఏవం క్రుద్ధౌ పరస్పరమ్. 8

అయుధ్యేతామేకరూపౌ
దృష్ట్వా రామోఽతివిస్మితః,
న ముమోచ తదా బాణం
సుగ్రీవవధశంకయా. 9

శ్రీమహాదేవుడిట్లనెను - ''పార్వతీ! ఇట్టి విధముగ తన పరిష్వంగము చేత, సాంగత్యము చేత అఖిల పాపములు నిశ్శేషముగా క్షీణము కాగా, రాముడు చిరునవ్వుతో, తన కార్యసిద్ధిని ఆశించి, సుగ్రీవుని మరింత మోహింపచేయు తన మాయా ప్రభావమును అతని యందు మరియు విస్తరింప చేయుచు, ఇట్లనెను - ''మిత్రమా! నీవు నాతో చెప్పిన దంతయు నిస్సంశయముగా నిత్య సత్యము (1-2). అయినను -

రఘునందనుడు (పాపము) ఆ సుగ్రీవునితో అగ్ని సాక్షికముగా మైత్రి నెరపి ప్రతిగా చేసినది ఏమున్నది?'' అని లోకము నన్ను నిందించును. నిస్సంశయముగ ఈ లోకాపవాదు నాయందు సంభవించును. అందువలన నీవు పోయి వాలిని యుద్ధమునకు ఆహ్వానించుము. నీకు శుభమగుగాక! (3-4). ఒకే ఒక్క బాణముతో వానిని వధించి, రాజ్యమున నిన్ను అభిషేకించెదను'' -

రాముడిట్లు చెప్పగా 'అట్లే''యని సుగ్రీవుడు వెంటనే కిష్కింధ యందలి ఉపవనమునకు వెళ్లి (5) గొప్పనాదము గల శబ్దము చేసి (గర్జించి) వాలిని యుద్ధము నకు పిలిచెను. తమ్ముని గర్జన విని, రోషకషాయిత లోచనుడై శీఘ్రముగా గృహమునుండి వాలి వెలువడి, వానర పుంగవుడగు సుగ్రీవుడున్నచోటికి వచ్చెను. మీదికి వచ్చుచున్న వాలి వక్షస్థలముపై సుగ్రీవుడు బలముగా మోదెను (6-7). అంతట క్రుద్ధుడై సుగ్రీవునికూడ ముష్టిప్రహారములతో వాలి మోదెను. అతనిని మరల సుగ్రీవుడు కొట్టెను. ఇటుల రోషముతో, పరస్పరము కొట్టుకొనుచు యుద్ధము చేయుచున్న వారిరువురు ఒక్క రూపై యుండుట చూచి రాముడు ఆశ్చర్యచకితు డాయెను. వాలిని సరిగా గుర్తింపలేక, సుగ్రీవుడు వధింపబడునేమో యను శంకతో, రాముడు వ్యాకులుడై బాణము విడువ డాయెను (8-9).

తతో దుద్రావ సుగ్రీవో వమన్ రక్తం భయాతురః,
వాలీ స్వభవనం యాతః సుగ్రీవో రామమబ్రవీత్. 10

కిం మాం ఘాతయసే రామ శత్రుణా భ్రాతృరూపిణా,
యది మద్ధననే వాంఛా త్వమేవ జహి మాం విభో. 11

ఏవం మే ప్రత్యయం కృత్వా సత్యవాదిన్ రఘూత్తమ,
ఉపేక్షసే కిమర్థం మాం శరణాగతవత్సల. 12

శ్రుత్వా సుగ్రీవవచనం రామః సాశ్రువిలోచనః,
ఆలింగ్య మా స్మ భైషీస్త్వం దృష్ట్వా వామేకరూపిణౌ. 13

మిత్రఘాతిత్వమాశంక్య ముక్తవాన్సాయకం న హి,
ఇదానీమేవ తే చిహ్నం కరోమ్యే భ్రమశాంతయే. 14

గత్వాహ్వాయ పునః శత్రుం హతం ద్రక్ష్యసి వాలినమ్,
రామోఽహం త్వాం శపే భ్రాతర్హనిష్యామి రిపుం క్షణాత్.
15

ఇత్యాశ్వాస్య స సుగ్రీవం రామో లక్ష్మణమబ్రవీత్,
సుగ్రీవస్య గలే పుష్పమాలామాముచ్య పుష్పితామ్. 16

ప్రేషయస్వ మహాభాగ సుగ్రీవం వాలినం ప్రతి,
లక్ష్మణస్తు తదా బద్ధ్వా గచ్ఛ గచ్ఛేతి సాదరమ్. 17

ప్రేషయామాస సుగ్రీవం సోఽపి గత్వా తథాఽకరోత్,
పునరప్యద్భుతం శబ్దం కృత్వా వాలినమాహ్వయత్. 18

తచ్ఛ్రుత్వా విస్మితో వాలీ క్రోధేన మహతావృతః,
బద్ధ్వా పరికరం సమ్యగ్గమనాయోపచక్రమే. 19

గచ్ఛంతం వాలినం తారా గృహీత్వా నిషిషేధ తమ్,
న గంతవ్యం త్వయేదానీం శంకా మేఽతీవ జాయతే.20

అంతట సుగ్రీవుడు నెత్తురు గ్రక్కుచు భయాతురుడై పోరాటముడిగి పారిపోయెను. వాలి తిరిగి తన గృహమునకు పోయెను. సుగ్రీవుడపుడు రామునితో ఇట్లనెను ''రామా! సోదరుని రూపమున నున్న శత్రువుచే నన్ను చంపింప నెంచితివే! నీకు నన్ను చంపవలెనని యున్న, ఓ ప్రభూ! నీవే స్వయముగా నన్ను వధింపుము. సత్యవాదీ! రఘునాథా! శరణాగతవత్సలా! ఈ విధముగా నాకు విశ్వాసము కలిగించి, ఎందులకు ఉపేక్షించితివి? (12)''.

సుగ్రీవుని మాటలువిని రాముడు కన్నులనీరు నిండగా సుగ్రీవుని ఆలింగనము చేసికొని ''నీవు భయపడ వలదు. మీ యిద్దరు ఒకే రూపమున నుండుట చూచి, (తొందరపాటున) మిత్రుడవగు నిన్ను గాయపరచెదనేమో నని నారాచము విడిచి పెట్టనైతిని. ఇపుడే నా భ్రమ శమించుటకు నీకొక గురుతు నుంచెదను (13-14). మరల పోయి, శత్రువును పిలువుము. వాలి నిహతుడు కాగా చూడగలవు. సోదరా! నేను, రాముడను నీపై ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. శత్రువును క్షణములో వధించెదను. (15)''

సుగ్రీవునకు ఈ విధముగా ఊరట కలిగించి, లక్ష్మణునితో రాముడు ఇట్లనెను ''వికసించిన పుష్పముల మాలనొకదానిని సుగ్రీవుని మెడలో వేయుము (16). భాగ్యశాలీ! ఇతనిని వాలితో యుద్ధమునకు ప్రేరేపింపుము'' అనిన విని లక్ష్మణుడు అట్లే మాలను వేసి ''పద పద'' మని సాదరముగా (17) యుద్ధమునకు పంపెను. సుగ్రీవుడు కూడ వెళ్లి అట్లే చేసెను. మరల మరొకసారి అద్భుతమగు గర్జన చేయుచు వాలిని పోరికి పిలిచెను (18). అదివిని వాలి క్రోధపరవశుడై యుద్ధమునకు బయలుదేరుటకు ఆయత్తమయ్యెను (19).

అటుల బయలుదేరిన వాలిని యథార్థము గుర్తించి, తార నిరోధించెను – ''ఇపుడు మీరు పోతగదు. ఈ విషయమున అత్యంతము అనుమానము కలుగుచున్నది.

ఇదానీమేవ తే భగ్నః పునరాయాతి సత్వరః.
సహాయో బలవాం స్తస్య కశ్చిన్నూనం సమాగతః. 21

ఇప్పటికిపుడే నీచే భంగపడి, అతడు తిరిగి సత్వరుడై వచ్చినాడు. బలవానుడగు ఎవడో ఆతనికి తప్పనిసరిగా సహాయుడై వచ్చియుండి యుండును'' (20-21).

వాలీ తామాహ హే సుభ్రు శంకాం తే వ్యేతు తద్గతా,
ప్రియే కరం పరిత్యజ్య గచ్ఛ గచ్ఛామి తం రిపుమ్. 22

హత్వా శీఘ్రం సమాయాస్యే సహాయస్తస్య కో భవేత్,
సహాయో యది సుగ్రీవస్తతో హత్వోభయం క్షణాత్.23

అయాస్యే మా శుచః శూరః
కథం తిష్ఠేద్గృహే రిపుమ్.
జ్ఞాత్వాప్యాహ్వయమానం హి
హత్వాఽ యాస్యామి సుందరి. 24

వాలి ఆమెతో ఇట్లనెను - ''భ్రూవిలాసినీ! నీకు జనించిన శంక తొలగుగాక! ప్రియా! నా చేయి విడువుము. పొమ్ము - నేను శత్రువు వద్దకు పోయెదను (22). వానికి తోడు ఎవ్వరైన యుండిన యుండుగాక! వానిని వధించి తిరిగి వత్తును. అయినను సుగ్రీవునకు సాయమెవరిత్తురు? ఇచ్చినను ఇద్దరనొక్కమారే చంపి, తిరిగి వచ్చెదను కదా! శంకించవలదు. శత్రువు ఉన్నాడని తెలిసియుండి, యుద్ధమునకు పిలువబడియుండియు శూరుడెట్లు ఇంటిలో నిలిచియుండగలుగును? వధించి తిరిగి వచ్చెదను సుందరీ!'' (24).

తారోవాచ

మత్తోఽన్యచ్ఛృణు రాజేంద్ర శ్రుత్వా కురు యథోచితమ్,
అహ మామంగదః పుత్రో మృగయాయాం శ్రుతం వచః. 25

అయోధ్యాధిపతిః శ్రీమాన్ రామో దాశరథిః కిల,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా భార్యయా సహ. 26

ఆగతో దండకారణ్యం తత్ర సీతా హృతా కిల,
రావణేన సహ భ్రాత్రా మార్గమాణోఽథ జానకీమ్. 27

ఆగతో ఋష్యమూకాద్రిం సుగ్రీవేణ సమాగతః,
చకార తేన సుగ్రీవః సఖ్యం చానలసాక్షికమ్. 28

ప్రతిజ్ఞాం కృతవాన్ రామః సుగ్రీవాయ సలక్ష్మణః,
వాలినం సమరే హత్వా రాజానం త్వాం కరోమ్యహమ్. 29

తార ఇట్లు చెప్పెను - ''వానరాధిపా! మరల మరికొంత నా నుండి వినుము! పిదప యథోచితముగా చేయుము. మన కుమారుడు అంగదుడు వనములో వేటకు పోయినపుడు వినబడిన మాటలు నాతో చెప్పెను. శ్రీమంతుడు అయోధ్యాపతి దాశరథి యట! సోదరుడు లక్ష్మణునితో, భార్య సీతతో దండకారణ్యమునకు వచ్చెను. అచట సీత రావణుని చేత అపహరించబడెనట! తమ్ముని సాయమున జానకి జాడలు తీయుచు అతడు ఋష్యమూక గిరిపై సుగ్రీవునితో సమాగమము చేసెను. ఆతనితోడ అగ్ని సాక్షికముగా మైత్రి చేసికొనెను (25-28). లక్ష్మణ యుతుడైన రాముడు సుగ్రీవుని కొరకై ''యుద్ధమున వాలిని చంపి నిన్ను నేను రాజుగా చేయుదును'' అని ప్రతిజ్ఞ చేసెను. ఇటుల నిశ్చయించి వారు వచ్చియుండిరి. ఇది నిశ్చయము. నా మాట

ఇతి నిశ్చిత్య తౌ యాతౌ నిశ్చితం శృణు మద్వచః,
ఇదానీమేవ తే భగ్నః కథం పునరుపాగతః. 30

అతస్త్వం సర్వథా వైరం త్యక్త్వా సుగ్రీవమానయ,
యౌవరాజ్యేఽభిషించాశు రామం త్వం శరణం వ్రజ. 31

పాహి మామంగదం రాజ్యం కులం చ హరిపుంగవ,
ఇత్యుక్త్వాశ్రుముఖీ తారా పాదయోః ప్రణిపత్య తమ్. 32

హస్తాభ్యాం చరణౌ ధృత్వా రురోద భయవిహ్వలా,
తామాలింగ్య తదా వాలీ సస్నేహమిదమబ్రవీత్. 33

స్త్రీస్వభావాద్బిభేషి త్వం ప్రియే నాస్తి భయం మమ,
రామో యది సమాయాతో లక్ష్మణేన సమం ప్రభుః. 34

తదా రామేణ మే స్నేహో భవిష్యతి న సంశయః,
రామో నారాయణః సాక్షదవతీర్ణోఽఖిలప్రభుః. 35

భూభారహరణార్థాయ శ్రుతం పూర్వం మయానఘే,
స్వపక్షః పరపక్షో వా నాస్తి తస్య పరాత్మనః. 36

ఆనేష్యామి గృహం సాధ్వి నత్వా తచ్చరణాంబుజమ్,
భజతోఽనుభజత్యేష భక్తిగమ్యః సురేశ్వరః. 37

యది స్వయం సమాయాతి సుగ్రీవో హన్మి తం క్షణాత్,
యదుక్తం యౌవరాజ్యాయ సుగ్రీవస్యాభిషేచనమ్. 38

కథమాహూయమానోఽహం
యుద్ధాయ రిపుణా ప్రియే,
శూరోఽహం సర్వలోకానాం
సమ్మతః శుభలక్షణే. 39

వినుము. ఇపుడిపుడే నీచే యుద్ధమున భంగపడినవాడు తిరిగి ఎటుల వచ్చెను? అందువలన సర్వవిధముల వైరమును వదలి, సుగ్రీవుని రప్పింపుము. యౌవరాజ్యమున అభిషేకింపుము. నీవు రాముని శరణు పొందుటకు పొమ్ము (29-31).

హరిశ్రేష్ఠా! నన్ను, అంగదుని, వానర రాజ్యమును, వానరకులమును కూడ రక్షింపుము''. ఇటుల పలుకుచు కన్నుల నీరు దొరలగా, వాలి పాద ద్వయమునకు నమస్కరించి, చేతులతో చరణములు గట్టిగా పట్టుకొని భయవిహ్వలురాలై ఎలుగెత్తి రోదింప సాగెను. ఆమెను వాలి ఆలింగనము చేసికొని, ఆదరముగా ఇట్లు పలికెను (32-33).

''ప్రియా! సహజముగు స్త్రీ స్వభావమున నీవు భయపడుచున్నావు. నాకెట్టి భయమును లేదు. ప్రభువగు రాముడు, లక్ష్మణ సంయుతుడై ఇటకు వచ్చి యుండెనేని, తప్పనిసరిగా రామునితో నాకు స్నేహము కలుగును. ఇది నిశ్చయము. పుణ్యశీలా! భూభారము తొలగింప అఖిలలోక నియామకుడు, నారాయణుడు సాక్షాత్తుగా రాముడై అవతరించినాడని ఇంతకు ముందు వినియుంటిని. ఆ పరమాత్మునకు తనవారు, పెరవారు అను పక్షపాతము ముమ్మాటికిని ఉండదు (34-36). సాధ్వీ! అతని పాదపద్మములకు నమస్కరించి, మన యింటికి తెత్తును. తనను సేవించువారిని అతడు ప్రేమించి సేవించును. సర్వేశ్వరుడగు నాతడు భక్తిచేత మాత్రమే పొందబడ తగువాడు (37). సుగ్రీవుడు కనుక స్వయముగా యుద్ధమునకు వచ్చిన క్షణములో నాతనిని చంపివేయుదును. ప్రియురాలా! యోచింపుము. శత్రువు (సుగ్రీవునిచే) చే యుద్ధమునకు ఆహ్వానము పొందిన నేను ఎట్లు నీవు చెప్పినచొప్పున సుగ్రీవునికి యౌవరాజ్యాభిషేకము చేయగలను? శుభలక్షణా! సర్వలోకములు అంగీకరించిన శూరుడను నేను.

వాలి సుగ్రీవ యుద్ధము - రాముడు బాణము సంధించుట

శ్రీరామచంద్రుడు వాలిని వధించుట

భీతభీతమిదం వాక్యం కథం వాలీ వదేత్ప్రియే,
తస్మాచ్ఛోకం పరిత్యజ్య తిష్ఠ సుందరి వేశ్మని. 40

ఏవమాశ్వాస్య తారాం తాం శోచంతీమశ్రులోచనామ్,

గతో వాలీ సముద్యుక్తః సుగ్రీవస్య వధాయ సః. 41

దృష్ట్వా వాలినమాయాంతం సుగ్రీవో భీమవిక్రమః,
ఉత్పపాత గలే బద్ధపుష్పమాలో మతంగవత్. 42

ముష్టిభ్యాం తాడయామాస వాలినం సోఽపి తం తథా,
అహన్వాలీ చ సుగ్రీవం సుగ్రీవో వాలినం తథా. 43

రామం విలోకయన్నేవ
సుగ్రీవో యుయుధే యుధి,
ఇత్యేవం యుధ్యమానౌ
తౌ దృష్ట్వా రామః ప్రతాపవాన్. 44

బాణమాదాయ తూణీరాదైంద్రే ధనుషి సందధే,
ఆకృష్య కర్ణపర్యంతమదృశ్యో వృక్షషండగః. 45

నిరీక్ష్య వాలినం సమ్యగ్లక్ష్యం తద్ధృదయం హరిః,
ఉత్ససర్జాశనిసమం మహావేగం మహాబలః. 46

బిభేద స శరో వక్షో వాలినః కంపయన్మహీమ్,
ఉత్పపాత మహాశబ్దం ముంచన్స నిపపాత హ. 47

తదా ముహూర్తం నిస్సంజ్ఞో భూత్వా చేతనమాప సః,
తతో వాలీ దదర్శాగ్రే రామం రాజీవలోచనమ్,
ధనురాలంబ్య వామేన హస్తేనాన్యేన సాయకమ్. 48

బిభ్రాణం చీరవసనం జటాముకుటధారిణమ్,
విశాలవక్షసం భ్రాజద్వనమాలావిభూషితమ్. 49

అట్లయినపుడు, భయపడుము భీరువువలె వాలి ఎటుల పలుకగలడు ప్రియా! అందువలన శోకము వీడుము! సుందరి! ఇంటియందే ఉండుము''(40).

ఇట్లు నేత్రముల దుఃఖాశ్రువుల విహారించు తారను ఊరడించి సుగ్రీవుని వధించు నుద్దేశ్యముతో వాలి యుద్యుక్తుడై వెళ్లెను (41). భీమవిక్రముడగు సుగ్రీవుడు వచ్చుచున్న వాలిని చూడగానే, గళమున చుట్టబడిన పుష్పమాల (వలన కలిగిన క్రొత్త ధైర్యము, విశ్వాసముల)తో మదపుటేనుగువలె ముందు కురికెను (42).

పిడికిళ్లు బిగించి వాలిని సుగ్రీవుడు కొట్టగా, వాలి సుగ్రీవుని మోదెను. వాలి సుగ్రీవుని, సుగ్రీవుడు వాలిని కొట్టుకొనసాగిరి (43). అంతసేపు రాముని దిస చూచుచునే సుగ్రీవుడు యుద్ధము చేసెను. ప్రతాపవంతుడగు రాముడు హరి, వారిద్వరు యుద్ధములో నిమగ్నులై యుండగా, తూణీరమునుండి బాణము తీసి, ఇంద్రధనుస్సున సంధించి, ఆకార్ణాంతము లాగి, వృక్ష సమూహముల మాటున దాగియుండి, వాలిని బాగుగా చూచి, వాని హృదయమును లక్ష్యముగా చేసికొని, మహాబలుడైన యాతడు, పిడుగుపాటువంటి సాయకమును వదలిపెట్టెను (44-46). భూమిని కంపింప చేయుచు, వాలి ఎదురురొమ్మును రాముని యమ్ము చీల్చివేసెను. గొప్ప నాదము చేయుచు వాలి ఎగిరి క్రింద పడెను (47).

అంతట ముహూర్తకాలము స్పృహతప్పి పడిన వాలి, తెలివి తెచ్చుకొని రాజీవలోచనుని, ఎడమచేతిలో ధనువును కుడిచేత వేరొక బాణమును పట్టి, నారచీరలు కట్టి, జటామకుటము చుట్టి, వెడదరొమ్మున వనమాలా

పీనచార్వాయతభుజం నవదూర్వాదలచ్ఛవిమ్,
సుగ్రీవలక్ష్మణాభ్యాం చ పార్శ్వయోః పరిసేవితమ్. 50

విలోక్య శనైః ప్రాహ వాలీ రామం విగర్హయన్,
కిం మయాపకృతం రామ తవ యేన హతోఽస్మ్యహమ్. 51

రాజధర్మమవిజ్ఞాయ గర్హితం కర్మ తే కృతమ్,
వృక్షషండే తిరో భూత్వా త్యజతా మయి సాయకమ్. 52

యశః కిం లప్స్యసే రామ చోరవత్కృతసంగరః,
యది క్షత్రియదాయాదో మనోర్వంశసముద్భవః. 53

యుద్ధం కృత్వా సమక్షం మే ప్రాప్స్యసే తత్ఫలం తదా,
సుగ్రీవేణ కృతం కిం తే మయా వా న కృతం కిము. 54

రావణేన హృతా భార్యా తవ రామ మహావనే,
సుగ్రీవం శరణం యాతస్తదర్థమితి శుశ్రుమ. 55

బత రామ న జానీషే మద్బలం లోకవిశ్రుతమ్,
రావణం సకులం బద్ధ్వా ససీతం లంకయా సహ. 56

ఆనయామి ముహూర్తార్ధాద్యది చేచ్ఛామి రాఘవ,
ధర్మిష్ఠ ఇతి లోకేఽస్మిన్ కథ్యసే రఘునందన. 57

వానరం వ్యాధవద్ధత్వా ధర్మం కం లప్స్యసే వద,
అభక్ష్యం వానరం మాంసం హత్వా మాం కిం కరిష్యసి. 58

ఇత్యేవం బహు భాషంతం వాలినం రాఘవోఽబ్రవీత్,
ధర్మస్య గోప్తా లోకేఽస్మింశ్చరామి సశరాసనః. 59

అధర్మకారిణం హత్వా సద్ధర్మం పాలయామ్యహమ్,
దుహితా భగినీ భ్రాతుర్భార్యా చైవ తథా స్నుషా. 60

విభూషణమును పెట్టి బలిష్ఠములు, విశాలములగు భుజములతో, నవీన దూర్వాంకుర ఛాయతో, ఇరువంకల సుగ్రీవ సౌమిత్రులు సేవించుచుండ (48-50) చూచి, రాముని గర్హించుచు వాలి తిరస్కారవాక్యము లిట్లు పలికెను - "రామా! నా వలన ఏ అపకారము పొందితివని నీచేత నేను వధింపబడితిని? (51).

రాజధర్మము ఎరుగక నీవిట్టి నిందనీయమగు కర్మ చేసితివి. కావుననే చెట్లగుంపుల మాటున దాగి నాయందు బాణము వదలితివి (52). దొంగవలె యుద్ధము చేయుట వలన నీకేమి కీర్తి కలుగును శ్రీరామా? నీవే మనువంశ సముద్భవమైన క్షత్రియవంశజుడవే అయియుండిన నా సమ్ముఖమున నాతో యుద్ధము చేసి ఫలము పొందియుండవలసినది! సుగ్రీవుని చేత నీకొనరింపబడినది ఏది? నావలన కానిదేది? (53-54). నీ భార్య దండకవనములో రావణుని చేత అపహరింపబడినదని, అందులకై (సీతాన్వేషణలో సాయమునకై) సుగ్రీవుని శరణు వేడితివని వినియుంటిని. అయ్యో! లోక విశ్రుతమైన నా బలమును రామా! ఎరుగనైతివి కదా! రాఘవా! నేనే సంకల్పించియుండిన, రావణుని సకలవంశముతో కట్టి, లంకతో సహా సీతను పట్టి అర్ధముహూర్తకాలములోనే తెచ్చియుండెడివాడనే! రఘునందనా! లోకములో నీవు ధర్మిష్ఠుడవని చెప్పుకొందురే! నన్ను, ఒక వానరుని, బోయవానివలె మాటున పొంచియుండి చంపి, నీవు ఏ ధర్మము (పుణ్యము) పొందితివి? వానరమాంసము తినుటకు పనికిరాదు. మరి నన్ను చంపి నీవేమి చేసికొందువు? (55-58)"

ఇటుల అసంబద్ధముగా వదరాడిన వాలితో (సమాధానముగా) రాఘవుడు పలికెను - "నేను ధర్మరక్షకుడనై విల్లంబులు చేతపట్టి ఈ లోకమున మెట్టినాను. అధర్మపరులను వధించి సద్ధర్మమును పరిపాలించెదను. కుమార్తె, సోదరి, తమ్ముని భార్య, కోడలు నలుగురు సమానులే. వారిలో ఏ ఒక్కరితో

సమా యో రమతే తాసామేకామపి విమూఢధీః,
పాతకీ స తు విజ్ఞేయః స వధ్యో రాజభిః సదా. 61

సంభోగించినను, మనసు ఉంచినను వాడు మూఢాత్ముడు, మహాపాపి యని తెలియతగును. ప్రభువుచేత వాడెల్లపుడు వధ్యుడు (59-61). ఇప్పు! వనగోచరా! నీవు చిన్న సోదరుని భార్యతో బలాత్కారముగా రమించుచుంటివి. అందువలననే ధర్మవేత్తనగు నాచేత నీవు చంపబడితివి. (దండింపబడితివి) (62).

త్వం తు భ్రాతుః కనిష్ఠస్య భార్యాయాం రమసే బలాత్,
అతో మయా ధర్మవిదా హతోఽసి వనగోచర. 62

త్వం కపిత్వాన్న జానీషే మహాంతో విచరంతి యత్,
లోకం పునానాః సంచారైరతస్తాన్నాతిభాషయేత్. 63

నీవు జాతికి వానరుడవై (తెలివిలేని జంతువుగా) యుండి, మహాత్ములైనవారు లోకములను పవిత్రము చేయుటకే ఇటుల సంచరించెదరని తెలియకుంటివి. వారితో మితిమీరి మాటలాడరాదు (63)".

తచ్ఛ్రుత్వా భయసంత్రస్తో జ్ఞాత్వా రామం రమాపతిమ్,
వాలీ ప్రణమ్య రభసాద్రామం వచనమబ్రవీత్. 64

రాముడాడిన యీ మాటలు విని, రాముడు రమాపతి యని తెలిసికొని, భయవ్యాకులుడై, వాలి యాతనికి ప్రణమిల్లి, సంభ్రమముగా రామునితో ఇట్లనెను (64) -

రామ రామ మహాభాగ జానే త్వాం పరమేశ్వరమ్,
అజానతా మయా కించిదుక్తం తత్ క్షంతుమర్హసి. 65

సాక్షాత్త్వచ్ఛరఘాతేన విశేషేణ తవాగ్రతః,
త్యజామ్యసూన్మహాయోగిదుర్లభం తవ దర్శనమ్. 66

"రాఘవా! శ్రీరాఘవా! మహానుభావా! నీవు పరమేశ్వరుడవని తెలిసికొంటిని. తెలియనితనముచే నాచే చులకనగా పలుకబడినదానికి క్షంతవ్యుడను. స్వయముగా నీ బాణముతో కొట్టబడి, విశేషవిధముగా నీ కన్నెదుట యీ కట్టెనుండి ప్రాణములు విడుచున్నాను. నీ దర్శనము మహర్షులకు గూడ దుర్లభము (65-66). అవశు డైనను, మరణించువేళ ఏ దివ్యనామము నోటబల్కిన, పరమపదము లభించునో అట్టి నామాంకితుడవగు నీవు స్వయముగా నాముందు నిలిచియుంటివా! తండ్రీ!" (67).

యన్నామ వివశో గృహ్ణన్
మ్రియమాణః పరం పదమ్,
యాతి సాక్షాత్స ఏవాద్య
ముమూర్షోర్మే పురః స్థితః. 67

దేవ జానామి పురుషం
త్వాం శ్రియం జానకీం శుభామ్,
రావణస్య వధార్థాయ
జాతం త్వాం బ్రహ్మణార్థితమ్. 68

"దేవా! నిన్ను పరమపురుషునిగా (విష్ణు భగవానునిగా) శుభకరురాలు జానకిని లక్ష్మిగా ఎరిగితిని. నీవే బ్రహ్మచే ప్రార్థింపబడి రావణవధార్థమై ఆవిర్భవించితివని తెలిసికొంటిని" (68).

అనుజానీహి మాం రామ యాంతం తత్పదముత్తమమ్,
మమ తుల్యబలే బాలే అంగదే త్వం దయాం కురు. 69

"రామా! నీ యుత్తమపదమునకు పోవుచున్న నాకు అనుమతి నిమ్ము. నాతోడి సమాన బలశాలి అంగదుని యందు నీ దయ చూపుము (69). నీ చేతితో హృదయము (రొమ్ము)ను తాకి, బాణము పెకలించి వేయుము రామా!" ఇటుల ప్రార్థించగా 'అట్లే' యనని రాముడు వాలిని చేతితో ప్రేమగా తాకెను. ఆ వానరుడు దేహము వదలిపెట్టి మరుక్షణములో అమరేంద్రుడయ్యెను (70).

విశల్యం కురు మే రామ
హృదయం పాణినా స్పృశన్,
తథేతి బాణముద్ధృత్య
రామః పస్పర్శ పాణినా,
త్యక్త్వా తద్వానరం దేహ
మమరేంద్రోఽభవత్క్షణాత్. 70

వాలీ రఘూత్తమశరాభిహతో విమృష్టో
రామేణ శీతలకరేణ సుఖాకరేణ,
సద్యో విముచ్య కపిదేహమనన్యలభ్యం
ప్రాప్తః పదం పరమహంసగణైర్దురాపమ్. 71

రఘూత్తముని బాణముచే కొట్టబడి, సర్వ సుఖముల అంకురింపచేయు రాముని చల్లని స్పర్శచేత, కపిదేహమును వెంటనే వదలి, అనన్యలభ్యము, పరమ యోగి గణములకు కూడా చేరరానిదియగు దివ్య పదమును వాలి వెంటనే పొంద గలిగెను (71).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ ద్వితీయ సర్గము ॥ 2 ॥

----****----

ఓమ్

తృతీయ సర్గము

తారావిలాపము - శ్రీరామసాంత్వనము - సుగ్రీవ పట్టాభిషేకము

శ్రీమహాదేవ ఉవాచ

నిహతే వాలిని రణే రామేణ పరమాత్మనా,
దుద్రువుర్వానరాః సర్వే కిష్కింధాం భయవిహ్వలాః. 1

శ్రీమహాదేవుడిట్లనెను – "పార్వతీ! పరమాత్ముడైన రామునిచే వాలి వధింపబడగనే అతని అనుయాయులు వానరులందరు భయవిహ్వలులై కిష్కింధలోనికి పరుగులు తీసిరి. వారు తారతో ఇట్లనిరి "మహాభాగా! రణాంగణమున వాలి నేలకొరిగినాడు! అంగదుని రక్షించుకొనుము. ఇపుడు మంత్రులను అప్రమత్తుల చేయుము (1-2).

తారామూచుర్మహాభాగే హతో వాలీ రణాజిరే,
అంగదం పరిరక్షాద్య మంత్రిణః పరినోదయ. 2

భామినీ! కిష్కింధకు నాల్గువంకల ద్వారములు బంధించి, నగరరక్షణ చేయుదుము. అంగదుని వానరరాజుగా అభిషేకము చేయుము" (3).

చతుర్ద్వారకపాటాదీన్ బద్ధ్వా రక్షామహే పురీమ్,
వానరాణాం తు రాజానమంగదం కురు భామిని. 3

వాలి నిహతుడయ్యెనని విని తార శోకావిష్టురాలై, చేతులతో పదేపదే శిరసును, ఎదను బాదుకొనసాగెను (4).

నిహతం వాలినం శ్రుత్వా తారా శోకవిమూర్ఛితా,
అతాడయత్స్వపాణిభ్యాం శిరో వక్షశ్చ భూరిశః. 4

"ఇంక అంగదుడేల! రాజ్యముతో ఏమున్నది! నగరము ఎందులకు? ధనము నాకేల! ఇటులే పోయి పతితో సహగమనము చేయుదును (5)". ఇట్లు పలికి, రోదించుచు తల వెంట్రుకలు విడివడ, తార శోకార్తురాలై, వడివడిగా భర్త కళేబరము పడియున్నచోటికి పరుగెత్తెను (6).

కిమంగదేన రాజ్యేన నగరేణ ధనేన వా,
ఇదానీమేవ నిధనం యాస్యామి పతినా సహ. 5

ఇత్యుక్త్వా త్వరితా తత్ర రుదతీ ముక్తమూర్ధజా,
యయౌ తారాతిశోకార్తా యత్ర భర్తృకలేవరమ్. 6

రక్తసిక్తాంగుడై ధూళిధూసరితుడై విగతజీవుడై పడియున్న వాలిని చూచి 'నాథా! నాథా!' అనుచు రోదించుచు, తార వాలి పాదములపై కుప్పకూలెను (7).

పతితం వాలినం దృష్ట్వా రక్తైః పాంసుభిరావృతమ్,
రుదతీ నాథనాథేతి పతితా తస్య పాదయోః. 7

చూచువారలకు జాలి గొలుపునటుల రోదించుచు ఆమె రఘునందనుని చూచినది – 'రామా! ఏ బాణముచే నా స్వామి వాలి నిహతుడయ్యెనో, దానితో నన్నును చంపుము. నేనును పతిపోయిన లోకమునకు పోయెదను. అతడు నా కొరకై అట ఒంటరియై ఎదురుచూచును! నేను ప్రక్కనలేక అతనికి స్వర్గములో కూడ ఎట్టి సుఖమును ఉండదు (8-9).

కరుణం విలపంతీ సా
దదర్శ రఘునందనమ్,
రామ మాం జహి బాణేన
యేన వాలీ హతస్త్వయా. 8

గచ్ఛామి పతిసాలోక్యం
పతిర్మామభికాంక్షతే,
స్వర్గేఽపి న సుఖం తస్య
మాం వినా రఘునందన. 9

అనఘుడా! నీచేత పత్నీవియోగ దుఃఖము అనుభవింపబడినదే కదా! వాలి కడకు నన్ను వెంటనే పంపుము. నీకు పత్నీదాన ఫలము లభించగలదు. (10).

పత్నీవియోగజం దుఃఖమనుభూతం త్వయానఘ,
వాలినే మాం ప్రయచ్ఛాశు పత్నీదానఫలం భవేత్. 10

సుగ్రీవ త్వం సుఖం రాజ్యం
ప్రాపితం వాలిఘాతినా,
రామేణ రుమయా సార్ధం
భుంక్ష్వ సాపత్నవర్జితమ్. 11

సుగ్రీవా! వాలిని వధించిన రామునిచే అతి సులభముగా నీకు రాజ్యము అప్పగించబడినది. ఇక శత్రువులే లేని నిష్కంటక వానర సామ్రాజ్యమును, రుమతో కలసి అనుభవించుము (11).

ఇత్యేవం విలపంతీం తాం
తారాం రామో మహామనాః,
సాంత్వయామాస దయయా
తత్త్వజ్ఞానోపదేశతః. 12

కిం భీరు శోచసి వ్యర్థం శోకస్యావిషయం పతిమ్.
పతిస్తవాయం దేహో వా జీవో వా వద తత్త్వతః. 13

ఇట్లు విలపించుచున్న తారను చూచి మహామనస్వియగు రాముడు దయాపూర్వకముగా తత్త్వోపదేశముతో ఆమెను ఓదార్చిన వాడాయెను - ''భయశీలురాలా! శోకింపతగని విషయమగు పతికై ఏల వ్యర్థముగా శోకించెదవు? నీ పతియనువాడు ఇక్కడ పడియున్న శరీరమా! లేక అందుండు జీవుడా! యోచించి తత్త్వము నెరిగి తెలుపుము! (13). దేహమే నీ పతి యందువా! ఇది జడము. పంచ భూతాత్మకము. చర్మ, మాంస, రుధిరములతో, ఎముకలతో నిర్మించబడినది. ఇది కాలము, కర్మము, గుణముల వలన ఉత్పన్నమైనది. ఇది ఇంతకు ముందు (వాలి చనిపోకముందు), ఇపుడు (వాలి చనిపోయిన తరువాత) కూడా నీ ఎదురుగానే యున్నది (14)(దీనికై దుఃఖింతువా!)

పంచాత్మకో జడో దేహస్త్వఙ్మాంసరుధిరాస్థిమాన్.
కాలకర్మగుణోత్పన్నః సోఽప్యాస్తేఽద్యాపి తే పురః. 14

మన్యసే జీవమాత్మానం జీవస్తర్హి నిరామయః.
న జాయతే న మ్రియతే న తిష్ఠతి న గచ్ఛతి. 15

లేదా జీవుడే నీ పతి యందువా! (అపుడును శోకింప నవసరము లేదు. ఏలయందువా) జీవుడు నిరామయుడు. (నిర్వికారి). జననమొందడు. నాశము కాడు. ఒకచోట నిలువడు. ఒకచోటనుండి మరొకచోటికి కదలడు (15). జీవుడు స్త్రీ పురుష, నపుంసకములలో ఏదియును కాదు. జీవుడు సర్వగతుడు, అవ్యయుడు. ఒక్కడే ఒక్కడు. రెండవవాడు (సాటియైనవాడు) లేనివాడు, (సజాతీయ, విజాతీయ, స్వగత భేదములు లేవు). ఆకాశమువలె నిర్లేపుడు. నిత్యుడు. జ్ఞానమయుడు, శుద్ధుడు. అట్టి జీవునికొరకు ఏడ్చెదవేల? (16)''

న స్త్రీ పుమాన్వా షండో వా జీవః సర్వగతోఽవ్యయః.
ఏక ఏవాద్వితీయోఽయమాకాశవదలేపకః.
నిత్యో జ్ఞానమయః శుద్ధః స కథం శోకమర్హతి. 16

తారోవాచ

దేహోఽచిత్కాష్ఠవద్రామ
జీవో నిత్యశ్చిదాత్మకః.
సుఖదుఃఖాదిసంబంధః
కస్య స్యాద్రామ మే వద. 17

తార ఇట్లడిగెను ''రామా! దేహము కాష్ఠమువలె జడము! జీవుడు నిత్యుడు, చైతన్యస్వరూపుడు. అట్లయిన రామా! సుఖదుఃఖాదులతో సంబంధము దేనివల్ల కలుగు చుండును? తెలుపుము''(17).

శ్రీరామ ఉవాచ

అహంకారాదిసంబంధో యావద్దేహేంద్రియైః సహ,
సంసారస్తావదేవ స్యాదాత్మనస్త్వవివేకినః. 18

మిథ్యారోపితసంసారో న స్వయం వినివర్తతే,
విషయాంధ్యాయమానస్య స్వప్నే మిథ్యాగమో యథా. 19

అనాద్యవిద్యాసంబంధా
త్తత్కార్యాహంకృతేస్తథా,
సంసారోఽపార్థకోఽపి
స్యాద్రాగద్వేషాది సంకులః. 20

మన ఏవ హి సంసారో బంధశ్చైవ మనః శుభే,
ఆత్మా మనః సమానత్వమేత్య తద్గతబంధభాక్. 21

యథా విశుద్ధః స్ఫటికోఽలక్తకాదిసమీపగః,
తత్తద్వర్ణయుగాభాతి వస్తుతో నాస్తి రంజనమ్. 22

బుద్ధీంద్రియాదిసామీప్యా దాత్మనః సంసృతిర్బలాత్,
ఆత్మా స్వలింగం తు మనః పరిగృహ్య తదుద్భవాన్. 23

కామాన్ జుషన్ గుణైర్బద్ధః
సంసారే వర్తతేఽవశః,
ఆదౌ మనోగుణాన్ సృష్ట్వా
తతః కర్మాణ్యనేకధా. 24

శుక్లలోహితకృష్ణాని
గతయస్తత్సమానతః,
ఏవం కర్మవశాజ్జీవో
భ్రమత్యాభూతసంప్లవమ్. 25

రాఘవుడిట్లనెను "ఎంతదనుక దేహముతో, ఇంద్రియములతో అహంకార మమకారముల ద్వారా సంబంధము కలిగియుండునో, అంతవరకు, ఆత్మ అనాత్మతత్త్వ వివేకహీనులకు సుఖదుఃఖాది భోగ శోక రూప సంసారముతో సంబంధము ఉండి తీరును (18). సంసారము ఆత్మయందు మిథ్యగా ఆరోపితము. విషయములనే ధ్యానించు వానికి, స్వప్నములో మిథ్యాపదార్థములు దర్శించువానివలె (స్వప్నము తొలగగనే పదార్థములు మాయమైనట్లు) తనంతతాను సంసారము విడివడదు. కేవలము జ్ఞానము కలిగిననే సంసారము తొలగును (19).

"అవిద్యాసంబంధము వలన, తత్కార్యరూపమైన అహంకారము వలన, దానితో సంబంధము ఉండుటవలన ఈ సంసారము అవాస్తవికమయ్యును రాగద్వేషములతో నిండియుండును (20). శుభాంగి! మనస్సే సంసారము, మనస్సే బంధము కూడా! ఆత్మ మనస్సుతో ఏకమగుట వలననే జీవుడు (ఆత్మ) తత్సంబంధములైన సుఖదుఃఖాది రూప బంధములు పొందుచున్నాడు. శుద్ధమైన స్ఫటికము స్వాభావికముగ వర్ణరహితమైనను (స్వచ్ఛమైనను) లక్కవంటి పదార్థముల సమీపముతో వాటి వర్ణములు పొందును. నిజమునకు స్ఫటికమునందు ఆ యా రంగు లుండవు (22). బుద్ధి ఇంద్రియాదులకు సమీపముగా ఉండుట వేత, ఆత్మకు బలవంతముగా సంసారము ఏర్పడుట వలన, ఆత్మ తనను గుర్తింపతగు మనసును స్వీకరించి, దానివలన పుట్టు రాగద్వేషాది గుణముల ప్రభావమునకు లోనై, సంసారచక్రమున తగులుకొనును. మొదట మనసు రాగద్వేషాది గుణములు రచించును. పిమ్మట జీవుని మనోభినివేశమువలన నానావిధకర్మలు ఆచరించుచుండును (23-24). ఆ కర్మలు జపధ్యానాదుల శుక్లములని, హింసాయుత యజ్ఞాదులు లోహితములని, మద్యపానాది, అభిచార హోమాది కర్మలు కృష్ణములని మూడు విధములు. ఈ కర్మలను అనుసరించి వాని గతులు కలుగును. ఇట్లు జీవుడు కర్మలకు వశీభూతుడై, ప్రళయ పర్యంతము జనన మరణ చక్రములో పడియుండును (25).

సర్వోపసంహృతౌ జీవో వాసనాభిః స్వకర్మభిః,
అనాద్యవిద్యావశగస్తిష్ఠత్యభినివేశతః. 26

సృష్టికాలే పునః పూర్వవాసనామానసైః సహ,
జాయతే పునరప్యేవం ఘటీయంత్రమివావశః. 27

యదా పుణ్యవిశేషేణ
లభతే సంగతిం సతామ్,
మద్భక్తానాం సుశాంతానాం
తదా మద్విషయా మతిః. 28

మత్కథాశ్రవణే శ్రద్ధా దుర్లభా జాయతే తతః,
తతః స్వరూపవిజ్ఞాన మనాయాసేన జాయతే. 29

తదాచార్యప్రసాదేన వాక్యార్థజ్ఞానతః క్షణాత్,
దేహేంద్రియమనః ప్రాణాహం కృతిభ్యః పృథక్స్థితమ్.
30

స్వాత్మానుభవతః సత్య మానందాత్మానమద్వయమ్,
జ్ఞాత్వా సద్యో భవేన్ముక్తః సత్యమేవ మయోదితమ్. 31

ఏవం మయోదితం సమ్యగాలోచయతి యోఽనిశమ్,
తస్య సంసారదుఃఖాని న స్పృశంతి కదాచన. 32

త్వమప్యేతన్మయా ప్రోక్తమాలోచయ విశుద్ధధీః,
న స్పృశ్యసే దుఃఖజాలైః కర్మబంధాద్విమోక్ష్యసే. 33

పూర్వజన్మని తే సుభ్రు కృతా మద్భక్తిరుత్తమా,
అతస్తవ విమోక్షాయ రూపం మే దర్శితం శుభే. 34

ధ్యాత్వా మద్రూపమనిశమాలోచయ మయోదితమ్,
ప్రవాహపతితం కార్యం కుర్వత్యపి న లిప్యసే. 35

మరల ప్రళయకాలమున భూతములన్నియు లయమైనను, కర్తృత్వ భోక్తృత్వములందలి అభినివేశముచే పూర్వవాసనలు, కర్మలతో అవిద్యావశమైన స్థితిలో ఉండును (26). సృష్టి కాలమునందు తన పూర్వవాసనలున్న మనసుతో కూడి ఘటీ[1] యంత్రమువలె తిరిగి మరల మరల పుట్టుచునే యుండును (27). ఏదేని పుణ్యవిశేషముచేత సత్పురుషుల సంగతి పొందగలిగినను శాంత స్వభావులై, సర్వకాలము లందు నాయందే మనసు నిలుపగలుగు నాభక్తుల సాంగత్యము పొందగలిగినను, నా కథలు వినుటయందు అనన్యదుర్లభమైన శ్రద్ధ జనించును. తద్వారా అతి సులభముగా సచ్చిదానంద స్వరూప జ్ఞానము లభించును. ఆయా ఆచార్యుల అనుగ్రహమువలన, 'తత్త్వమసి' ఇత్యాది మహావాక్యముల అర్థము తెలిసికొనుట ద్వారా, స్వకీయ మగు అనుభవముచేత, ఆత్మను సచ్చిదానంద స్వరూపమని, అద్వితీయమని, దేహేంద్రియ ప్రాణ అహంకారముల కన్నను వేరు అని గుర్తించి క్షణములో సంసారమునుండి విముక్తుడగును. నేను నీకు సత్యమునే చెప్పితిని (28-31). ఇటుల నేను తెలిపినది ఎల్లప్పుడు ఎడతెగకుండగ ఎవరు ధారణ మననములు చేయుదురో వారిని సంసార సుఖ దుఃఖములు ఎపుడును స్పృశించవు (32). నీవును నిర్మలమైన మనసు కలదానవై దీనినంతయు బాగుగా మననము చేయుము. దుఃఖములు నిన్నంటవు. కర్మబంధనములనుండి విముక్తురాలవయ్యెదవు (33). శోభనే! సుభ్రూ విలాసినీ! నీవు పూర్వజన్మములో నా ఉత్తమ భక్తురాలవు. అందువలననే నీ విమోక్షణకై నారూపము దర్శింపచేసితిని (34). నా దివ్య మంగళ విగ్రహమునే ధ్యానించుచు నా సూక్తములనే మననము చేయుము, ప్రారబ్ధ కర్మప్రవాహ పతితవైనను, కర్మాచరణము చేసినను ఫలము నిన్నంటదు''(35).

1 ఘటీయంత్రము: ఒక చక్రము యొక్క అంచునకు నీరు నింపగల అరలుండును. అది తిరుగునపుడు ప్రతి ఒక అర క్రిందికి దిగి నీటిని నింపుకొని వెలుపలికి వచ్చి, నీటిని పాలములో జారవిడిచి, మరల క్రిందికి దిగును. జీవుడు ఇట్టివాడే యనుట

శ్రీరామేణోదితం సర్వం శ్రుత్వా తారాఽతివిస్మితా,
దేహాభిమానజం శోకం త్యక్త్వా నత్వా రఘూత్తమమ్. 36

ఆత్మానుభవసంతుష్టా జీవన్ముక్తా బభూవ హ,
క్షణసంగమమాత్రేణ రామేణ పరమాత్మనా. 37

అనాదిబంధం నిర్ధూయ ముక్తా సాపి వికల్మషా,
సుగ్రీవోఽపి చ తచ్ఛ్రుత్వా రామవక్త్రాత్సమీరితమ్. 38

జహావజ్ఞానమఖిలం స్వస్థచిత్తోఽభవత్తదా,
తతః సుగ్రీవమాహేదం రామో వానరపుంగవమ్. 39

భ్రాతుర్జ్యేష్ఠస్య పుత్రేణ యద్యుక్తం సాంపరాయికమ్,
కురు సర్వం యథాన్యాయం సంస్కారాది మమాజ్ఞయా. 40

తథేతి బలిభిర్ముఖ్యైర్వానరైః పరిణీయ తమ్,
వాలినం పుష్పకే క్షిప్త్వా సర్వరాజోపచారతః. 41

భేరీదుందుభినిర్ఘోషై ర్బ్రాహ్మణైర్మంత్రిభిః సహ,
యూథపైర్వానరైః పౌరైస్తారయా చాంగదేన చ. 42

గత్వా చకార తత్సర్వం యథాశాస్త్రం ప్రయత్నతః,
స్నాత్వా జగామ రామస్య సమీపం మంత్రిభిః సహ. 43

నత్వా రామస్య చరణౌ సుగ్రీవః ప్రాహ హృష్టధీః,
రాజ్యం ప్రశాధి రాజేంద్ర వానరాణాం సమృద్ధిమత్. 44

దాసోఽహం తే పాదపద్మం సేవే లక్ష్మణవచ్చిరమ్,
ఇత్యుక్తో రాఘవః ప్రాహ సుగ్రీవం సస్మితం వచః. 45

త్వమేవాహం న సందేహః శీఘ్రం గచ్ఛ మమాజ్ఞయా,
పురరాజ్యాధిపత్యే త్వంస్వాత్మానమభిషేచయ. 46

నగరం న ప్రవేక్ష్యామి చతుర్దశ సమాః సఖే,
ఆగమిష్యతి మే భ్రాతా లక్ష్మణః పత్తనం తవ. 47

శ్రీరాముడు చెప్పిన మాటలన్నియు విని, తార ఆశ్చర్యనిమగ్నయై దేహాభిమాన జన్యమగు శోకము విడిచి, రఘూత్తమునికి ప్రశాంతచిత్తయై నమస్కరించి, ఆత్మానుభవ సంతుష్టురాలై, జీవన విముక్త అయ్యెను. ఇదంతయు రాముని సన్నిధిలో క్షణ సంగమ కాలముననే అనాది బంధరూప అవిద్యను తొలగించుకొని ముక్తురాలై విగత కల్మష అయినది. రాముడు చెప్పినదంతయు విని సుగ్రీవుడు కూడ అజ్ఞానమును తొలగించుకొనెను. స్వస్థచిత్తము గల వాడాయెను. తదుపరి రాముడు వానరపుంగవుడగు సుగ్రీవునితో ఇట్లు చెప్పెను (39) - ''నీ యన్న కుమారుడగు అంగదునిచేత వంశపరంపరాగతమైన అంత్యక్రియా పరికర్మలను యథావిధిగా నా ఆజ్ఞగా చేయింపుము'' (40). ఆజ్ఞయని బలిష్ఠులగు వానరవీరులనుకూడి వాలి కళేబరమును ఎత్తి , పుష్పమయవాహనమున నునిచి, సర్వరాజలాంఛనములతో, భేరీభాంకార దుందుభి నిర్ఘోషముల నడుమ, బ్రాహ్మణులు, మంత్రులతో వానర సేనాపతులతో, పౌరులతో, తారా, అంగదులతో వెడలి, శ్రద్ధతో, యథాశాస్త్రముగ అంత్యక్రియలు జరిపి, స్నానము చేసి, మంత్రులందరితో సుగ్రీవుడు రాముని సమీపమునకు పోయెను (41-43).

రాముని పాదములకు ప్రణమిల్లి సంతుష్ట మనస్కుడై ఇట్లనెను - ''సర్వ సమృద్ధమైన ఈ వానర సామ్రాజ్యమును శాసింపుమో రాజరాజేశ్వరా! (44) నేను నీకు దాసుడను. నేనును లక్ష్మణుని రీతి నీ పాదపద్మముల సేవించెదను''. ఇట్లు చెప్పిన సుగ్రీవుని చూచి రాఘవుడు చిరునవ్వుతో ఇట్లనెను - (45) ''సుగ్రీవా! నీవే నేననుటలో సందేహమేమియును లేదు (భగవానుని నిస్సీమ కారుణ్యమునకు ఇది తార్కాణము). నా ఆజ్ఞగా నీవు కిష్కింధకు పోయి సామ్రాజ్య ఆధిపత్యమునందు నీవే పట్టాభిషిక్తుడవు కమ్ము (46). ''మిత్రమా! వనవాసకాలము పదునాల్గేండ్లు ఏ నగరమును ప్రవేశింపను. నా సోదరుడు మాత్రము నీ వీటికి తప్పక రాగలడు (47).

అంగదం యౌవరాజ్యే త్వమభిషేచయ సాదరమ్,
అహం సమీపే శిఖరే పర్వతస్య సహానుజః. 48

వత్స్యామి వర్షదివసాంస్తతస్త్వం యత్నవాన్ భవ,
కించిత్కాలం పురే స్థిత్వా సీతాయాః పరిమార్గణే. 49

అంగదుని సాదరముగా యౌవ రాజ్యాభిషిక్తుని చేయుము. నేను ఈ దాపున నున్న పర్వత శిఖరమున సానుజుడనై, వర్షాకాలము ముగియుదాక నివసించెదను. కొంతకాలము నగరమున (సుఖమనుభవించి) నుండి సీతాన్వేషణమునకు ప్రయత్నము చేయుదువు గాక!'' (48-49).

సాష్టాంగం ప్రణిపత్యాహ సుగ్రీవో రామపాదయోః,
యదాజ్ఞాపయసే దేవ తత్తథైవ కరోమ్యహమ్. 50

రాముని పాదములకు సుగ్రీవుడు సాష్టాంగముగా నమస్కరించి, ''దేవా! నీవెటుల అనతిచ్చెదవో అట్లే నేను చేయుదును'' (50).

అనుజ్ఞాతస్తు రామేణ సుగ్రీవస్తు సలక్ష్మణః,
గత్వా పురం తథా చక్రే యథా రామేణ చోదితః. 51

ఇట్లు రాముడెట్లు చెప్పెనో అట్లే చేసెను (51).

సుగ్రీవేణ యథాన్యాయం పూజితో లక్ష్మణస్తదా,
ఆగత్య రాఘవం శీఘ్రం ప్రణిపత్యోపతస్థివాన్. 52

లక్ష్మణుడు సుగ్రీవునిచే యథావిధి సమ్మానింపబడి, వేగమే తిరిగివచ్చి, రాఘవునికి నమస్కరించి, సేవలో నిలిచెను (52).

తతో రామో జగామాశు లక్ష్మణేన సమన్వితః,
ప్రవర్షణగిరేరూర్ధ్వం శిఖరం భూరివిస్తరమ్. 53

అంతట రాముడు లక్ష్మణ సంయుతుడై వేగముగా అతి విస్తారమైన ప్రవర్షణ గిరిపైనున్న శిఖరము చేరెను (53).

తత్రైకం గహ్వరం దృష్ట్వా స్ఫాటికం దీప్తిమచ్ఛుభమ్,
వర్షవాతాతపసహం ఫలమూలసమీపగమ్,
వాసాయ రోచయామాస తత్ర రామః సలక్ష్మణః. 54

అచట శుభంకరమై శుద్ధ స్ఫటికమువలె దీపించుచున్న ఒక గుహను గాలి, వాన, ఎండలకు (బాధపడ నవసరము లేకుండ) తట్టుకొనుటకు అనుకూలముగా ఫలమూలములు దొరకుటకు సమీపముగా నుండుటచూచి, రాముడు లక్ష్మణ సంయుతుడై నివాసము చేయుటకు ఇష్టపడెను (54).

దివ్యమూలఫలపుష్పసంయుతే
మౌక్తికోపమజలౌఘపల్వలే,
చిత్రవర్ణమృగపక్షిశోభితే
పర్వతే రఘుకులోత్తమోఽవసత్. 55

దివ్యములు (రుచ్యములగు) కందమూల ఫలపుష్ప సుసంపన్నమై, ముత్యముల వంటి స్వచ్ఛమైన జలరాశి నిండిన సరోవరముతో, చిత్రవిచిత్రములగు వన్నెలుకల పక్షిగణములతో శోభిల్లుచున్న ఆ ప్రవర్షణపర్వతమున రఘూత్తముడు నివాసము చేసెను (55).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ తృతీయ సర్గము ॥ 3 ॥

----****----

ఓం

చతుర్థ సర్గము

రామ లక్ష్మణుల సంభాషణము - క్రియాయోగవిశ్లేషణము

శ్రీమహాదేవ ఉవాచ

తత్ర వార్షికదినాని రాఘవో
లీలయా మణిగుహాసు సంచరన్,
పక్వమూలఫలభోగతోషితో
లక్ష్మణేన సహితోఽవసత్సుఖమ్. 1

వాతనున్నజలపూరితమేఘా-
నంతరస్తనితవైద్యుతగర్భాన్.
వీక్ష్య విస్మయమగాద్గజయూథా -
న్యద్వదాహితసుకాంచనకక్షాన్. 2

నవఘాసం సమాస్వాద్య హృష్టపుష్టమృగద్విజాః,
ధావంతః పరితో రామం వీక్ష్య విస్ఫారితేక్షణాః. 3

న చలంతి సదాధ్యాననిష్ఠా ఇవ మునీశ్వరాః,
రామం మానుషరూపేణ గిరికాననభూమిషు. 4

చరంతం పరమాత్మానం జ్ఞాత్వా సిద్ధగణా భువి,
మృగపక్షిగణా భూత్వా రామమేవానుసేవిరే. 5

సౌమిత్రిరేకదా రామమేకాంతే ధ్యానతత్పరమ్,
సమాధివిరమే భక్త్యా ప్రణయాద్వినయాన్వితః. 6

అబ్రవీద్దేవ తే వాక్యాత్పూర్వోక్తాద్విగతో మమ,
అనాద్యవిద్యాసంభూతః సంశయో హృది సంస్థితః. 7

ఇదానీం శ్రోతుమిచ్ఛామి క్రియామార్గేణ రాఘవ,
భవదారాధనం లోకే యథా కుర్వంతి యోగినః. 8

ఇదమేవ సదా ప్రాహుర్యోగినో ముక్తిసాధనమ్,
నారదోఽపి తథా వ్యాసో బ్రహ్మా కమలసంభవః. 9

శ్రీమహాదేవుడిట్లు పలికెను - ఓ పార్వతీ! అక్కడ వర్షపుదినములలో అనాయాసముగా చుట్టుప్రక్కల అందమైన గుహలలో సంచరించుచు, పక్వములైన మూలఫలముల నాస్వాదించుచు లక్ష్మణసహితుడై రాముడు సుఖముగా నివసించెను (1). మేఘములు నిండుగా మెండుగా జలముతో, ఉరుముల మెరుపుల ధరించి వాయుప్రసారమున మందముగా కదలుచుండగా చూచి, రాముడు అవి బంగారు అంబారితో, ఘీంకరించుచు పోయెడి వేరొక ఏనుగుల గుంపువలె నున్నవని ఆశ్చర్యపడెను. (2) లేతపచ్చికను (అందు దొరకెడి జీవజాలమును) బాగుగా ఆస్వాదించి, తుష్టితో పుష్టితో (కేరింతలు వేయుచు) మృగ పక్షి గణము కలరవములతో అటునిటు పరుగిడుచు, రాముని (సుందర రూపమును) విప్పారిన నేత్రములతో చూచి, సర్వదా ధ్యాననిష్ఠులై యున్న మునుల వలె కదలుట మానివేసి నిలిచిపోయినవి (ఇది గమనించియే కాబోలు) పరమాత్మ మానుషరూపముతో రామునిగా కొండలలో కోనలలో సంచరించుట తెలిసిన సిద్ధగణములు దివినుండి భువికి దిగివచ్చి మృగపక్షిగణములై రామునే సేవింప మొదలిడినవి (3-5). ఒకనాడు రాముడు ధ్యానతత్పరుడై ఏకాంతమున నున్నవేళ, అతడు సమాధిదశను వదలి, లౌకిక ప్రపంచమున నున్నవేళ సౌమిత్రి ప్రేమతో, భక్తితో వినయముతో ఇట్లు ప్రశ్నించెను - "దేవా! నీవింతకుముందు చెప్పిన మాటల వలన, నా హృదయమునందలి అనాది అవిద్యాసంభూతమగు సంశయము తొలగిపోయినది (6-7). కాని రాఘవా! ఇదియొకటి వినదలిచితిని - (అది ఏమనగా) యోగులు ఈ సంసారమందు క్రియామార్గముతో ఎటుల నిన్ను ఆరాధించెదరు? నారదుడు, వ్యాసుడు, కమలభవుడగు చతుర్ముఖ బ్రహ్మ -అందరు యోగులును ముక్తిసాధనము ఇదేయని చెప్పుదురు (9).

బ్రహ్మక్షత్రాదివర్ణానాం
ఆశ్రమాణాం చ మోక్షదమ్.
స్త్రీశూద్రాణాం చ రాజేంద్ర
సులభం ముక్తిసాధనమ్.
తవ భక్తాయ మే భ్రాత్రే
బ్రూహి లోకోపకారకమ్. 10

స్వామీ! బ్రాహ్మణ క్షత్రియాది సకల వర్ణముల వారు, బ్రహ్మ చర్యాది ఆశ్రమముల వారు, మోక్షముపొందు సాధనమిదే! రాజేంద్రా! స్త్రీ శూద్రులకు సైతము, ఇదియే ముక్తికి సులభోపాయమని చెప్పుదురు. నీ భక్తుడను, అంతకుమించి అనురాగము, ఆదరము గల సోదరుడను, లోకోపకారక మగు ఈ విషయమును గూర్చి వివరింపవేడెదను (10)''.

శ్రీరామ ఉవాచ

మమ పూజావిధానస్య నాంతోఽస్తి రఘునందన.
తథాపి వక్ష్యే సంక్షేపాద్యథావదనుపూర్వశః. 11

స్వగృహ్యోక్తప్రకారేణ ద్విజత్వం ప్రాప్య మానవః.
సకాశాత్సద్గురోర్మంత్రం లబ్ధ్వా మద్భక్తిసంయుతః. 12

తేన సందర్శితవిధిర్మామేవారాధయేత్సుధీః.
హృదయే వానలే వార్చేత్ప్రతిమాదౌ విభావసౌ. 13

సాలగ్రామశిలాయాం వా పూజయేన్మామతంద్రితః.
ప్రాతఃస్నానం ప్రకుర్వీత ప్రథమం దేహశుద్ధయే. 14

వేదతంత్రోదితైర్మంత్రైర్మృల్లేపనవిధానతః.
సంధ్యాది కర్మ యన్నిత్యం
తత్కుర్యాద్విధినా బుధః. 15

సంకల్పమాదౌ కుర్వీత సిద్ధ్యర్థం కర్మణాం సుధీః.
స్వగురుం పూజయేద్భక్త్యా మద్బుద్ధ్యా పూజకో మమ.
16

శిలాయాం స్నపనం
కుర్యాత్ప్రతిమాసు ప్రమార్జనమ్.
ప్రసిద్ధైర్గంధపుష్పాద్యై -
ర్మత్పూజా సిద్ధిదాయికా. 17

శ్రీరాముడిట్లనెను ''రఘునందన! నా పూజా విధానమునకు ఇది యంతము (పరిపూర్ణసీమ) యని లేదు. అయినను సంక్షేపముగా ఆనుపూర్వితో (తొలియంశముతో మొదలిడి క్రమము పాటించుచు) వివరించెదను (11). మానవుడు తమ కులాచారము, గృహ్యోక్త ప్రకారమును అనుసరించుచు, ద్విజత్వము పొంది, గురువు దగ్గరనుండి నా మంత్రమును (ఉపదేశమును) పొంది, ఆయన చెప్పిన విధానమున భక్తిపూర్వకముగా బుద్ధిమంతుడై, హృదయము నందుగాని, అగ్నియందు గాని, ప్రతిమాదుల యందు గాని, సూర్యునియందు గాని, నన్నే భావించుచు ఆరాధించవలెను (12-13). లేదా సాలగ్రామశిల యందైనను పరాకుమాని నన్ను భావించి ఉపాసించవలెను. సాధకుడు ఉదయముననే మొట్టమొదటగా దేహమును శుభ్రపరచుకొనుటకు స్నానము చేసి తీరవలెను. ద్విజులు వైదికమంత్రముల ద్వారా, ద్విజేతరులు తాంత్రిక (పౌరాణిక, లౌకిక) మంత్రములతో లేపనమును శరీరమున మర్దించుకొని స్నానమాడవలెను. తదుపరి విధిపూర్వకముగా ధీమంతులు సంధ్యాది కర్మలను, ఇతరములను విధిగా ఆచరించవలెను (14-15). బుద్ధిమంతుడు కర్మలవలన సిద్ధి పొందుటకు మొదటగా సంకల్పము చేయవలెను. తరువాత తన ఆచార్యుని నా అవతారమునకు ప్రతిరూపముగా భావించి, భక్తితో పూజించవలెను (16). నా మూర్తి శిలారూపమైన దానికి స్నానమును ప్రతిమారూపమున నున్న మార్జనమును చేయవలెను. ప్రశస్తముగా దొరకునవి, గంధ పుష్పాదులతో నన్ను పూజించిన సిద్ధి పొందెదరు (17).

మానవుడు నిర్మలహృదయుడై, మాయాప్రభావమున పడక, గురూపదిష్టమగు రీతిని నియమబద్ధుడై నన్ను పూజింపవలెను. రఘుకులనందనా! ప్రతిమాదులకు చేయు అలంకారము నాకు అత్యంతము ప్రియము (18).

అమాయికోఽనువృత్త్యా
మాం పూజయేన్నియత వ్రతః,
ప్రతిమాదిష్వలంకారః
ప్రియో మే కులనందన. 18

అగ్నౌ యజేత హవిషా భాస్కరే స్థండిలే యజేత్,
భక్తేనోపహృతం ప్రీత్యై శ్రద్ధయా మమ వార్యపి. 19

కిం పునర్భక్ష్యభోజ్యాది
గంధపుష్పాక్షతాదికమ్,
పూజాద్రవ్యాణి సర్వాణి
సంపాద్యైవం సమారభేత్. 20

అగ్నిని పూజ చేయునపుడు అహుతులద్వారా చేయవలెను. సూర్యుని వేదికను నిర్మించి అందు అతని ప్రతిమను లిఖించి పూజింపవలెను. భక్తునిచేత శ్రద్ధతో అర్పింపబడిన జలముతోకూడా ప్రీతిచెందెదను. అట్లయిన భక్ష్యభోజ్యాదులు, గంధ పుష్ప అక్షతాదులతో పూజించిన వేరు చెప్పవలయునా? అన్నిరకములగు పూజాద్రవ్యములు సేకరించుకొని నా ఆరాధనము ప్రారంభించవలెను (19-20).

చైలాజినకుశైః సమ్యగాసనం పరికల్పయేత్,
తత్రోపవిశ్య దేవస్య సంముఖే శుద్ధమానసః. 21

తతో న్యాసం ప్రకుర్వీత మాతృకాబహిరాంతరమ్,
కేశవాది తతః కుర్యాత్తత్త్వన్యాసం తతః పరమ్. 22

మన్మూర్తిపంజరన్యాసం మంత్రన్యాసం తతో న్యసేత్,
ప్రతిమాదావపి తథా కుర్యాన్నిత్యమతంద్రితః. 23

కలశం స్వపురో వామే క్షిపేత్పుష్పాది దక్షిణే,
అర్ఘ్యపాద్యప్రదానార్థం మధుపర్కార్థమేవ చ. 24

తథైవాచమనార్థం తు న్యసేత్పాత్రచతుష్టయమ్,
హృత్పద్మే భానువిమలే మత్కలాం జీవసంజ్ఞితామ్. 25

(ఇపుడు పూజావిధానము గురించి చెప్పెదను) మొదట దర్భలుగాని, మృగచర్మముగాని, వస్త్రముగాని, పరచుకొని ఆసనము రచించుకొనవలెను. దానిపై భగవంతునికి ఎదురుగా కూర్చుండి పరిశుద్ధమగు అంతరాత్మతో బహిర్మాతృకాన్యాసము, అంతర్మాతృకా న్యాసము, ఆ తరువాత కేశవాది ఇరువది నాలుగు నామములతో తత్త్వన్యాసమును చేయవలెను (21-22). అటుపిమ్మట విష్ణు పంజరమున చెప్పబడిన రీతిలో నా మూర్తికి పంజరన్యాసము, తరువాత మంత్రన్యాసము ఆచరించవలెను. ప్రతిమాపూజయందుకూడా పరాకుమాని అలసత్వమువీడి ముందటివిధముగా పూజ గావించవలెను. తనకు ముందుగా ఎడమవంక కలశమును, పుష్పాది ద్రవ్యములు కుడివంక ఉంచుకొనవలెను. పిమ్మట అర్ఘ్య, పాద్య, ఆచమన, మధుపర్కములకు విడివిడిగా నాల్గుపాత్రలుంచుకొనవలెను. సూర్య సమాభాసమానమగు 'జీవ' మను పేరుగల నా కళను హృదయములో ధ్యానించవలయును (24-25).

ధ్యాయేత్స్వదేహమఖిలం తయా వ్యాప్తమరిందమ,
తామేవావాహయేన్నిత్యం ప్రతిమాదిషు మత్కలామ్. 26

తన దేహము ఆ కళచేత పరివ్యాప్తమైనట్లు భావించుచు ధ్యానము చేయవలయును. ప్రతిమాదుల యందును అదే కళను ఆవాహన చేసికొనవలెను (26).

పాద్యార్ఘ్యాచమనీయాద్యైః స్నానవస్త్రవిభూషణైః.
యావచ్ఛక్యోపచారైర్వా త్వర్చయేన్మామమాయయా. 27

విభవే సతి కర్పూరకుంకుమాగురుచందనైః.
అర్చయేన్మంత్రవన్నిత్యం సుగంధకుసుమైః శుభైః. 28

దశావరణపూజాం వై హ్యాగమోక్తాం ప్రకారయేత్.
నీరాజనైర్ధూపదీపైర్నైవేద్యైర్బహువిస్తరైః. 29

శ్రద్ధయోపహరేన్నిత్యం
శ్రద్ధాభుగహమీశ్వరః.
హోమం కుర్యాత్ప్రయత్నేన
విధి నా మంత్రకోవిదః. 30

అగస్త్యేనోక్తమార్గేణ కుండేనాగమవిత్తమః.
జుహుయాన్మూలమంత్రేణ పుంసూక్తేనాథవా బుధః. 31

అథవౌపాసనాగ్నౌ వా
చరుణా హవిషా తథా.
తప్తజాంబూనదప్రఖ్యం
దివ్యాభరణభూషితమ్. 32

ధ్యాయేదనలమధ్యస్థం హోమకాలే సదా బుధః.
పార్షదేభ్యో బలిం దత్త్వా హోమశేషం సమాపయేత్. 33

తతో జపం ప్రకుర్వీత ధ్యాయేన్మాం యతవాక్ స్మరన్.
ముఖవాసం చ తాంబూలం దత్త్వా ప్రీతిసమన్వితః. 34

మదర్థే నృత్యగీతాది స్తుతిపాఠాది కారయేత్.
ప్రణమేద్దండవద్భూమౌ హృదయే మాం నిధాయ చ. 35

శిరస్యాధాయ మద్దత్తం
ప్రసాదం భావనామయమ్.
పాణిభ్యాం మత్పదే మూర్ధ్ని
గృహీత్వా భక్తిసంయుతః. 36

రక్ష మాం ఘోరసంసారాదిత్యుక్త్వా ప్రణమేత్సుధీః.
ఉద్వాసయేద్యథాపూర్వం ప్రత్యగ్జ్యోతిషి సంస్మరన్. 37

నిష్కపటబుద్ధితో పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము మొదలగునవి, స్నాన వస్త్ర విభూషణాదులతోను (అది కానపుడు) యథాశక్తి ఇతర ఉపచారములతోను పూజించ వలెను (27). ధనవంతులైన, కర్పూర, కుంకుమ, అగరు, చందనములతో శుభప్రదమగు పరిమళ పుష్పములతో మంత్ర పూర్వకముగా అర్చన చేయవలెను (28). ఆగమశాస్త్రము లందు ప్రతిపాదితమైన దశావరణపూజను నీరాజనముతో ధూపదీపములతో, నైవేద్యములతో, విశేషముగా పూజించవలయును (29).

నిత్యము శ్రద్ధతోడ మాత్రమే సమస్త పదార్థములను నివేదన చేయవలయును. పరమాత్ముడనగు నేను శ్రద్ధ (చే ఒసంగబడిన పదార్థముల)నే భుజించువాడను. ప్రయత్న పూర్వకముగా విధిపూర్వకముగా, మంత్రకోవిదుడు యజ్ఞము చేయవలయును. ఆగమనము బాగుగా ఎరిగిన సాధకుడు, అగస్త్యమహర్షి చెప్పినవిధముగా అగ్ని గుండమునునిర్మించి, గురూపదిష్టమగు మూలమంత్రముతో గాని, పురుషసూక్తముతోగాని హోమములు చేయ వలయును (30-31). ఇటులకాకున్న అగ్ని ఉపాసకుడైన ధీమంతుడు అగ్నియందే చరువును, హవిస్సును సమర్పించుచు, హోమకాలమునందు అగ్ని మధ్యస్థుడగు తప్తకాంచనవర్ణుడు, దివ్యాభరణ భూషితుడగు పరమాత్మను సదా ధ్యానించవలయును. పార్షదులకు బలిహరణమొనర్చి, హోమమును పూర్తిగావించవలయును (32-33). తదుపరి మౌనము దాల్చి, నన్ను స్మరించుచు జపించవలయును. ప్రీతిపూర్వకముగా ముఖవాసము, తాంబూలము సమర్పించి నాకొరకై నృత్యగీతాదులు సమర్పించి స్తుతి పాఠాదులు ఆచరించవలెను. సాష్టాంగదండ ప్రణామము నాచరించి, హృదయములో నన్ను భావన చేయుచు, నా పదద్వయమును అఖండమగు భక్తి పూర్వకముగా శిరస్సున ధరించి, భగవత్ప్రసాదమనెడు దివ్యభావనతో మద్దత్త ప్రసాదమును (తీర్థము మొదలైనవానిని) ధీమంతుడగు వాడు, 'ప్రభూ! ఘోర సంసారమునుండి నన్నుద్ధరింపుము' అని ప్రణమిల్లి, ప్రతిమలోనికి ఆవాహనమైన జీవమును కళ తనయందు ప్రవేశించెనను భావన అవలంబించి విసర్జనము గావించవలెను (34-37).

ఏవముక్తప్రకారేణ పూజయేద్విధివద్యది,
ఇహాముత్ర చ సంసిద్ధిం ప్రాప్నోతి మదనుగ్రహాత్. 38

మద్భక్తో యది మామేవం పూజాం చైవ దినే దినే,
కరోతి మమ సారూప్యం ప్రాప్నోత్యేవ న సంశయః.
39

ఇదం రహస్యం పరమం చ పావనం
మయైవ సాక్షాత్కథితం సనాతనమ్,
పఠత్యజస్రం యది వా శృణోతి యః
స సర్వపూజాఫలభాఙ్న సంశయః. 40

ఏవం పరాత్మా శ్రీరామః
క్రియాయోగమనుత్తమమ్,
పృష్టః ప్రాహ స్వభక్తాయ
శేషాంశాయ మహాత్మనే. 41

పునః ప్రాకృతవద్రామో మాయామాలంబ్య దుఃఖితః,
హా సీతేతి వదన్నైవ నిద్రాం లేభే కథంచన. 42

ఏతస్మిన్నంతరే తత్ర కిష్కింధాయాం సుబుద్ధిమాన్.
హనూమాన్ ప్రాహ సుగ్రీవమేకాంతే కపినాయకమ్.
43

శృణు రాజన్ ప్రవక్ష్యామి తవైవ హితముత్తమమ్,
రామేణ తే కృతః పూర్వముపకారో హ్యనుత్తమః. 44

కృతఘ్నవత్త్వయా నూనం విస్మృతః ప్రతిభాతి మే.
త్వత్కృతే నిహతో వాలీ వీరస్త్రైలోక్యసమ్మతః. 45

రాజ్యే ప్రతిష్ఠితోఽసి త్వం తారాం ప్రాప్తోఽసి దుర్లభామ్.
స రామః పర్వతస్యాగ్రే భ్రాత్రా సహ వసన్సుధీః. 46

ఈ వివరించిన ప్రకారము, యథావిధిగా నన్ను పూజించిన యెడల నా యనుగ్రహముచేత ఐహిక ఆముష్మిక లోకముల సుఖసంసిద్ధిని మానవుడు పొందగలడు (38). మానవుడు నా భక్తుడై, నన్నే దినదినమును పూజించిన యెడల నా సారూప్యమోక్షమును పొందియే తీరును. ఇది నిస్సంశయము (39). ఇది అత్యంత రహస్యమైనది. పరమమైనది, పావనము. అది పురాతనము! నాచే స్వయముగా వివరించబడినది! దీనిని నిరంతరము పఠించినను, లేక విన్నను అతడు నిస్సంశయముగా సర్వవిధముల పూజలవలన లభించు ఫలమును పొందును'' (40).

ఈ విధముగా పరమాత్మయగు శ్రీరాముడు అత్యుత్తమమగు క్రియయోగ (పూజావిధానము)ను గురించి ప్రశ్నించబడి, మహాత్ముడును, శేషాంశ సంభూతుడునగు తన భక్తుడు లక్ష్మణునకు చక్కగా వివరించెను. (41)

తదుపరి మాయాప్రభావమును అవలంబించి, సాధారణ మానవునివలె దుఃఖించెను. 'హా సీతా!' యనుచు పలుకుచునేయుండి ఏ మాత్రము నిద్రపోని వాడాయెను (42).

ఈ సమయముననే కిష్కింధానగరమున సద్బుద్ధి యగు హనుమ కపినాయకుడగు సుగ్రీవుని ఏకాంతమున సందర్శించి ఇట్లు చెప్పెను (43)- ''రాజా! వినుము! నీకు హితమును కలిగించునట్టి ఉత్తమమైన మాటనే చెప్పెదను. అత్యంతము ఉత్తమమగు ఉపకారము ఇతః పూర్వమే రామునిచేత నీకు చేయబడినది. బహుశ ఆ విషయము కృతఘ్నునివలె నీచేత మరువబడినట్లు నాకు తోచు చున్నది. నీ కొరకే త్రిలోకములందును రాణకెక్కిన వాలి రణమున చంపబడినాడు. సువిశాలము, సుసంపన్న మగు కపి సామ్రాజ్యమున నీవు ప్రతిష్ఠించబడితివి. నీకు పరమ దుర్లభమగు తారను (దేవేరిగా) పొందగలిగితివి. ఈ కార్యములు సంభవించుటకు మూలకారకుడైన బుద్ధిశాలి యగు ఆ రాముడు తన తమ్మునితో పర్వతాగ్రమున నిలచి యున్నాడు (44-46).

త్వదాగమనమేకాగ్రమీక్షతే కార్యగౌరవాత్,
త్వం తు వానరభావేన స్త్రీసక్తో నావబుధ్యసే. 47

కరోమీతి ప్రతిజ్ఞాయ సీతాయాః పరిమార్గణమ్,
న కరోషి కృతఘ్నస్త్వం హన్యసే వాలివద్ధ్రువమ్. 48

హనూమద్వచనం శ్రుత్వా సుగ్రీవో భయవిహ్వలః,
ప్రత్యువాచ హనూమంతం సత్యమేవ త్వయోదితమ్. 49

శీఘ్రం కురు మమాజ్ఞాం త్వం వానరాణాం తరస్వినామ్,
సహస్రాణి దశేదానీం ప్రేషయాశు దిశో దశ. 50

సప్తద్వీపగతాన్సర్వాన్వానరానానయంతు తే,
పక్షమధ్యే సమాయాంతు సర్వే వానరపుంగవాః. 51

యే పక్షమతివర్తంతే తే వధ్యా మే న సంశయః,
ఇత్యాజ్ఞాప్య హనూమంతం సుగ్రీవో గృహమావిశత్. 52

సుగ్రీవాజ్ఞాం పురస్కృత్య హనూమాన్ మంత్రిసత్తమః,
తత్‌క్షణే ప్రేషయామాస హరీన్ దశ దిశః సుధీః. 53

అగణితగుణసత్త్వాన్ వాయువేగప్రచారాన్
వనచరగణముఖ్యాన్ పర్వతాకారరూపాన్,
పవనహితకుమారః ప్రేషయామాస దూతా-
నతిరభసతరాత్మా దానమానాదితృప్తాన్. 54

అతడు జరుగవలసిన కార్యగరిమను (కష్టమును) దృష్టియందుంచుకొని, నీ ఒక్కని రాకకోసమే ఎదురు చూచుచున్నాడు. అయ్యో! నీవు మాత్రము వానర బుద్ధితో స్త్రీలోగ లాలసత్వముతో ముందు వెనుకలు తెలిసికొనుట లేదు. 'సీతాన్వేషణము నేను చేయుదును' అని నీవు ప్రతిన బట్టి, ఏ ప్రయత్నము చేయుటయే లేదు. నీవు కృతఘ్నుడవు. వాలివలె నీవును చంపబడగలవు'' (48).

హనుమంతుని మాటలు విని సుగ్రీవుడు భయవిహ్వలుడై హనుమతో నిట్లు ప్రత్యుత్తరమిచ్చెను- ''నీవు చెప్పినదంతయు సత్యమే! వేగిరపడుము. నీవు నా ఆజ్ఞగా శీఘ్రగాములగు పదివేలమంది వానరవీరులను వేగమే దశదిశల పంపుము (49-50). సప్తద్వీపములందుండు సమస్త వానరకోటులు నీచే వెంటనే రప్పింపబడుదురు గాక! అందరు వానరపుంగవులు పక్షములోపలనే ఇక్కడకి వచ్చి చేరుదురు గాక! పక్షముదాటి వచ్చినవాడెవడైనను నిస్సంశయముగా నాచే వధ్యుడగుగాక!'' ఇట్లు హనుమను ఆజ్ఞాపించి, సుగ్రీవుడు మరల ఇంటికి పోయెను (51-52).

బుద్ధిమంతుడు మంత్రిశ్రేష్ఠుడగు హనుమ సుగ్రీవాజ్ఞను (!) పురస్కరించుకొని తత్ క్షణమే దశదిశలకు వానరవీరులను పంపివేసెను (53). శ్రీరాముని కార్య సంసిద్ధికై అతి రభసముగా ఆరాటపడుచున్న పవనహిత కుమారుడు[1] (ఆంజనేయుడు) వాయుదేవుని గారాలబిడ్డడు లెక్కకు మిక్కిలి గుణములే సంపదగా కల సత్త్వవంతులను వాయువేగ సమమగు వేగము కలవారిని, పర్వతములవలె కదల్చరానంతటి బలరూపములు కలవారిని, దూతలుగా కపివీర ముఖ్యులను వారివారికి యోగ్యమగు రీతిలో మానదానాదులతో తృప్తులను చేసి పంపివేసెను''.

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ చతుర్థ సర్గము ॥ 4 ॥

----****----

1 పవనహితకుమారః = పవనహిత= అంజన, అంజనీపుత్రుడు, వాయుదేవునికి హితమగు పుత్రుడు, పవనః= విష్ణువు (ప్రస్తుతము 'రామ' రూప) హితము (సీతాన్వేషణము) కుమార = చెడును (రాక్షసులను) నాశము చేయువాడు.

ఓం

పంచమ సర్గము

శ్రీరామ విలాపము - లక్ష్మణుని కిష్కింధాగమనము

శ్రీమహాదేవ ఉవాచ

రామస్తు పర్వతస్యాగ్రే మణిసానౌ నిశాముఖే,
సీతావిరహజం శోకమసహన్నిదమబ్రవీత్. 1

పశ్య లక్ష్మణ మే సీతా రాక్షసేన హృతా బలాత్,
మృతాఽమృతా వా నిశ్చేతుం న జానేఽద్యాపి భామినీమ్.
2

జీవతీతి మమ బ్రూయాత్కశ్చిద్వా ప్రియకృత్స మే,
యది జానామి తాం సాధ్వీం జీవంతీం యత్ర కుత్ర వా.
3

హృత్వాదేవాహరిష్యామి సుధామివ పయోనిధేః,
ప్రతిజ్ఞాం శృణు మే భ్రాతర్యేన మే జనకాత్మజా. 4

నీతా తం భస్మసాత్కుర్యాం సపుత్రబలవాహనమ్,
హే సీతే చంద్రవదనే వసంతీ రాక్షసాలయే. 5

దుఃఖార్తా మామపశ్యంతీ కథం ప్రాణాన్ ధరిష్యసి,
చంద్రోఽపి భానువద్భాతి మమ చంద్రాననాం వినా. 6

చంద్ర త్వం జానకీం స్పృష్ట్వా
కరైర్మాం స్పృశ శీతలైః,
సుగ్రీవోఽపి దయాహీనో
దుఃఖితం మాం న పశ్యతి. 7

రాజ్యం నిష్కంటకం ప్రాప్య స్త్రీభిః పరివృతో రహః,
కృతఘ్నో దృశ్యతే వ్యక్తం పానాసక్తోఽతికాముకః. 8

నాయాతి శరదం పశ్యన్నపి మార్గయితుం ప్రియామ్,
పూర్వోపకారిణం దుష్టః కృతఘ్నో విస్మృతో హి మామ్.
9

శ్రీమహాదేవుడు ఇట్లనియె - ''పార్వతీ! ఒక ప్రదోషమున (రాత్రి ప్రథమభాగమున) ప్రవర్షణగిరి మణిమయశిఖరముపై యుండగా సీతావియోగ సంభవమగు శోకమును భరింపకొనలేక, ఇట్లనెను(1) - ''లక్ష్మణా! చూడుము. నా సీత రావణునిచేత బలవంతముగా గొనిపోబడినది. ఇంతవరకు ఇప్పటికైనను నా భామిని మరణించెనా జీవించియున్నదా నిశ్చయింపను ఎరుగను! (2). ఎవ్వడైనను ''ఆమె జీవించియేయున్నది'' అని చెప్పిన వాడు నాకు అత్యంత ప్రియము కూర్చువాడగును. ఆమె - ఆ సాధ్వి జీవించియే యున్నది అని తెలిసికొనగలిగిన, ఆమె ఎక్కడ ఉన్నను, పాలసముద్రమునుండి అమృతమువలె వెంటనే ఎట్లయినను గొనివత్తును. సోదరా!నా ప్రతిజ్ఞ వినుము. నా సీత ఎవరి చేత గొనిపోబడినదో వానిని సపుత్ర బలవాహనముగా భస్మము చేసివైతును. అయ్యో! సీతా! చంద్రవదనా! రాక్షస కూటమిలో నిలిచి, దుఃఖార్తవై, నన్ను చూడ వీలులేకయే, ఎటుల ప్రాణములు ధరించి యుంటివో! చంద్రముఖియగు నా ప్రియురాలు నా వంక లేక, ఆకసమున చంద్రుడును భానునివలె ప్రచండుడుగా నున్నాడు (3-6). చంద్రుడా! నీవు శీతల కిరణములతో నా సీతను స్పృశించి, నన్నును తాకుము! సుగ్రీవుడునూ దయావిహీనుడైనాడే! దుఃఖితుడగు నావంక చూడనైనను చూచుట లేదు (7). సుగ్రీవుడు సర్వవానర సామ్రాజ్యము నిష్కంటకముగా నా అనుగ్రహమున స్వాధీనపరచుకొని, అంతఃపురము లందు స్త్రీజన పరివృతుడై, పానఆసక్తమతియై, కాముకుడై (నన్ను చూడరాక) కృతఘ్నుడుగా కన్పట్టుచున్నాడు. ఇది తథ్యము (8). శరత్కాలము ప్రవేశించుట చూచియు ఇంతవరకు నా ప్రియురాలిని వెదకుటకు అతడు వచ్చుట లేదు. దుష్టుడై, కృతఘ్నుడై అపూర్వపూర్వ ఉపకారినగు నన్ను మరచిపోయినాడు కదా! (9).

హన్మి సుగ్రీవమద్యైవం
సపురం సహబాంధవమ్,
వాలీ యథా హతో మేఽద్య
సుగ్రీవోఽపి తథా భవేత్. 10

ఈ సుగ్రీవుని నగరముతో సహా, సబాంధవముగా చంపివేయుదును. నాడు వాలి నాచే ఎట్లు (ఒక్క బాణముతో) చంపబడెనో, అట్లే నేడు సుగ్రీవునకు కూడ అగును గాక! (10).

ఇతి రుష్టం సమాలోక్య రాఘవం లక్ష్మణోఽబ్రవీత్,
ఇదానీమేవ గత్వాఽహం సుగ్రీవం దుష్టమానసమ్. 11

మామాజ్ఞాపయ హత్వా
తమాయాస్యే రామ తేఽన్తికమ్,
ఇత్యుక్త్వా ధనురాదాయ
స్వయం తూణీరమేవ చ. 12

గంతుమభ్యుద్యతం వీక్ష్య రామో లక్ష్మణమబ్రవీత్,
న హంతవ్యస్త్వయా వత్స సుగ్రీవో మే ప్రియః సఖా. 13

కింతు భీషయ సుగ్రీవం వాలివత్త్వం హనిష్యసే,
ఇత్యుక్త్వా శీఘ్రమాదాయ సుగ్రీవప్రతిభాషితమ్. 14

ఆగత్య పశ్చాద్యత్కార్యం తత్కరిష్యామ్యసంశయమ్,
తథేతి లక్ష్మణోఽగచ్ఛత్త్వరితో భీమవిక్రమః. 15

కిష్కింధాం ప్రతి కోపేన నిర్దహన్నివ వానరాన్,
సర్వజ్ఞో నిత్యలక్ష్మీకో విజ్ఞానాత్మాపి రాఘవః. 16

సీతామనుశుశోచార్తః ప్రాకృతః ప్రాకృతామివ,
బుద్ధ్యాదిసాక్షిణస్తస్య మాయాకార్యాతివర్తినః. 17

రాగాదిరహితస్యాస్య తత్కార్యం కథముద్భవేత్,
బ్రహ్మణోక్తమృతం కర్తుం రాజ్ఞో దశరథస్య హి. 18

తపసః ఫలదానాయ జాతో మానుషవేషధృక్,
మాయయా మోహితాః సర్వే జనా అజ్ఞానసంయుతాః.
19

ఇట్లు క్రుద్ధుడైన రాఘవుని పరికించి, లక్ష్మణుడు అనెను "అన్నా! అనుజ్ఞనిమ్ము. నేనిప్డేపోయి దుష్ట మనస్కుడగు సుగ్రీవుని పరిమార్చి, నీ కడకు వచ్చెదను!" అని పలికి ధనుస్సును గ్రహించి స్వయముగా తూణీరమును కూడ తీసికొనెను (11-12). ఇటుల కిష్కింధ వెడల నుద్యమించిన లక్ష్మణుని చూచి, రాముడిట్లనెను - "నాయనా! నీచే చంపబడదగినవాడు కాడు అతడు. సుగ్రీవుడు నా ప్రియమిత్రుడు! అతనిని కొంచెము భయపెట్టుము. బెదిరించుము. 'వాలివలె నీవును చంపబడుదువు' ఇంతమాత్రమే చెప్పి, సుగ్రీవుని ప్రతివచనమును తీసికొని వెంటనే తిరిగి రమ్ము. నీవు తిరిగివచ్చిన పిదప, ఏమి చేయతగునో ఆ పని చేయుదును". 'అట్లే' యని భీమవిక్రముడగు లక్ష్మణుడు వానరులనందరను క్రోధముతో దగ్ధము కావించునటుల కిష్కింధదిశగా వెడలెను. సర్వజ్ఞుడు, నిత్య లక్ష్మీసంబంధముకల స్వామి, జ్ఞానమూర్తి యగు రాఘవుడు, సాధారణమానవుడు ఒక స్త్రీకై శోకించునట్లు సీతకొరకై తపించుచు శోకించెను. బుద్ధ్యాదులకు సాక్షియు, మాయా కార్యములకు అతీతుడై ప్రవర్తించువాడు, రాగాదిరహితుడు, అయిన అతనికి వికారములకు కార్యరూపమైన ఈ శోకమేల? (నిజమే) బ్రహ్మవాక్కును సత్యము చేయుటకు, దశరథ మహారాజు తపస్సు వలని ఫలము ప్రసాదించుటకు మానుషవేషమున ఆవిర్భవించెను. "సర్వజనులు మాయామోహితులై అజ్ఞానమున పడియుండి యున్నారే! అట్టివారికి మోక్షము ఎటుల కలుగగలదు" అని విష్ణుభగవానుడు యోచించి, సర్వలోక పాప కళ్మలము కడిగివేయగల 'శ్రీరామాయణ' మను పేరుగల కథను వ్రాసి

కథమేషాం భవేన్మోక్ష ఇతి విష్ణుర్విచింతయన్,
కథాం ప్రథయితుం లోకే సర్వలోకమలాపహామ్. 20

రామాయణాభిధాం రామో భూత్వా మానుషచేష్టకః,
క్రోధం మోహం చ కామం చ వ్యవహారార్థసిద్ధయే. 21

తత్తత్కాలోచితం గృహ్ణన్ మోహయత్యవశాః ప్రజాః,
అనురక్త ఇవాశేషగుణేషు గుణవర్జితః. 22

విజ్ఞానమూర్తిర్విజ్ఞానశక్తిః సాక్ష్యగుణాన్వితః,
అతః కామాదిభిర్నిత్యమవిలిప్తో యథా నభః. 23

విందంతి మునయః కేచిజ్జానంతి జనకాదయః,
తద్భక్తా నిర్మలాత్మానః సమ్యగ్జానంతి నిత్యదా,
భక్తచిత్తానుసారేణ జాయతే భగవానజః. 24

లక్ష్మణోఽపి తదా గత్వా కిష్కింధానగరాంతికమ్,
జ్యాఘోషమకరోత్తీవ్రం భీషయన్ సర్వవానరాన్. 25

తం దృష్ట్వా ప్రాకృతాస్తత్ర వానరా వప్రమూర్ధని,
చక్రుః కిలకిలాశబ్దం ధృతపాషాణపాదపాః. 26

తాన్దృష్ట్వా క్రోధతామ్రాక్షో వానరాన్ లక్ష్మణస్తదా,
నిర్మూలాన్కర్తుముద్యుక్తో ధనురానమ్య వీర్యవాన్. 27

తతః శీఘ్రం సమాప్లుత్య జ్ఞాత్వా లక్ష్మణమాగతమ్. 28

నివార్య వానరాన్ సర్వానంగదో మంత్రిసత్తమః,
గత్వా లక్ష్మణసామీప్యం ప్రణనామ స దండవత్. 29

తతోఽంగదం పరిష్వజ్య లక్ష్మణః ప్రియవర్ధనః,
ఉవాచ వత్స గచ్ఛ త్వం పితృవ్యాయ నివేదయ. 30

మామాగతం రాఘవేణ చోదితం రౌద్రమూర్తినా,
తథేతి త్వరితం గత్వా సుగ్రీవాయ న్యవేదయత్. 31

చేయనెంచి, మానుషచేష్టల ప్రదర్శించువాడుగా దిగివచ్చి క్రోధమును, మోహమును, అంతియేకాక కామమును వ్యవహారోచితికి తగినట్లుగా, ఆ యా కాలములకు తగినట్లుగా గ్రహించి, మాయా మోహితులగు ప్రజలను మోహింపచేయుచున్నాడు. గుణము లకు వశముకానివాడు అశేష గుణములయందు అనురక్తుడై యున్నట్లు (15-22) అగుపడుచు, విజ్ఞానమే మూర్తియైన వాడు, విజ్ఞానమే శక్తిగాకల స్వామి సర్వసాక్షి, గుణాన్వితుడు కానివాడు, ఆకాశము ఇతరములచే (అంటియు అంట కుండునట్లు) కామాదులచే నిర్లేపుడు, (23). అయిన అతనిని సనకాది మునులు తెలియుదురు. జనకాదులు కొందరు తెలిసినవారిలో నుందురు. నిర్మలాత్ములైన స్వామిభక్తులు నిత్యమును ప్రసాదించు స్వామిని బాగుగా తెలిసికొందురు. అట్టి భక్తుల చిత్తవృత్తిని అనుసరించియే అజాయమనుడగు పరమాత్మ బహుధా జన్మించును! (24).

కిష్కింధా నగర పరిసరములకు పోయి లక్ష్మణుడు తీవ్రమగు ధనుష్టంకారమును సర్వవానరులను బెదర గొట్టునట్లు చేసివైచెను (25). అతనిని (ఇంతకుముందు ఎరుగనివానిగా) చూచి, ప్రాకారముల కొమ్మలనున్న కొందరు సాధారణ వానరులు (నరుడు వానర నగరము లోనికి వచ్చెనని) రాళ్ళు, చెట్లు చేతబట్టుకొని కిలకిలా రవములు చేసిరి (26). ఆ వానరులను చూచి మహా పరాక్రమశాలి లక్ష్మణుడు క్రోధ సంరక్త లోచనుడై ధనువు చేతబూని వానరవంశ నిర్మూలనమునకే సమకట్టెను (27).

అంతట శీఘ్రముగా దూకివచ్చి, లక్ష్మణుడు వచ్చెనని తెలిసి సర్వవానరులను వారించి మంత్రాంగము నెరిగిన అంగదుడు లక్ష్మణుని సమీపమునకు వచ్చి సాష్టాంగ దండప్రణామము చేసెను (28-29). అంతట ప్రేమ భావము ఉప్పొంగిన లక్ష్మణుడు అంగదుని ఆలింగన మొనర్చుకొని ఇట్లు చెప్పెను - ''వత్స! నీవు పొమ్ము! నా రాక గురించి తండ్రికి చెప్పుము''. అంగదుడు 'అట్లే' యని వేగమే పోయి సుగ్రీవునికి నివేదించెను (30 - 31).

లక్ష్మణః క్రోధతామ్రాక్షః పురద్వారి బహిః స్థితః,
తచ్ఛ్రుత్వాతీవ సంత్రస్తః సుగ్రీవో వానరేశ్వరః. 32

ఆహూయ మంత్రిణాం శ్రేష్ఠం హనూమంతమథాబ్రవీత్,
గచ్ఛ త్వమంగదేనాశు లక్ష్మణం వినయాన్వితః. 33

సాంత్వయన్ కోపితం వీరం శనైరానయ సాదరమ్,
ప్రేషయిత్వా హనూమంతం తారామాహ కపీశ్వరః. 34

త్వం గచ్ఛ సాన్త్వయంతీ తం లక్ష్మణం మృదుభాషితైః,
శాంతమంతఃపురం నీత్వా పశ్చాద్దర్శయ మేఽనఘే.
35

భవత్వితి తతస్తారా మధ్యకక్షం సమావిశత్,
హనూమానంగదేనైవ సహితో లక్ష్మణాంతికమ్. 36

గత్వా ననామ శిరసా భక్త్యా స్వాగతమబ్రవీత్,
ఏహి వీర మహాభాగ భవద్గృహమశంకితమ్. 37

ప్రవిశ్య రాజదారాదీన్
దృష్ట్వా సుగ్రీవమేవ చ.
యదాజ్ఞాపయసే పశ్చాత్
తత్సర్వం కరవాణి భోః. 38

ఇత్యుక్త్వా లక్ష్మణం భక్త్యా కరే గృహ్య స మారుతిః,
ఆనయామాస నగరమధ్యాద్రాజగృహం ప్రతి. 39

పశ్యంస్తత్ర మహాసౌధాన్ యూథపానాం సమంతతః,
జగామ భవనం రాజ్ఞః సురేంద్రభవనోపమమ్. 40

మధ్యకక్షే గతా తత్ర తారా తారాధిపాననా,
సర్వాభరణసంపన్నా మదరక్తాంతలోచనా. 41

ఉవాచ లక్ష్మణం నత్వా స్మితపూర్వాభిభాషిణీ,
ఏహి దేవర భద్రం తే సాధుస్త్వం భక్తవత్సలః. 42

''లక్ష్మణుడు క్రోధసంరక్త నయనుడై కిష్కింధాపుర ద్వారము బయటనే నిలిచెనని'' అంగదుడు చెప్పగా విని వానరేశ్వరుడగు సుగ్రీవుడు భయపడిపోయెను (32).

తన మంత్రులలో శ్రేష్ఠుడగు హనుమను రావించి ఇట్లు చెప్పెను - 'నీవు వెంటనే అంగదునితో పొమ్ము. లక్ష్మణుని వినయాన్వితుడవై, కోపించిన ఆ మహావీరుని శాంతపరచి తీసికొని రమ్ము''. ఇట్లు హనుమను పంపి తారతో కపీశ్వరుడిట్లు చెప్పెను (33-34) - ''నీవు పొమ్ము. ఓ పుణ్యశీలా! మృదువగు భాషణములతో శాంతపరిచి, అంతఃపురమునకు కొనివచ్చి తరువాత ఆతనిని నా ముందు దర్శింపచేయుము''(35).

'అట్లే యగుగాక!' అని తార మధ్యద్వారము చేరెను. ఇంతలో హనుమ అంగదునితో లక్ష్మణుని సమీపమునకు వెళ్లి, శిరసు వంచి నమస్కరించి భక్తిపూర్వకముగా స్వాగతము పలికెను - ''రమ్ము! వీరాధివీరా! మహాభాగ్యశాలీ! ఇది నిశ్శంకగా మీ యిల్లు! రాజమహిషులను చూచి, సుగ్రీవుని కూడ చూడవచ్చును. నీవెట్టుల ఆజ్ఞాపించిన పిదప అట్లే మేము చేసెదము స్వామీ!'' (36-38).'' ఇట్లు చెప్పుచు, భక్తితో ఆతని కరమును గ్రహించి మారుతి నగరమధ్యమునుండి రాజగృహమువంకకు లక్ష్మణుని గొనివచ్చెను (39). అట గొప్ప సౌధములు చూచుచు, యూథపాధిపతులను అందందు గమనించుచు దేవేంద్రభవనమువంటి కపీంద్రుని భవనము చేరెను (40).

అక్కడ తార మధ్యద్వారమున చందురుని మించు అందమగు మోము కలిగి, సర్వాభరణములు ధరించినదై, కొంచెముగా ఎరుపెక్కిన కన్నులతో నిలిచి యుండి, మాటలాడునపుడు చిరునవ్వు పచరించు నావె, లక్ష్మణునకు ప్రణామము చేసి ఇట్లనెను - ''మరదీ! రా నాయనా! మంగళమగు గాక! నీవు సాధుస్వభావివి! భక్త వత్సలుడవు (41-42), నీ భక్తునిపై, నీ భృత్యునిపై ఈ

కిమర్థం కోపమాకార్షీర్భక్తే భృత్యే కపీశ్వరే,
బహుకాలమనాశ్వాసం దుఃఖమేవానుభూతవాన్. 43

ఇదానీం బహుదుఃఖౌఘాద్భవద్భిరభిరక్షితః,
భవత్ప్రసాదాత్సుగ్రీవః ప్రాప్త సౌఖ్యో మహామతిః. 44

కామాసక్తో రఘుపతేః సేవార్థం నాగతో హరిః,
ఆగమిష్యంతి హరయో నానాదేశగతాః ప్రభో. 45

ప్రేషితో దశసాహస్రా హరయో రఘుసత్తమ,
ఆనేతుం వానరాన్ దిగ్భ్యో మహాపర్వతసన్నిభాన్. 46

సుగ్రీవః స్వయమాగత్య సర్వవానరయూథపైః,
వధయిష్యతి దైత్యౌఘాన్ రావణం చ హనిష్యతి. 47

త్వయైవ సహితోఽద్యైవ గంతా వానరపుంగవః,
పశ్యాంతర్భవనం తత్ర పుత్రదారసుహృద్వృతమ్. 48

దృష్ట్వా సుగ్రీవమభయం దత్త్వా నయ సహైవ తే,
తారాయా వచనం శ్రుత్వా కృశక్రోధోఽథ లక్ష్మణః.49

జగామాంతఃపురం యత్ర సుగ్రీవో వానరేశ్వరః,
రుమామాలింగ్య సుగ్రీవః పర్యంకే పర్యవస్థితః. 50

దృష్ట్వా లక్ష్మణమత్యర్థముత్పపాతాతిభీతవత్,
తం దృష్ట్వా లక్ష్మణః క్రుద్ధో మదవిహ్వలలోచనమ్. 51

సుగ్రీవం ప్రాహ దుర్వృత్త విస్మృతోఽసి రఘూత్తమమ్,
వాలీ యేన హతో వీరః స బాణోఽద్య ప్రతీక్షతే. 52

త్వమేవ వాలినో మార్గం గమిష్యసి మయా హతః,
ఏవమత్యంతపరుషం వదంతం లక్ష్మణం తదా. 53

ఉవాచ హనుమాన్ వీరః కథమేవం ప్రభాషసే,
త్వత్తోఽధికతరో రామే భక్తోఽయం వానరాధిపః. 54

రామకార్యార్థమనిశం జాగర్తి న తు విస్మృతః,
ఆగతాః పరితః పశ్య వానరాః కోటిశః ప్రభో. 55

కపీశ్వరునిపై దేనికి కోపించెదవు? ఈతడు చాలకాలము ఓదార్పు లభించని దుఃఖము అనుభవించినవాడే! అంతటి గొప్ప దుఃఖ సమూహముల నుండి మీ చేతనే కదా ఈతడు రక్షింపబడినాడు. మహామతిమంతుడగు సుగ్రీవుడు మీ యనుగ్రహము వలననే సౌఖ్యము పొందినాడు (43-44). ఇతడు వానరుడు. అందువలన కామాసక్తుడై రఘుపతి సేవకు రాజాలకపోయెను. నానా దేశముల నుండి వానరులు రాగలరు (45). సకల దిశలనుండి మహాపర్వతాకారులగు వానరులను రప్పింప, పది వేల మంది వానరులింతకు ముందే పంపబడినారు. ఓ రఘుసత్తమా ! (46) సుగ్రీవుడే స్వయముగా వచ్చి, సర్వవానరసేనాపతులచేత రాక్షస సమూహములను చంపించగలడు. రావణునికూడా చంపును (47). నీతోడనే ఇపుడే వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు వెడల గలడు. మా అంతఃపురభవనము చూడుము! అక్కడ పుత్ర కళత్రములతో, మిత్రులతో పరివేష్ఠితుడై యున్న సుగ్రీవుని చూచి అతనికి అభయమిచ్చి నీతోనే గొనిపొమ్ము''.

తార పలికిన యీ మాటలు వినగానే లక్ష్మణుడు క్రోధము కృశింపచేసికొన్నవాడాయెను (48-49). అతడు అంతఃపురమునకు పోయి సుగ్రీవుడున్న తావునకు జని, పర్యంకముపై రుమను కౌగలించుకొని, పడియున్నవానిని చూచి (50), మదవిహ్వలములైన చూపులుగల వానికి క్రుద్ధుడగు లక్ష్మణుడు ఇట్లు చెప్పెను - ''దుర్మార్గుడా! రఘూత్తమునే మరచితివా! వాలి ఏ బాణముతో హతమాయెనో, ఆ బాణము ఇపుడును ప్రతీక్షించుచున్నది (51-52). నా చేత హతుడవై నీవే వాలిమార్గమున పోగలవు''. ఇట్టి పరుషవాక్కులు పలుకుచున్న లక్ష్మణునితో (53), హనుమ ఇట్లు చెప్పెను -

''వీరా! ఏల యిట్టి పల్కులు! ఈ వానరాధిపుడు నీకంటెను అధికతరుడగు రామభక్తుడు (54). రామ కార్యార్థము రాత్రింబగళ్లు జాగరూకుడై యున్నాడు. మరువ లేదు. వానరులు కోట్లాదిగా దిక్కులనుండి వచ్చుచునే యున్నారు (55).

గమిష్యంత్యచిరేణైవ సీతాయాః పరిమార్గణమ్.
సాధయిష్యతి సుగ్రీవో రామకార్యమశేషతః. 56

శ్రుత్వా హనుమతో వాక్యం సౌమిత్రిర్లజ్జితోఽభవత్.
సుగ్రీవోఽప్యర్ఘ్యపాద్యాద్యైర్లక్ష్మణం సమపూజయత్. 57

ఆలింగ్య ప్రాహ రామస్య దాసోఽహం తేన రక్షితః.
రామః స్వతేజసా లోకాన్ క్షణార్ధేనైవ జేష్యతి. 58

సహాయమాత్రమేవాహం వానరైః సహితః ప్రభో.
సౌమిత్రిరపి సుగ్రీవం ప్రాహ కించిన్మయోదితమ్. 59

తత్ క్షమస్వ మహాభాగ! ప్రణయాద్భాషితం మయా.
గచ్ఛామోఽద్యైవ సుగ్రీవ రామస్తిష్ఠతి కాననే. 60

ఏక ఏవాతిదుఃఖార్తో జానకీవిరహాత్ప్రభుః.
తథేతి రథమారుహ్య లక్ష్మణేన సమన్వితః. 61

వానరైః సహితో రాజా రామమేవాన్వపద్యత. 62

భేరీమృదంగైర్బహుభిశ్చ వానరైః
శ్వేతాతపత్రైర్వ్యజనైశ్చ శోభితః.
నీలాంగదాద్యైర్హనుమత్ప్రధానైః
సమావృతో రాఘవమభ్యగాద్ధరిః. 63

సీతాన్వేషణకై అతి త్వరలో వెడలగలరు. రామకార్యమును మిగులు లేకయుండగా, సుగ్రీవుడు సాధించగలడు (56).

హనుమ మాటవిని లక్ష్మణుడు లజ్జితుడైయ్యెను. సుగ్రీవుడుకూడా అర్ఘ్యపాద్యాదులతో లక్ష్మణుని పూజించెను (57). అతనిని కౌగలించుకొని ఇట్లనెను - ''నేను రాముని దాసుడను. అతనిచేత రక్షించబడిన వాడను. రాముడు తన తేజస్సుతో అరక్షణములో లోకమును జయించగలవాడు (58). ప్రభూ! వానరులతో కూడి నేను కేవల సాయమును సేరు కోసమే!''. సౌమిత్రి కూడ ఇట్లనెను - ''సుగ్రీవా! మహాభాగా! నేనన్న మాటలను క్షమింపుము. ప్రణయకోపవశమున నేనట్లు పలికితిని. ఇపుడే పోదము. అడవిలో రాముడు ఒంటరియై అతి దుఃఖార్తుడై, జానకీ విరహ అసహిష్ణుడై, యున్నాడు'' అని చెప్పగా, 'అట్లే' యని రథమెక్కి లక్ష్మణునితో కూడి (59-61), వానర సహితుడై కపిరాజు రాముని వంకకే వెడలెను.

భేరీమృదంగములతో, ఎందరో భల్లూక వానరులతో, శ్వేతఛత్ర వ్యజనాదులతో శోభించుచు, నీల, అంగదాది ప్రముఖులతో, హనుమంతునివంటి మంత్రులతో రాఘవుని కడకు సుగ్రీవుడు ఏగెను (63).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ పంచమ సర్గము ॥ ౫ ॥

____ **** ____

ఓం

షష్ఠ సర్గము

సీతాన్వేషణము - స్వయంప్రభ చరితము

శ్రీమహాదేవ ఉవాచ

దృష్ట్వా రామం సమాసీనం గుహాద్వారి శిలాతలే,
చైలాజినధరం శ్యామం జటామౌలివిరాజితమ్. 1

విశాలనయనం శాంతం స్మితచారుముఖాంబుజమ్,
సీతావిరహసంతప్తం పశ్యంతం మృగపక్షిణః. 2

రథాద్దూరాత్సముత్పత్య వేగాత్సుగ్రీవలక్ష్మణౌ,
రామస్య పాదయోరగ్రే పేతతుర్భక్తిసంయుతౌ. 3

రామః సుగ్రీవమాలింగ్య పృష్ట్వానామయమంతికే,
స్థాపయిత్వా యథాన్యాయం పూజయామాస ధర్మవిత్. 4

తతోఽబ్రవీద్రఘుశ్రేష్ఠం సుగ్రీవో భక్తినమ్రధీః,
దేవ పశ్య సమాయాంతీం వానరాణాం మహాచమూమ్. 5

కులాచలాద్రిసంభూతా మేరుమందరసన్నిభాః,
నానాద్వీపసరిచ్ఛైలవాసినః పర్వతోపమాః. 6

అసంఖ్యాతాః సమాయాంతి హరయః కామరూపిణః,
సర్వే దేవాంశసంభూతాః సర్వే యుద్ధవిశారదాః. 7

అత్ర కేచిద్గజబలాః కేచిద్దశగజోపమాః,
గజాయుతబలాః కేచిదన్యేఽమితబలాః ప్రభో. 8

కేచిదంజనకూటాభాః కేచిత్కనకసన్నిభాః,
కేచిద్రక్తాంతవదనా దీర్ఘవాలాస్తథాపరే. 9

శుద్ధస్ఫటికసంకాశాః కేచిద్రాక్షససన్నిభాః,
గర్జంతః పరితో యాంతి వానరా యుద్ధకాంక్షిణః. 10

శ్రీమహాదేవుడు ఇట్లనియె - ఓ పార్వతీ! వల్కల మృగచర్మములు ధరించి, శ్యామల గాత్రుడై, జటామౌళియై, విశాలనయనములు , శాంతరూపము చిరునవ్వు వెదజల్లెడి ముఖపంకజము, సీతా విరహసంతప్త సర్వాంగము కలిగిన రాముని, మృగములను పక్షులను చూచుచు గుహాద్వారము కడ శిలపై కూర్చుండి యున్న రాముని చూచి (1-2), దూరమునుండియే రథముమీది నుండి క్రిందకు దుమికి, అతివేగముగా చేరి సుగ్రీవ లక్ష్మణులు భక్తియుతులై రాముని పాదములకడ ప్రణమిల్లిరి (3). రాముడు సుగ్రీవుని ఆలింగనము చేసికొని, కుశలమడిగి, సమీపములో కూర్చుండబెట్టుకొని ధర్మవిదుడగుటచే యథాన్యాయముగా అతనిని పూజించెను (4).

సుగ్రీవుడు భక్తి నమ్ర హృదయుడై రఘుశ్రేష్ఠునితో ఇట్లనెను - ''దేవా! విశాల వానర సైన్యమును, తమ దళములతో వచ్చుట చూడుము. కులాచలములపై జనన మొందినవారు, మేరు మందర సమాన దేహులు కలవారు. నానాద్వీప శైలములందు ఉండువారు, పర్వతాకారులు (5-6). లెక్కకు అందనివారు కామరూపులు అయిన వానరులు వచ్చుచున్నారు. వీరందరు దేవాంశసంభూతులు. అందరు యుద్ధ విశారదులు (7). ప్రభూ! కొందరు గజబలము కలవారు. కొందరు పది ఏనుగుల బలము కలవారు. పదివేల ఏనుగుల బలము కొందరిది, కొందరు అమిత బలులు! (8). కొందరు అంజనాద్రివలె నల్లనివారు. కొందరు బంగారు వన్నెవారు. కొందరు రక్తవదనులు, మరికొందరు సుదీర్ఘ వాలములు రోమములు కలవారు (9). స్వచ్ఛ స్ఫటిక సంకాశులు కొందరు, మరికొందరు రాక్షసుల వంటివారు. వీరందరు గర్జించుచు యుద్ధకాంక్షులై అటునిటు పరుగిడుచు వచ్చుచున్నారు (10).

త్వదాజ్ఞాకారిణః సర్వే ఫలమూలాశనాః ప్రభో.
ఋక్షాణామధిపో వీరో జాంబవాన్నామ బుద్ధిమాన్.11

ఏష మే మంత్రిణాం శ్రేష్ఠః కోటిభల్లూకవృందపః,
హనూమానేష విఖ్యాతో మహాసత్త్వపరాక్రమః. 12

వాయుపుత్రోఽతితేజస్వీ మంత్రీ బుద్ధిమతాం వరః,
నలో నీలశ్చ గవయో గవాక్షో గంధమాదనః. 13

శరభో ద్వివిదో మైందో గజః పనస ఏవ చ,
వలీముఖో దధిముఖః సుషేణస్తార ఏవ చ. 14

కేసరీ చ మహాసత్త్వః పితా హనుమతో బలీ,
ఏతే తే యూథపా రామ ప్రాధాన్యేన మయోదితాః. 15

మహాత్మానో మహావీర్యాః శక్రతుల్యపరాక్రమాః,
ఏతే ప్రత్యేకతః కోటికోటివానరయూథపాః. 16

తవాజ్ఞాకారిణః సర్వే సర్వే దేవాంశసంభవాః,
ఏష వాలిసుతః శ్రీమానంగదో నామ విశ్రుతః. 17

వాలితుల్యబలో వీరో రాక్షసానాం బలాంతకః,
ఏతే చాన్యే చ బహవస్త్వదర్థే త్యక్తజీవితాః. 18

యోద్ధారః పర్వతాగ్రైశ్చ నిపుణాః శత్రుఘాతనే,
ఆజ్ఞాపయ రఘుశ్రేష్ఠ సర్వే తే వశవర్తినః. 19

రామః సుగ్రీవమాలింగ్య హర్షపూర్ణాశ్రులోచనః,
ప్రాహ సుగ్రీవ జానాసి సర్వం త్వం కార్యగౌరవమ్. 20

మార్గణార్థం హి జానక్యా నియుఙ్క్ష్వ యది రోచతే,
శ్రుత్వా రామస్య వచనం సుగ్రీవః ప్రీతమానసః. 21

ప్రభూ! వీరందరు మీ ఆజ్ఞ పాలించువారు. ఫలమూలాశనులు (నిర్వహణభారము మీకు లేదు). ఈతడు భల్లూకలోక నాయకుడు జాంబవంతుడు - బుద్ధిమంతుడు, వీరుడు (11).

నా మంత్రులలో నితడే శ్రేష్ఠుడు. కోటి భల్లూకములకు అధిపతి. ఈతడు హనుమ. ప్రఖ్యాతి కలవాడు. గొప్ప బల పరాక్రమములు కలవాడు (12). ఇతడు వాయుపుత్రుడు. అతి తేజశ్శాలి. నాకు మంత్రి. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. నల, నీల, గవయ, గవాక్ష, గంధమాదన, శరభ, ద్వివిద, మైంద, గజ, పనస, వలీముఖ, దధిముఖ, సుషేణ, తారులు, హనుమ తండ్రి మహాసత్త్వుడు, బలీయుడగు కేసరి - వీరందరు నీ సైన్యాధ్యక్షులు. రామా! ప్రాధాన్యమును అనుసరించి చెప్పితిని (13-15). మహాత్ములు, మహావీరులు, ఇంద్రునితోడి స్పర్ధించు పరాక్రమము కలవారు, వీరందరు ప్రత్యేకముగా ఒక్కొక్క కోటి వానరుల దళము లకు అధిపతులు (16). వీరందరు నీ ఆజ్ఞ పాలింతురు. అందరూ దేవాంశజులే! ఇతడు వాలిపుత్రుడు, శ్రీమంతుడగు అంగద నామముతో ప్రసిద్ధి (17). పరాక్రమమున వాలికి సమానము. వీరుడు. రాక్షస బలనిరాసన సమర్థుడు. ఇంకను చాలమంది నీ కొరకే ప్రాణముల పణముగా పెట్టినవారున్నారు (18). పర్వత శిఖరములతో పోరాడు యోధులు వీరు. శత్రుఘాత నిష్ణాతులు! రఘుశ్రేష్ఠా! ఆజ్ఞాపింపుము. అందరు నీ వశవర్తులే (19)''

ఇట్లు చెప్పగానే, రాముడు సుగ్రీవుని కౌగలించుకొని, హర్షముతో నిండిన కన్నులు కలవాడై ఇట్లనెను - ''సుగ్రీవా! కార్యభారము సర్వము నీవెరిగినవాడవే! నీకెట్టుల తోచిన, అట్టుల జానకీ పరిమార్గణమునకు వీరిని నియోగింపుము''. రాముని మాట విని, ప్రీతమానసుడై (20-21),

ప్రేషయామాస బలినో వానరాన్ వానరర్షభః,
దిక్షు సర్వాసు వివిధాన్వానరాన్ ప్రేష్య సత్వరమ్. 22

దక్షిణాం దిశమత్యర్థం ప్రయత్నేన మహాబలాన్,
యువరాజం జాంబవంతం హనూమంతం మహాబలమ్. 23

నలం సుషేణం శరభం మైందం ద్వివిదమేవ చ,
ప్రేషయామాస సుగ్రీవో వచనం చేదమబ్రవీత్. 24

విచిన్వంతు ప్రయత్నేన భవంతో జానకీం శుభామ్,
మాసాదర్వాఙ్నివర్తధ్వం మచ్ఛాసనపురస్సరాః. 25

సీతామదృష్ట్వా యది వో మాసాదూర్ధ్వం దినం భవేత్,
తదా ప్రాణాంతికం దండం మత్తః ప్రాప్స్యథ వానరాః. 26

ఇతి ప్రస్థాప్య సుగ్రీవో వానరాన్ భీమవిక్రమాన్,
రామస్య పార్శ్వే శ్రీరామం నత్వా చోపవివేశ సః. 27

గచ్ఛంతం మారుతిం దృష్ట్వా రామో వచనమబ్రవీత్,
అభిజ్ఞానార్థమేతన్మే హ్యంగులీయకముత్తమమ్. 28

మన్నామాక్షరసంయుక్తం సీతాయై దీయతాం రహః,
అస్మిన్ కార్యే ప్రమాణం హి త్వమేవ కపిసత్తమ,
జానామి సత్త్వం తే సర్వం గచ్ఛ పంథాః శుభస్తవ. 29

ఏవం కపీనాం రాజ్ఞా తే విసృష్టాః పరిమార్గణే,
సీతాయా అంగదముఖా బభ్రముస్తత్ర తత్ర హ. 30

భ్రమంతో వింధ్యగహనే దదృశుః పర్వతోపమమ్,
రాక్షసం భీషణాకారం భక్షయంతం మృగాన్ గజాన్. 31

రావణోఽయమితి జ్ఞాత్వా కేచిద్వానరపుంగవాః,
జఘ్నుః కిలకిలాశబ్దం ముంచంతో ముష్టిభిః క్షణాత్. 32

నాయం రావణ ఇత్యుక్త్వా యయురన్యన్మహద్వనమ్,
తృషార్తాః సలిలం తత్ర నావిందన్ హరిపుంగవాః. 33

విభ్రమంతో మహారణ్యే శుష్కకంఠోష్ఠతాలుకాః,
దదృశుర్గహ్వరం తత్ర తృణగుల్మావృతం మహత్. 34

వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు అన్నిదిశలకు బలీయులగు వానరులను పంపి, దక్షిణదిశకు మాత్రము అత్యంతము ప్రయత్నముతో మహాబలవంతులగు అంగద, జాంబవంత, (మహాబలవంతుడగు) ఆంజనేయ, నల, సుషేణ, శరభ, మైంద, ద్వివిదులనే పంపించెను. సుగ్రీవుడీ హెచ్చరిక కూడా చేసెను (22-24)-

''మీచేత శుభాంగి జానకి అత్యంత ప్రయత్నముతో వెదకబడుగాక! ఒక్క మాసములోపలనే తిరిగిరండు! ఇది నా ఆజ్ఞ, మరువవలదు. సీతను చూడక, జాడ తీయక, నెలదాటిన పిమ్మట వచ్చినవారు నా నుండి మరణదండననే పొందుదురు'' (25-26).

ఇట్లు భీమవిక్రములగు వానరులను సుగ్రీవుడు పంపి, రామునికి నమస్కరించి ప్రక్కనే కూర్చుండెను (27). వెడలుచున్న మారుతీనందనుని చూచి రాముడిట్లు పలికెను - ''ఈ ఉత్తమమగు ఉంగరము గురుతు తెలుపుటకు! (28). నా నామాక్షరములు పొదిగియున్నవి. రహస్యముగా సీతకు ఇమ్ము. ఈ కార్యము సాధించుటకు ఓ వానరసత్తమా! నీవే సమర్థుడవు. నీ బలము నేనెరుగుదును. పొమ్ము! నీకు మార్గమున శుభము కలుగుగాక!'' (29)

ఈ విధముగా, కపిరాజుచే సీతాన్వేషణమునకై పంపబడి అంగదాది వీరులు భూమియందు అందందు తిరుగాడసాగిరి (30). తిరుగుచు తిరుగుచు, వింధ్యాటవిలో భీకరాకారుడు, పర్వతసముడు, మృగములను ఏనుగులను భక్షించుచున్న రాక్షసునొకనిని చూచిరి (31). కొందరు వానరపుంగవులు రావణుడని అనుకొని, కిలాకిలా శబ్దము చేసిరి. ముష్టిఘాతములతో క్షణములో చంపిరి (32). వాడు అంత సులభముగా చంపబడుటచే రావణుడు కాడని నిర్ధారించుకొని మరొక గొప్ప అడవి ప్రవేశించిరి. దప్పిక గొన్న ఆ వానరశ్రేష్ఠులకు ఎక్కడ నీరు దొరకలేదు. (32-33). మహారణ్యములో ఎండి పిడుచగట్టిన గొంతు, పెదవులు, దౌడలతో తిరుగాడుచు, గడ్డిపొదలతో చుట్టబడి మూయబడిఉన్న గొప్పగుహను చూచిరి (34).



శ్రీరామచంద్రుడు హనుమంతునికి ముద్రిక నిచ్చుట

ఆర్ద్రపక్షాన్ క్రౌంచహంసాన్ నిస్సృతాన్ దదృశుస్తతః,
అత్రాస్తే సలిలం నూనం ప్రవిశామో మహాగుహామ్. 35

ఇత్యుక్త్వా హనుమానగ్రే ప్రవివేశ తమన్వయుః,
సర్వే పరస్పరం ధృత్వా బాహూన్బాహుభిరుత్సుకాః. 36

అంధకారే మహద్ద్వారం గత్వాపశ్యన్ కపీశ్వరాః,
జలాశయాన్మణినిభతోయాన్ కల్పద్రుమోపమాన్. 37

వృక్షాన్పక్వఫలైర్నమ్రాన్మధుద్రోణసమన్వితాన్,
గృహాన్ సర్వగుణోపేతాన్ మణివస్త్రాదిపూరితాన్. 38

దివ్యభక్ష్యాన్నసహితాన్మానుషైః పరివర్జితాన్,
విస్మితాస్తత్ర భవనే దివ్యే కనకవిష్టరే. 39

ప్రభయా దీప్యమానాం తు దదృశుః స్త్రియమేకకామ్,
ధ్యాయంతీం చీరవసనాం యోగినీం యోగమాస్థితామ్. 40

ప్రణేముస్తాం మహాభాగాం భక్త్యా భీత్యా చ వానరాః,
దృష్ట్వా తాన్ వానరాన్దేవి ప్రాహయూయం కిమాగతాః. 41

కుతో వా కస్య దూతా వా మత్స్థానం కిం ప్రధర్షథ,
తచ్ఛ్రుత్వా హనుమానాహ శృణు వక్ష్యామి దేవి తే. 42

అందుండి రెక్కలు తడిసిన క్రౌంచములు, హంసలు వెలికి వచ్చుట చూచిరి. ''ఇక్కడ నీరుండియుండవచ్చును. గుహను ప్రవేశించెదము'' అనుచు హనుమ ముందు ప్రవేశించెను. అతని వెనుక వానరులందరు పరస్పరము ఒకరి చేతులు మరొకరు పట్టుకొని, ఉత్సుకులై ప్రవేశించిరి (35-36). చాల దూరము చీకటిలోనే సాగిన పిమ్మట ఆ వానరులచట, మణివలె స్వచ్ఛజలములు నిండిన సరోవరములను, బాగుగా పక్వమైన పండ్లబరువుతో క్రిందికి వంగి, తేనె పట్టులున్న కల్పతరువులవంటి ఎన్నో చెట్లను చూచిరి. సర్వ గుణ సమృద్ధములైన గృహములు, మణి వస్త్రాదులతో నిండి యుండుట చూచిరి (37-38). అచట దివ్య భక్ష్యాన్నము లున్నవి. భుజించు మానవులు లేరు. ఆశ్చర్యముగా దివ్యమగు బంగారు భవంతిలో అచట (39) ఒక యోగినిని వల్కలములు ధరించి ధ్యానములో నున్న యామెను చూచిరి. ఆమె ఏకాంతమున నున్నది. తన దేహకాంతిచే దిక్కులను ప్రకాశింపచేయుచున్నది (40). మహానుభావురాలగు ఆమెకు వానరులు భయభక్తులతో ప్రణామము చేసిరి. వారిని చూచి యా దేవి 'మీరు ఇటులేల వచ్చితిరి? ఎక్కడివారలు? ఎవరి దూతలు? నా స్థానము ఏల అక్రమించితిరి?' అని అడిగెను. అది విని హనుమ 'దేవీ! వినుము. చెప్పెదను (41-42).

అయోధ్యాధిపతిః శ్రీమాన్ రాజా దశరథః ప్రభుః,
తస్య పుత్రో మహాభాగో జ్యేష్ఠో రామ ఇతి శ్రుతః. 43

పితురాజ్ఞాం పురస్కృత్య సభార్యః సానుజో వనమ్,
గతస్తత్ర హృతా భార్యా తస్య సాధ్వీ దురాత్మనా. 44

రావణేన తతో రామః సుగ్రీవం సానుజో యయౌ,
సుగ్రీవో మిత్రభావేన రామస్య ప్రియవల్లభామ్. 45

అయోధ్యాపతి, ప్రభువు, శ్రీయుతుడగు దశరథ మహారాజు. అతని జ్యేష్ఠపుత్రుడు మహాభాగ్యశాలి రాముడని లోకమున ప్రసిద్ధి (43). అతడు తండ్రి యానతి తలదాల్చి భార్యాసోదరులతో అడవికి పోయెను. అక్కడ దురాత్ముడగు రావణునిచే అతని భార్య అపహరింపబడినది (44). తమ్మునితో కలసివచ్చి రాముడు సుగ్రీవుని వద్దకు చేరెను. సుగ్రీవుడు మిత్రభావముతో రాముని ప్రియురాలిని (45)

మృగయధ్వమితి ప్రాహ తతో వయముపాగతాః,
తతో వనం విచిన్వంతో జానకీం జలకాంక్షిణః. 46

ప్రవిష్టా గహ్వరం ఘోరం దైవాదత్ర సమాగతాః,
త్వం వా కిమర్థమత్రాసి కా వా త్వం వద నః శుభే. 47

యోగినీ చ తథా దృష్ట్వా వానరాన్ ప్రాహ హృష్టధీః,
యథేష్టం ఫలమూలాని జగ్ధ్వా పీత్వామృతం పయః.48

ఆగచ్ఛత తతో వక్ష్యే మమ వృత్తాంతమాదితః,
తథేతి భుక్త్వా పీత్వా చ హృష్టాస్తే సర్వవానరాః. 49

దేవ్యాః సమీపం గత్వా తే బద్ధాంజలిపుటాః స్థితాః,
తతః ప్రాహ హనూమంతం యోగినీ దివ్యదర్శనా. 50

హేమా నామ పురా దివ్యరూపిణీ విశ్వకర్మణః,
పుత్రీ మహేశం నృత్యేన తోషయామాస భామినీ. 51

తుష్టో మహేశః ప్రదదా విదం దివ్యపురం మహత్,
అత్ర స్థితా సా సుదతీ వర్షాణామయుతాయుతమ్. 52

తస్యా అహం సఖీ విష్ణు తత్పరా మోక్షకాంక్షిణీ,
నామ్నా స్వయంప్రభా దివ్య గంధర్వతనయా పురా.53

గచ్ఛంతీ బ్రహ్మలోకం సా మామాహేదం తపశ్చర,
అత్రైవ నివసంతీ త్వం సర్వప్రాణివివర్జితే. 54

త్రేతా యుగే దాశరథిర్భూత్వా నారాయణోఽవ్యయః,
భూభారహరణార్థాయ విచరిష్యతి కాననే. 55

మార్గంతో వానరాస్తస్య భార్యామాయాంతి తే గుహామ్,
పూజయిత్వాథ తాన్ నత్వా రామం స్తుత్వా ప్రయత్నతః.56

యాహి తాసి భవనం విష్ణోర్యోగిగమ్యం సనాతనమ్,
ఇతోఽహం గంతుమిచ్ఛామి రామం ద్రష్టుం త్వరాన్వితా.
57

వెదికించెదము అని చెప్పెను. అందులకై మేము ఇటు వచ్చితిమి. జానకికై అడవి యంతయు గాలించితిమి, జలమును కోరి ఘోరమగు ఈ గుహను దైవయోగముచేతనే వచ్చి చేరితిమి. నీవు ఇక్కడ ఎందులకుంటివి? ఎవరు నీవు! శుభాంగీ తెలుపుము'' (46-47).

యోగిని వానరులను చూచి సంతోషముతో యిట్లనెను ''మీ యిచ్ఛ వచ్చినట్లు ఫలమూలాదులు భుజించి, అమృత ఉపమానమగు నీరు త్రావి రండు! నా కథను మొదటి నుండియు చెప్పెదను''. 'అట్లే' యని తిని, త్రాగి ఆ వానరులు అందరు తృప్తులైరి (48-49). చేతులు జోడించుకొని ఆ దేవి కడకు వచ్చి అందరు కూర్చుండిరి. దివ్యదర్శనురాలగు ఆ యోగిని హనుమంతునితో ఇట్లు చెప్పెను (50).

''పూర్వము విశ్వకర్మకు హేమ యనెడు కుమార్తె కలదు. ఆమె దివ్యరూపిణి. ఆ సుందరి తన నాట్యముచేత శంకరుని ప్రసన్నుని గావించుకొనెను (51).

ప్రసన్నుడైన శంకరుడు ఈ విశాలమైన దివ్యనగరమును ప్రసాదించెను. వేనవేల సంవత్సరములు ఆ యువతి ఇక్కడనే నివసించెను (52).

నేను ఆమె సఖిని. దివ్య గంధర్వతనయను. స్వయంప్రభ నా పేరు. నేను విష్ణు భక్తురాలను. మోక్షేచ్ఛ కలదానను (53). ఆమె (హేమ) బ్రహ్మలోకమునకు పోవుచు నాకిట్లు చెప్పెను – 'ఇక్కడనేయుండి సర్వప్రాణులు లేని ఈ చోట నివసించుచు తపముచేయుము. త్రేతాయుగమున అవ్యయమూర్తియగు నారాయణుడు దాశరథిగా అవతరించి, భూభార హరణార్థమై అడవులలో చరించగలడు(55). అతని భార్యను వెదకుచు వానరులు నీ ఆవాసమునకు రాగలరు. వారిని పూజించి, నమస్కరించి ప్రయత్నపూర్వకముగా రాముని స్తుతించి (56), యోగి గమ్యము, సనాతనము అయిన విష్ణుపదమునకు పోగలవు'. వేగిరపడుచున్నదాననై రాముని దర్శించుటకై నేను వెడలగోరు చున్నాను (57). మీరు కన్నులు మూసికొనుడు. గుహ

యూయం పిదధ్వమక్షీణి గమిష్యథ బహిర్గుహామ్,
తథైవ చక్రుస్తే వేగాద్గతాః పూర్వస్థితం వనమ్. 58

సాపి త్యక్త్వా గుహాం శీఘ్రం యయౌ రాఘవసన్నిధిమ్,
తత్ర రామం ససుగ్రీవం లక్ష్మణం చ దదర్శ హ. 59

కృత్వా ప్రదక్షిణం రామం ప్రణమ్య బహుశః సుధీః,
ఆహ గద్గదయా వాచా రోమాంచితతనూరుహా. 60

దాసీ తవాహం రాజేంద్ర దర్శనార్థమిహాగతా,
బహువర్షసహస్రాణి తప్తం మే దుశ్చరం తపః. 61

గుహాయాం దర్శనార్థం తే ఫలితం మేఽద్య తత్తపః,
అద్య హి త్వాం నమస్యామి మాయాయాః పరతః స్థితమ్. 62

సర్వభూతేషు చాలక్ష్యం బహిరంతరవస్థితమ్,
యోగమాయాజవనికాఛన్నో మానుషవిగ్రహః. 63

న లక్ష్యసేఽజ్ఞానదృశాం శైలూష ఇవ రూపధృక్,
మహాభాగవతానాం త్వం భక్తియోగవిధిత్సయా. 64

అవతీర్ణోఽసి భగవన్ కథం జానామి తామసీ,
లోకే జానాతు యః కశ్చిత్తవ తత్త్వం రఘూత్తమ. 65

మమ్మైతదేవ రూపం తే సదా భాతు హృదాలయే,
రామ తే పాదయుగలం దర్శితం మోక్షదర్శనమ్. 66

అదర్శనం భవార్ణానాం సన్మార్గపరిదర్శనమ్,
ధనపుత్రకలత్రాదివిభూతిపరిదర్పితః,
అకించనధనం త్వాద్య నాభిధాతుం జనోఽర్హతి. 67

నివృత్తగుణమార్గాయ నిష్కించనధనాయ తే. 68

నమః స్వాత్మాభిరామాయ నిర్గుణాయ గుణాత్మనే,
కాలరూపిణమీశానమాదిమధ్యాంతవర్జితమ్. 69

బయటకు చేరగలరు''. అట్లే వానరులు చేసిరి. వేగముగా ముందున్న అడవికి పోయిరి (58). ఆమె కూడ గుహను వదలిపెట్టి రాఘవుని సన్నిధి చేరినది. ఆమె అప్పుట సుగ్రీవ లక్ష్మణులతో కలసియుండగా రాముని చూచినది (59).

రామునికి ప్రదక్షిణము చేసి, ధీమతియైన ఆమె పదేపదే నమస్కరించి, ఒడలు పులకలు నిండగా, గద్గదమగు వాక్కులతో ఇట్లనెను (60) - ''రాజేంద్రా! నేను మీ దాసిని. మిమ్ము సేవించుటకై యిటకు వచ్చితిని. దుష్కరమైన తపస్సు వేల సంవత్సరములు నాచే చేయబడినది (61). గుహలోనుండి నీ దర్శనముకొరకై చేసిన తపస్సు ఇపుడు ఫలించినది. మాయకు అందరాక విడిగా ఉండెడి నీకు ఇప్పుడే నమస్కరించెదను (62). సర్వభూతములకు అగోచరుడవు. అన్నిటియందును వెలుపల లోపల ఉండెడు వాడవు. యోగమాయ అనెడు తెరవెనుకనున్న మానుష దేహుడవు. వేషముల మార్చెడి నటుని సాధారణులు గుర్తింప లేనటుల అజ్ఞానదృక్కులు నిన్ను తెలియలేరు. మహాభక్తు లగు వారికి భక్తియోగము తెలియచేయుటకే నీవు అవతరించి యుంటివి. మరి నావంటి తామసి ఎటుల తెలిసికొన గలుగును! లోకములో ఎవరు నీ తత్త్వము తెలిసికొనగలరు రఘూత్తమా! (63-65).

నా హృదయ మందిరమున ఈ రూపమే నిలుచుగాక! నీ పాదయుగముల దర్శనమే మోక్షప్రదర్శకము (66). సంసార సముద్రము చూపనిది, సన్మార్గమును చూపునది. అకించనుల ధనమైన నిన్ను, ధన కళత్ర పుత్రాది విభూతులతో మదించినవారు స్తుతింప జాలరు (67). నివృత్తగుణమార్గుడవైన నీకు, నిష్కించనుల ధనమైన నీకు నమస్కారము. స్వాత్మాభిరాముడవు, నిర్గుణుడవు, గుణాత్ముడవు, కాలరూపుడవు, ఈశానుడవు, ఆదిమధ్యాంతరహితుడవు (69).

సమం చరంతం సర్వత్ర మన్యే త్వాం పురుషం పరమ్,
దేవ తే చేష్టితం కశ్చిన్న వేద నృవిడంబనమ్. 70

న తేఽస్తి కశ్చిద్దయితో ద్వేష్యో వాపర ఏవ చ,
త్వన్మాయాపిహితాత్మానస్త్వాం పశ్యంతి తథావిధమ్. 71

అజస్యాకర్తురీశస్య దేవతిర్యఙ్నరాదిషు,
జన్మకర్మాదికం యద్యత్తదత్యంతవిడంబనమ్. 72

త్వామాహురక్షరం జాతం కథాశ్రవణసిద్ధయే,
కేచిత్కోసలరాజస్య తపసః ఫలసిద్ధయే. 73

కౌసల్యయా ప్రార్థ్యమానం జాతమాహుః పరే జనాః,
దుష్టరాక్షసభూభారహరణాయార్థితో విధుః. 74

బ్రహ్మణా నరరూపేణ జాతోఽయమితి కేచన,
శృణ్వంతి గాయంతి చ యే కథాస్తే రఘునందన. 75

పశ్యంతి తవ పాదాబ్జం భవార్ణవసుతారణమ్,
త్వన్మాయాగుణబద్ధోఽహం వ్యతిరిక్తం గుణాశ్రయమ్. 76

కథం త్వాం దేవజానీయాంస్తోతుం వాఽవిషయం విభుమ్,
నమస్యామి రఘుశ్రేష్ఠం బాణాసనశరాన్వితమ్.
లక్ష్మణేన సహ భ్రాత్రా సుగ్రీవాదిభిరన్వితమ్. 77

ఏవం స్తుతో రఘుశ్రేష్ఠః ప్రసన్నః ప్రణతాఘహృత్,
ఉవాచ యోగినీం భక్తాంకిం తే మనసి కాంక్షితమ్. 78

సా ప్రాహ రాఘవం భక్త్యా భక్తిం తే భక్తవత్సల,
యత్ర కుత్రాపి జాతాయా నిశ్చలాం దేహి మే ప్రభో. 79

త్వద్భక్తేషు సదా సంగో భూయాన్మే ప్రాకృతేషు న,
జిహ్వా మే రామరామేతి భక్త్యా వదతు సర్వదా. 80

సర్వత్ర సముడవై చరించువాడవు నిన్ను పరమ పురుషునిగా భావింతును. దేవా! మానవుని వలె ఆచరించు నీ చేష్టితములు తెలియగల వారెవరు? (70) నీకు ఎందును ప్రియులు, ద్వేష్యులు లేరు. నీ మాయచే ఆవృతులైన వారు మాత్రమే నిన్ను ఆ యా రూపములలో చూచుచున్నారు (71). నీవు జన్మలు లేని వాడవు. కర్తవు కావు. ఈశ్వరుడవు. దేవమానవ తిర్యక్ యోనులలో సాగింపబడు కర్మలు అన్నియు నీ లీలలే! (72). అక్షరుడవు. పరుడవు. నీ కథాశ్రవణ ఫలము నిచ్చుటకు, కోసలరాజు తపస్సునకు ఫలము నిచ్చుటకు, కౌసల్య చేత ప్రార్థితుడవై అవతరించితివని పెద్దలు చెప్పుదురు. మరి కొందరు విభువగు బ్రహ్మచేత ప్రార్థింపబడి దుష్ట రాక్షసుల బారినుండి భూమిని రక్షింప అవతరించితివని, నరరూపముతో వెలసితివని కొందరు, చెప్పుచున్నారు. రఘునందనా! నీ కథలను ఎవరు విందురో, గానము చేయుదురో, వారు భవసముద్రము దాటింపగలుగు నీ పాదపద్మమును చూడగలుగుదురు. ఓ పరమాత్మా! నీ మాయా గుణములచే కట్టబడిన నేను, మాయకు వ్యతిరిక్తుడవు, గుణాశ్రయుడవు అగు నిన్ను తెలిసికొన గలుగుట ఎట్లు? దేవా! గొప్పదైన నీ విషయమును ఎటుల స్తుతించగలను? రఘుశ్రేష్ఠా! శరములను దాల్చి తమ్ముడగు లక్ష్మణునితో సుగ్రీవాదులతో పరివేష్టించి యున్న నీకు నమస్కరించెదను'' (73-77).

ఈ విధముగా స్తుతించగా శరణాగతుల ఆర్తి హరించు రాముడు అత్యంత ప్రసన్నుడై యోగినియగు స్వయంప్రభకు ఇట్లు చెప్పెను - ''నీ మనసులో కోరుకొనునది ఏమి!'' (78). ఆమె ఇట్లు సమాధాన మిచ్చెను- ''భక్తవత్సలా! ప్రభూ! నేనెచ్చట ఎటుల జన్మము పొందినను అచంచలమైన నీ యందలి భక్తినే ప్రసాదింపుడు (79). నీ భక్తులతో సదా సాంగత్యము కలుగుగాక! సంసార లంపటులతో కలుగకుండుగాక! నా నాలుక సర్వదా 'రామరామ' యని పలుకుగాక! (80).

మానసం శ్యామలం రూపం సీతాలక్ష్మణసంయుతమ్,
ధనుర్బాణధరం పీతవాససం ముకుటోజ్జ్వలమ్. 81

అంగదైర్నూపురైర్ముక్తాహారైః కౌస్తుభకుండలైః,
భాంతం స్మరతు మే రామ వరం నాన్యం వృణే ప్రభో. 82

రాఘవా! ఓ ప్రభూ! నీ శ్యామలరూపమును, సీతాలక్ష్మణయుతము, ధనుర్బాణములు ధరించియున్నది, పీతాంబర సుశోభిత మైనది, కిరీటకాంతుల వెలయునది, అంగద నూపురము లచే, ముత్యాలదండలచే, కౌస్తుభ కుండలములచే ప్రకాశించు దివ్యరూపము నా మనసు ఎపుడును స్మరించుగాక! ఇంతకంటె వేరొక్కవరము నేను కోరను!'' (81-82).

శ్రీరామ ఉవాచ

భవత్వేవం మహాభాగే
గచ్ఛ త్వం బదరీవనమ్,
తత్రైవ మాం స్మరంతీ త్వం
త్యక్త్వేదం భూతపంచకమ్,
మామేవ పరమాత్మానమచిరాత్ప్రతిపద్యసే. 83

శ్రీరాముడిట్లనెను - ''మహాభాగా! అట్లే యగు గాక! నీవిక బదరికావనమునకు పొమ్ము. అచ్చటనే నన్ను ధ్యానించుచు, పాంచ భౌతిక దేహమును వదలిపెట్టి, అచిర కాలములోనే పరమాత్మనగు నన్ను నా పదమును చేరెదవు'' (83).

శ్రుత్వా రఘూత్తమవచోఽమృతసారకల్పం
గత్వా తదైవ బదరీతరుషండజుష్టమ్,
తీర్థం తదా రఘుపతిం మనసా స్మరంతీ
త్యక్త్వా కలేవరమవాప పరం పదం సా. 84

రఘూత్తముని అమృతసారములగు పలుకులు విని, అపుడే స్వయంప్రభ బదరీతరువుల తోపులు నిండిన తీర్థప్రదేశమునకు వెడలి అచటనే రఘుపతిని మనసార ధ్యానించుచు శరీరమును వదలి పరమపదము చేరెను (84).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ షష్ఠమ సర్గము ॥ 6 ॥

----****----

ॐ

సప్తమ సర్గము

వానర ప్రాయోపవేశము - సంపాతి కలయిక

శ్రీమహాదేవ ఉవాచ

అథ తత్ర సమాసీనా వృక్షషండేషు వానరాః,
చింతయంతో విముహ్యంతః సీతామార్గణకర్శితాః. 1

తత్రోవాచాంగదః కాంశ్చిద్వానరాన్ వానరర్షభః,
భ్రమతాంగహ్వరేఽస్మాకంమాసో నూనం గతోఽభవత్. 2

సీతా నాధిగతాస్మాభిర్న కృతం రాజశాసనమ్,
యది గచ్ఛామ కిష్కింధాం సుగ్రీవోఽస్మాన్ హనిష్యతి. 3

విశేషతః శత్రుసుతం మాం మిషాన్నిహనిష్యతి,
మయి తస్య కుతః ప్రీతిరహం రామేణ రక్షితః. 4

ఇదానీం రామకార్యం మే న కృతం తన్మిషం భవేత్,
తస్య మద్ధననే నూనం సుగ్రీవస్య దురాత్మనః. 5

మాతృకల్పాం భ్రాతృభార్యాం పాపాత్మానుభవత్యసౌ,
న గచ్ఛేయమతః పార్శ్వం తస్య వానరపుంగవాః. 6

త్యక్ష్యామి జీవితం చాత్ర యేన కేనాపి మృత్యునా,
ఇత్యశ్రునయనం కేచిద్దృష్ట్వా వానరపుంగవాః. 7

వ్యథితాః సాశ్రునయనా యువరాజమథాబ్రువన్, 8

కిమర్థం తవ శోకోఽత్ర వయం తే ప్రాణరక్షకాః,
భవామో నివసామోఽత్ర గుహాయాం భయవర్జితాః. 9

సర్వసౌభాగ్యసహితం పురం దేవపురోపమమ్,
శనైః పరస్పరం వాక్యం వదతాం మారుతాత్మజః. 10

శ్రీమహాదేవుడు ఇట్లనెను - ''పార్వతీ! ఇట సీతాన్వేషణలో అలసిన వానరులు దట్టముగా చెట్లున్న చోట కూర్చుండి, ఏది చేయుటకు పాలుపోక యోచించుకొన సాగిరి (1). అపుడు వానరశ్రేష్ఠుడు అంగదుడు ఇట్లనెను ''మనము ఈ గుహలో తిరుగాడుచుండగా నెలరోజులు అవశ్యము పూర్తి అయి ఉండునని తోచుచున్నది (2). సీత జాడ తెలియనైతిమి. రాజశాసనమును పాటించనైతిమి. మనము తిరిగి కిష్కింధ ఇపుడు చేరితిమేని సుగ్రీవుడు మనల నందరను చంపగలడు? (3) అంతకు మించి నేను శత్రువు కుమారుడనన్న నెపముతో తప్పక చంపును. నా యందు ఆతనికి ప్రేమ ఎక్కడిది? నేను రామునిచేతనే రక్షింపబడితిని (4). ఇపుడు రామకార్యము నాచేత చేయబడలేదు అన్న మిష ఉండును. దురాత్ముడగు సుగ్రీవుడు నన్ను వధింప ఈ నెపము తప్పక చూచును (5). తల్లి వంటి అన్నభార్యను పాపాత్ముడై అనుభవించుచున్నాడు. అందువలన ఓ వానరులారా! వాని తావునకు నేను పోనేపోను (6). ఏదో ఒక విధమగు మరణోపాయముతో జీవితమును చాలించు కొనెదను''. ఇట్లు కన్నీరు పెట్టుకొన్న ఆతనిని చూచి కొందరు వానరపుంగవులు (7) వారును దుఃఖించి కన్నీటితో యువరాజునకు ఇట్లు చెప్పిరి (8). ''నీవెందులకు శోకింతువు! నీ ప్రాణ రక్షకులము మేమున్నాము. భయ వర్జితులమై మనము ఈ గుహలోనే నివసించెదము (9). ఈ నగరము అమరావతీ నగరమువలె సర్వసమృద్ధమై సౌభాగ్యము నిండియున్నది''. ఈ విధముగా వారిలో వారు మెల్లగా చెప్పుకొను మాటలు మారుతాత్మజుడు విని (10),

శ్రుత్వాంగదం సమాలింగ్య ప్రోవాచ నయకోవిదః,
విచార్యతే కిమర్థం తే దుర్విచారో న యుజ్యతే. 11

రాజ్ఞోఽత్యంతప్రియస్త్వం హి తారాపుత్రోఽతివల్లభః,
రామస్య లక్ష్మణాత్ప్రీతిస్త్వయి నిత్యం ప్రవర్తతే. 12

అతో న రాఘవాద్భీతిస్తవ రాజ్ఞో విశేషతః,
అహం తవ హితే సక్తో వత్స నాన్యం విచారయ. 13

గుహావాసశ్చ నిర్భేద్య ఇత్యుక్తం వానరైస్తు యత్,
తదేతద్రామబాణానామభేద్యం కిం జగత్త్రయే. 14

యే త్వాం దుర్బోధయంత్యేతే వానరా వానరర్షభ,
పుత్రదారాదికం త్యక్త్వా కథంస్థాస్యంతి తే త్వయా. 15

అన్యద్గుహ్యతమం వక్ష్యే రహస్యం శృణు మే సుత,
రామో న మానుషో దేవః సాక్షాన్నారాయణోఽవ్యయః. 16

సీతా భగవతీ మాయా జనసమ్మోహకారిణీ,
లక్ష్మణో భువనాధారః సాక్షాచ్ఛేషః ఫణీశ్వరః. 17

బ్రహ్మణా ప్రార్థితాః సర్వే రక్షోగణవినాశనే,
మాయామానుషభావేన జాతా లోకైకరక్షకాః. 18

వయం చ పార్షదాః సర్వే విష్ణోర్వైకుంఠవాసినః,
మనుష్యభావమాపన్నే స్వేచ్ఛయా పరమాత్మని. 19

వయం వానరరూపేణ జాతాస్తస్యైవ మాయయా,
వయం తు తపసా పూర్వమారాధ్య జగతాం పతిమ్. 20

తేనైవానుగృహీతాః స్మః పార్షదత్వముపాగతాః,
ఇదానీమపి తస్యైవ సేవాం కృత్వైవ మాయయా. 21

పునర్వైకుంఠమాసాద్య సుఖం స్థాస్యామహే వయమ్,
ఇత్యంగదమథాశ్వాస్య గతా విన్ధ్యం మహాచలమ్. 22

అంగదుని ఆలింగనము చేసికొని, నయకోవిదుడగు అతడు ఇట్లనెను - ''నీ కిట్లు విచారింప నవసరమేమి! ఈ విధముగా దుర్మార్గముగా ఆలోచింపరాదు. నీవు సుగ్రీవ మహారాజునకు అత్యంత ప్రియుడవు. తారకు ముద్దుల కుమారుడవు. రామునకు లక్ష్మణునియందు కంటె నీపై ప్రేమ వర్ధిల్లుచున్నది (11-12).

నీకు రాఘవుని వలన భీతి లేదు. విశేషించి సుగ్రీవునివలన కూడ లేదు. వత్సా! నేనును నీ హితము కోరువాడను. వేరుగా యోచన చేయవలదు (13). ఈ గుహలో ఎట్టి ప్రమాదము లేదని ఏ వానరులు చెప్పిరో - మూడు లోకములలో రామబాణ ధాటికి నిలువగలిగినది ఏది? (14) ఎవరు నీ కిట్టి దుర్బోధలు గావించిరో, వారు మాత్రము తమ స్త్రీ పుత్రాదులను వదలి నీతో ఎట్లుండ గలరు? (15).

''నాయనా! మరొక్క రహస్యమును చెప్పెదను వినుము! ఇది రహస్యాతి రహస్యము. శ్రీరాముడు మానవుడు కాదు. అతడు దేవుడు. అవ్యయుడగు సాక్షాత్తు నారాయణుడు (16). సీత జగన్మోహిని యగు మాయ. లక్ష్మణుడు త్రిభువనాధారభూతుడు, నాగనాథుడు ఆదిశేషుడు (17). వీరందరు బ్రహ్మచే ప్రార్థింపబడి రాక్షసగణ వినాశముకొరకు లోకైకరక్షకులై మాయామానుష భావమున జన్మించిరి. మనమందరము వైకుంఠమున నుండెడి విష్ణుపార్షదులము. పరమాత్మ తన స్వేచ్ఛచే మానవరూపము ధరింపగా, మనమందరము అతని మాయాశక్తిచేత వానరులమై జన్మించితిమి. పూర్వకాలమున మనము తపస్సు ద్వారా జగత్పతిని ఆరాధించి, అతనిచేత అనుగ్రహింపబడినవారము. తద్వారా ఆయనకు పార్షదులమైతిమి. ఇపుడును అతని లీలలో పాల్గొనుటకై, అతని మాయచేత ఇటుల జన్మించి, ఆయనను సేవించి, తిరిగి వైకుంఠమును చేరి సుఖముగా నుండెదము''. ఇట్లు అంగదుని ఆశ్వాసించి, వింధ్యాచలమునకు ఏగిరి (18-22).

విచిన్వంతోఽథ శనకైర్జానకీం దక్షిణాంబుధేః,
తీరే మహేంద్రాఖ్యగిరేః పవిత్రం పాదమాయయుః. 23

దృష్ట్వా సముద్రం దుష్పారమగాధం భయవర్ధనమ్,
వానరా భయసంత్రస్తాః కిం కుర్మ ఇతి వాదినః. 24

నిషేదురుదధేస్తీరే సర్వే చింతాసమన్వితాః,
మంత్రయామాసురన్యోన్యమంగదాద్యా మహాబలాః 25

భ్రమతో మే వనే మాసో గతోఽత్రైవ గుహాంతరే.
న దృష్టో రావణో వాద్య సీతా వా జనకాత్మజా. 26

సుగ్రీవస్తీక్ష్ణదండోఽస్మాన్నిహంత్యేవ న సంశయః,
సుగ్రీవవధతోఽస్మాకం శ్రేయః ప్రాయోపవేశనమ్. 27

ఇతి నిశ్చిత్య తత్రైవ దర్భానాస్తీర్య సర్వతః.
ఉపావివేశుస్తే సర్వే మరణే కృతనిశ్చయాః. 28

ఏతస్మిన్నంతరే తత్ర మహేంద్రాద్రిగుహాంతరాత్,
నిర్గత్య శనకైరాగాద్గృధ్రః పర్వతసన్నిభః. 29

దృష్ట్వా ప్రాయోపవేశేన స్థితాన్వానరపుంగవాన్,
ఉవాచ శనకైర్గృధ్రః ప్రాప్తో భక్ష్యోఽద్య మే బహుః. 30

ఏకైకశః క్రమాత్సర్వాన్ భక్షయామి దినే దినే,
శ్రుత్వా తద్గృధ్రవచనం వానరా భీతమానసాః. 31

భక్షయిష్యతి నః సర్వానసౌ గృధ్రో న సంశయః,
రామకార్యం చ నాస్మాభిః కృతం కించిద్ధరీశ్వరాః. 32

సుగ్రీవస్యాపి చ హితం న కృతం స్వాత్మనామపి,
వృథానేన వధం ప్రాప్తా గచ్ఛామో యమసాదనమ్. 33

క్రమముగా సీతను వెదకుచు దక్షిణ సముద్ర తటమున మహేంద్రగిరి పవిత్ర ప్రత్యంత స్థలము చేరిరి (23).

దాటరానిది, లోతైనది, భీకరమైనది అగు సముద్రము చూచి వానరులందరు భయము చెంది, ఇంకేమి చేయుదమని ప్రశ్నించుకొనసాగిరి (24). అందరు చింతాక్రాంతులై సముద్రతటము చేరిరి. అంగదాది మహాబలులు మంత్రాంగమును పరస్పరము చర్చించుకొన సాగిరి (25)-

''అడవిలో తిరుగుచుండగనే గుహయందే నెల గడచిపోయినది. రావణుడుగాని, జనకాత్మజ సీత గాని కంటబడలేదు (26). సుగ్రీవుడు వాల దుశ్శాసనుడు, మనను దండించియే తీరును. సుగ్రీవునిచేత అటుల చచ్చుటకన్న ప్రాయోపవేశము మిన్న! (27)''. ఇటుల నిర్ణయించుకొని అందరును దర్భలు పరచుకొని మరణింప నిశ్చయించుకొని కూర్చుండిరి (28).

ఈ సమయముననే మహేంద్రగిరి గుహలో నుండి వెలువడి పర్వతాకారము కలిగిన ఒక గ్రద్ధ మెల్లమెల్లగా అటు చేరెను (29). ప్రాయోపవేశమున కూర్చుండియున్న వానర పుంగవులను చూచి మెల్లగా గ్రద్ధ యిట్లనెను - ''నాకీనాడు పుష్కలముగా భోజ్యములు ఇపుడు ప్రాప్తించెను. ఒక్కొక్క దినము క్రమముగా అందరిని ఒక్కొక్కరిని చొప్పున తినివేసెదను''. ఆ గ్రద్ధ మాటలు విని, వానరులందరు భీతమానసులై (30-31)- ''ఈ గ్రద్ధ నిస్సందేహముగా మనలనందర చంపి తినివేయును. అయ్యో! వానరేశ్వరులారా రాముని కార్యము అవంతైనను చేయ నైతిమి! అటు సుగ్రీవునకు గాని, ఇటు మనకు గాని హితము ఘటింపనైతిమి! వృధాయాసముగా ఈ మరణము పొంది యమాలయమునకు పోనుంటిమి (32-33).

అహో జటాయుర్ధర్మాత్మా రామస్యార్థే మృతః సుధీః,
మోక్షం ప్రాప దురావాపం యోగినామప్యరిందమః. 34

సంపాతిస్తు తదా వాక్యం శ్రుత్వా వానరభాషితమ్,
కే వా యూయం మమ భ్రాతుః కర్ణపీయూషసన్నిభమ్. 35

జటాయురితి నామాద్య వ్యాహరంతః పరస్పరమ్,
ఉచ్యతాం వో భయం మా భూన్మత్తః ప్లవగసత్తమాః. 36

తమువాచాంగదః శ్రీమానుత్థితో గృధ్రసన్నిధౌ,
రామో దాశరథిః శ్రీమాన్ లక్ష్మణేన సమన్వితః. 37

సీతయా భార్యయా సార్ధం విచచార మహావనే,
తస్య సీతా హృతా సాధ్వీ రావణేన దురాత్మనా. 38

మృగయాం నిర్గతే రామే లక్ష్మణే చ హృతా బలాత్,
రామరామేతి క్రోశంతీ శ్రుత్వా గృధ్రః ప్రతాపవాన్. 39

జటాయుర్నామ పక్షీంద్రో యుద్ధం కృత్వా సుదారుణమ్.
రావణేన హతో వీరో రాఘవార్థం మహాబలః. 40

రామేణ దగ్ధో రామస్య సాయుజ్యమగమత్క్షణాత్,
రామః సుగ్రీవమాసాద్య సఖ్యం కృత్వాగ్నిసాక్షికమ్. 41

సుగ్రీవచోదితో హత్వా వాలినం సుదురాసదమ్,
రాజ్యం దదౌ వానరాణాం సుగ్రీవాయ మహాబలః. 42

సుగ్రీవః ప్రేషయామాస సీతాయాః పరిమార్గణే,
అస్మాన్వానరవృందాన్ వై మహాసత్త్వాన్ మహాబలః. 43

మాసాదర్వాఙ్నివర్తధ్వం నోచేత్ప్రాణాన్ హరామి వః,
ఇత్యాజ్ఞయా భ్రమంతోఽస్మిన్వనే గహ్వరమధ్యగాః. 44

గతో మాసో న జానీమః సీతాం వా రావణం చ వా,
మర్తుం ప్రాయోపవిష్టాః స్మః తీరే లవణవారిధేః. 45

ఆహా! ధర్మాత్ముడగు జటాయువు రాముని కొరకై మృతి చెందిన బుద్ధిశాలి! ఆతడు శత్రుదమనుడై యోగులు ఎవ్వరికీ అందరాని పరమపదమునే పొందగలిగెను'' (34) అనుకొనుచు చింతించసాగిరి. ఈ మాటలు వానరు లన్నవి విని సంపాతి ''ఎవ్వరయ్యా! మీరు నా చెవుల అమృతపు సోనలు కురిపించునట్టి నా సోదరుడు జటాయువు నామమును పరస్పరము పలుకుచున్నారు. భయపడవలదు! తెలివిలేనివారై ప్రమత్తులు కావద్దు!'' అని అడిగెను (35-36).

శ్రీమంతుడగు అంగదుడు ఆ గ్రద్ద కడకేగి ఇట్లు చెప్పెను - ''శ్రీయుతుడగు దశరథసుతుడు శ్రీరాముడు లక్ష్మణునితో భార్యయగు సీతతో మహావనమునందు సంచరించెను. అక్కడ దురాత్ముడగు రావణునిచే సీత అపహరించబడినది. రామలక్ష్మణులు వేటకై వెడలగా బలాత్కారముగా సీత గొనిపోబడినది. 'రామా! రామా!' యనుచు ఆక్రోశించు సీత విలాపమును విని ప్రతాపవంతుడగు ఆ గ్రద్ద (37-39), జటాయువను పేరుగల పక్షిరాజు, మహాబలుడు, రాఘవునికొరకై ఘోరముగా యుద్ధముచేసి రావణునిచే హతమార్చబడెను (40). రామునిచే దగ్ధము చేయబడి ఆతడు క్షణములో శ్రీరామసాయుజ్యమును పొందెను. రాముడు సుగ్రీవుని చేరి అగ్నిసాక్షికముగా మైత్రి చేసికొని (41), సుగ్రీవుడు ప్రేరేపించగా దురాసదుడైన వాలిని చంపి, మహాబలుడగు రాముడు, వానరరాజ్యమును సుగ్రీవున కిచ్చెను (42). మహాబలుడగు సుగ్రీవుడు మావంటి మహాసత్త్వులను, సీతాన్వేషణకై పంపించెను (43). 'మాసము లోపల తిరిగి రావలయును. లేకున్న మరణ దండనమని' ఆతని ఆజ్ఞ. అది తలదాల్చి వనములో తిరుగుచు గుహలో ప్రవేశించి యుండగా (44), మాసము గడువు పూర్తి అయినట్లు మాకు తెలియ రాలేదు. సీతగాని, రావణుడు గాని కంటబడలేదు. ఈ సముద్ర తీరములో ప్రాయోపవేశముతో మరణింప సిద్ధమైతిమి (45).

యది జానాసి హే పక్షిన్ సీతాం కథయ నః శుభామ్,
అంగదస్య వచః శ్రుత్వా సంపాతిర్హృష్టమానసః. 46

ఉవాచ మత్ప్రియో భ్రాతా జటాయుః ప్లవగేశ్వరాః,
బహువర్షసహస్రాంతే భ్రాతృవార్తా శ్రుతా మయా. 47

వాక్సాహాయ్యం కరిష్యేఽహం భవతాం ప్లవగేశ్వరాః,
భ్రాతుః సలిలదానాయ నయధ్వం మాం జలాంతికమ్. 48

పశ్చాత్సర్వం శుభం వక్ష్యే భవతాం కార్యసిద్ధయే,
తథేతి నిన్యుస్తే తీరం సముద్రస్య విహంగమమ్. 49

సోఽపి తత్సలిలే స్నాత్వా భ్రాతుర్దత్త్వా జలాంజలిమ్,
పునః స్వస్థానమాసాద్య స్థితో నీతో హరీశ్వరైః,
సంపాతిః కథయామాస వానరాన్ పరిహర్షయన్. 50

లంకా నామ నగర్యాస్తే త్రికూటగిరిమూర్ధని,
తత్రాశోకవనే సీతా రాక్షసీభిః సురక్షితా. 51

సముద్రమధ్యే సా లంకా శతయోజనదూరతః,
దృశ్యతే మే న సందేహః సీతా చ పరిదృశ్యతే. 52

గృధ్రత్వాద్దూరదృష్టిర్మే నాత్ర సంశయితుం క్షమమ్,
శతయోజనవిస్తీర్ణం సముద్రం యస్తు లంఘయేత్. 53

స ఏవ జానకీం దృష్ట్వా పునరాయాస్యతి ధ్రువమ్,
అహమేవ దురాత్మానంరావణం హంతుముత్సహే,
భ్రాతృహంతారమేకాకీ కింతు పక్షవివర్జితః. 54

''ఓ పక్షిరాజా! సీత జాడ నీకు తెలిసియున్న ఆ శుభాంగి ఉనికి తెలుపుము''. ఇట్లు అంగదుడు పలుకగా ఆ మాటలు విని సంపాతి ఆహ్లాదహృదయుడై (46) ఇట్లనెను - ''వానరవీరులారా! జటాయువు నా ప్రియ సోదరుడు. వేలాది సంవత్సరముల తరువాత సోదరుని వార్త వింటిని (47). వానరులారా! మీకు తప్పక మాట సాయము చేసెదను. ముందుగా నా సోదరునకు జలాంజలి యిచ్చుటకు నీటివద్దకు తీసికొని పొండు. ఆ తరువాత మీ కార్యము సిద్ధించునటుల అంతయు చెప్పెదను''. 'అట్లే' యని వారు సంపాతిని సముద్రతీరమునకు తీసికొని వెళ్లిరి (48-49). అతడును నీటియందు స్నానమాచరించి జటాయువునకు జలాంజలి ఇచ్చి, మరల వానరవీరులచేత స్వస్థానమునకు గొనిపోబడి, ఆసీనుడై వానరులకు అపరిమితముగా సంతోషము కలుగునట్లు ఇట్లు చెప్పెను (50)- ''వానరులారా! త్రికూట గిరి శిఖరపై లంకానామ నగరమున్నది. అక్కడ అశోకవనములో సీతాదేవి రాక్షసీ గణముచే పరిరక్షితయై యున్నది (51).

లంకానగరము సముద్రమధ్యమున శతయోజనదూరమున నున్నది. నాకు కానవచ్చుచున్నది. నిస్సందేహముగా సీతాదేవి కూడ స్పష్టముగా కనిపించుచున్నది (52). నేను గృధ్రజాతుడను. కనుక దూరదృష్టి హెచ్చు. మీరు సంశయింపవలదు. శత యోజన విస్తీర్ణమగు సముద్రమును ఎవరు దాటగలరో, అతడే జానకిని చూచి తిరిగి రాగలడు. దురాత్ముడగు రావణుని నేనే ఒక్కడినే హతమార్చివేయుటకు ఉత్సహించుచుంటిని. వాడు నా భ్రాతృహంత! కాని నేను రెక్కలు లేని వాడను (53-54). ఈ నదీపతిని దాటి పోవుటకు ఎటులనో అటుల

యతధ్వమతియత్నేన లంఘితుం సరితాం పతిమ్.
తతో హంతా రఘుశ్రేష్ఠో రావణం రాక్షసాధిపమ్. 55

ప్రయత్నింపుడు. అంతట తప్పనిసరిగా రాఘవుడు రాక్షసాధిపుడై రావణుని చంపగలడు (55).

ఉల్లంఘ్య సింధుం శతయోజనాయతం
లంకాం ప్రవిశ్యాథ విదేహకన్యకామ్.
దృష్ట్వా సమాభాష్య చ వారిధిం పున-
స్తర్తుం సమర్థః కతమో విచార్యతామ్. 56

శతయోజన విస్తీర్ణమగు ఈ సముద్రమును జయించి లంఘించి లంకలో చొరబారి, వైదేహీకుమారిని చూచి, ఆమెను సమాశ్వాసించి తిరిగి సముద్రము దాటి మరలిరాగల సమర్థుడెవరో విచారింపతగును' (56).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ సప్తమ సర్గము ॥ 7 ॥

****

సంపాతి ఆత్మకథ సీత జాడను తెలుపుట

ఓమ్

అష్టమ సర్గము

సంపాతి ఆత్మ కథ

శ్రీమహాదేవ ఉవాచ

అథ తే కౌతుకావిష్టాః సంపాతిం సర్వవానరాః,
పప్రచ్ఛుర్భగవన్ బ్రూహి స్వముదంతం త్వమాదితః. 1

సంపాతిః కథయామాస స్వవృత్తాంతం పురా కృతమ్,
అహం పురా జటాయుశ్చ భ్రాతరౌ రూఢయౌవనౌ. 2

బలేన దర్పితావావాం బలజిజ్ఞాసయా ఖగౌ,
సూర్యమండలపర్యంతం గంతుముత్పతితౌ మదాత్. 3

బహుయోజనసాహస్రం గతౌ తత్ర ప్రతాపితః,
జటాయుస్తం పరిత్రాతుం పక్షైరాచ్ఛాద్య మోహతః. 4

స్థితోఽహం రశ్మిభిర్దగ్ధపక్షోఽస్మిన్వింధ్యమూర్ధని.
పతితో దూరపతనాన్మూర్ఛితోఽహం కపీశ్వరాః. 5

దినత్రయాత్పునః ప్రాణసహితో దగ్ధపక్షకః,
దేశం వా గిరికూటాన్వా న జానే భ్రాంతమానసః. 6

శనైరున్మీల్య నయనే దృష్ట్వా తత్రాశ్రమం శుభమ్,
శనైః శనైరాశ్రమస్య సమీపం గతవానహమ్. 7

చంద్రమానామమునిరాంద్దృష్ట్వా మాం విస్మితోఽవదత్,
సంపాతే కిమిదం తేఽద్య విరూపం కేన వా కృతమ్. 8

జానామి త్వామహం పూర్వమత్యంతం బలవానసి,
దగ్ధౌ కిమర్థం తే పక్షౌ కథ్యతాం యది మన్యసే. 9

శ్రీమహాదేవుడిట్లనెను - ''పార్వతీ! సంపాతి మాటలు విని వానరులందరు కుతూహల మనస్కులై అతని పరిప్రశ్న ఈ విధముగా చేసిరి - ''భగవన్! మీ ఉదంతమును ఆదినుండి వినిపించవలె!'' (1). సంపాతి తన స్వవృత్తాంతమును, తన పురాకృతమును ఈ విధముగా చెప్పిన వాడాయెను - ''నేనును, జటాయువును అన్నదమ్ములము. ఒకపుడు యౌవనారూఢబలముతో, మదముతో బలము పరీక్షించుకొను తలంపుతో ఆకాశమున సూర్యమండల పర్యంతము దర్పముతో ఎగిరి వెళ్లితిమి (2-3). చాలావేల యోజనములు ఎగిరిన పిదప, అక్కడ ఎండవేడిమికి తపించుచున్న ఆ జటాయువునకు రక్షణ కలిగించుటకై వ్యామోహముతో రెక్కలు బాగా చాచి అతనిని కప్పి, సూర్యకిరణముల తాకిడిచే రెక్కలు కాలి వింధ్య పర్వత శిఖరముపై బడి నేను ఇట్లు నిలిచియుంటిని. కపీశ్వరులారా! అంత ఎత్తునుండి క్రిందపడుటచే నేను తెలివి తప్పిపోతిని. (4-5) మూడు దినముల తరువాత ప్రాణముతో మిగిలి, రెక్కలు కాలి భ్రాంతచిత్తుడనై, నేనున్నది ఏ దేశమో, ఏ గిరి శిఖరమో తెలియనైతిని (6). మెల్లగా కన్నులు తెరచి చూడగా శుభకరమగు ఆశ్రమము కనవచ్చినది. మెల్లమెల్లగా ఆశ్రమ సమీపమునకు పోగలిగినవాడనైతిని (7). అచటి చంద్రుడను మునీశ్వరుడు నన్ను చూచి ఆశ్చర్యముతో ఇట్లడిగెను - ''సంపాతీ! ఇదంతయు ఏమి! నీకీ విరూపము ఎవరు కల్పించిరి? నీవు పూర్వము చాల బలవంతుడవని నాకు తెలియును. నీ రెక్కలు ఎందువలన కాలిపోయినవి? నీ యిచ్ఛ గలదేని తెలియచెప్పుము'' (8-9) అని అడుగగా

తతః స్వచేష్టితం సర్వం కథయిత్వాఽతిదుఃఖితః,
అబ్రవం మునిశార్దూలం దహ్యేఽహం దావవహ్నినా. 10

కథం ధారయితుం శక్తో విపక్షో జీవితం ప్రభో,
ఇత్యుక్తోఽథ మునిర్వీక్ష్య మాం దయార్ద్రవిలోచనః. 11

శృణు వత్స వచో మేఽద్య శ్రుత్వా కురు యథేప్సితమ్,

దేహమూలమిదం దుఃఖం దేహః కర్మసముద్భవః. 12

కర్మ ప్రవర్తతే దేహేఽహంబుద్ధ్యా పురుషస్య హి,
అహంకారస్త్వనాదిః స్యాదవిద్యాసంభవో జడః. 13

చిచ్ఛాయయా సదా యుక్తస్తప్తాయఃపిండవత్సదా,
తేన దేహస్య తాదాత్మ్యాద్దేహశ్చేతనవాన్భవేత్. 14

దేహోఽహమితి బుద్ధిః స్యాదాత్మనోఽహంకృతేర్బలాత్
తన్మూల ఏష సంసారః సుఖదుఃఖాదిసాధకః. 15

ఆత్మనో నిర్వికారస్య మిథ్యా తాదాత్మ్యతః సదా,
దేహోఽహం కర్మకర్తాహమితి సంకల్ప్య సర్వదా. 16

జీవః కరోతి కర్మాణి తత్ఫలైర్బధ్యతేఽవశః,
ఊర్ధ్వాధో భ్రమతే నిత్యం పాపపుణ్యాత్మకః స్వయమ్.
17

కృతం మయాధికం పుణ్యం యజ్ఞదానాది నిశ్చితమ్,
స్వర్గం గత్వా సుఖం భోక్ష్య ఇతి సంకల్పవాన్భవేత్. 18

తథైవాధ్యాసతస్తత్ర చిరం భుక్త్వా సుఖం మహత్,
క్షీణపుణ్యః పతత్యర్వాగనిచ్ఛన్కర్మచోదితః. 19

అతి దుఃఖితుడనై అంతయు నా చేతలన్నియు తెలిపితిని. మునిపుంగవునితో 'నేను దావానలమున పడి మరణింతునని' అంటిని. 'ప్రభూ! రెక్కలాడక నాకు జీవనమెటుల?' అని అడిగితిని. ముని దయార్ద్రనయనుడై నన్ను చూచి ఇట్లనెను (10-11).

- "వత్సా! నా మాట వినుము. విని తరువాత నీ యిష్టమైన పని చేయుము. దుఃఖములకు దేహమే మూలము. దేహమనునది కర్మలవలన ప్రాప్తమగును (12). పురుషునకు దేహమునందు అహంకారమున్నపుడు కర్మ ప్రవృత్తి సంభవించును. అహంకారము అనాది. అది అవిద్యా సంభవమైన జడము. అగ్నిలో క్రాగిన ఇనుపగుండు వలె అహంకారము చిదాభాసముచేత కూడియున్నది. ఇది దేహముతో తాదాత్మ్యము చెందిన కారణముగా దేహము చేతనాయుక్తమగుచున్నది (13-14). అహంకారము కారణముగా దేహమే నేను అను బుద్ధి కలుగుచున్నది. అది సంసారమునకు మూలమగుచున్నది. తద్వారా సుఖ దుఃఖములను సాధించుచున్నది (15). నిర్వికారమగు ఆత్మతో, దేహమునకు కలిగిన మిథ్యా తాదాత్మ్యము వలన జీవుడు సర్వదా నేను దేహమును, నేను కర్తను అని సంకల్పించుచు కర్మలు చేయును. ఆ యా కర్మఫలములచే అవశుడై బద్ధుడగును. పాపపుణ్యకర్మల కారణమున జననమరణరూప సంసారచక్రముననే పడి తిరుగు చుండును (16-17). సాధకుడు యజ్ఞ దానాదుల చేత నిశ్చయముగా నాచేత పుణ్యకర్మలు చేయబడినవి. స్వర్గమున కేగి సుఖములను పొందుదును" అనుచు సంకల్పించును. కాని ఈ అధ్యాసముతో అచట గొప్ప సుఖమును చాల కాలము అనుభవించి పుణ్యరాశి క్షీణించగానే కర్మచోదితుడై తాను కోరకయే క్రిందపడుచున్నాడు (18-19). మొదట

పతిత్వా మండలే చేందోస్తతో నీహారసంయుతః,
భూమౌ పతిత్వా వ్రీహ్యాదౌ తత్ర స్థిత్వా చిరం పునః. 20

భూత్వా చతుర్విధం భోజ్యం పురుషైర్భుజ్యతే తతః,
రేతో భూత్వా పునస్తేన ఋతౌ స్త్రీయోనిసించితః. 21

యోనిరక్తేన సంయుక్తం జరాయుపరివేష్టితమ్,
దినేనైకేన కలలం భూత్వా రూఢత్వమాప్నుయాత్. 22

తత్పునః పంచరాత్రేణ బుద్బుదాకారతామియాత్,
సప్తరాత్రేణ తదపి మాంసపేశిత్వమాప్నుయాత్. 23

పక్షమాత్రేణ సా పేశీ రుధిరేణ పరిప్లుతా,
తస్యా ఏవాంకురోత్పత్తిః పంచవింశతిరాత్రిషు. 24

గ్రీవా శిరశ్చ స్కంధశ్చ పృష్ఠవంశస్తథోదరమ్,
పంచధాంగాని చైకైకం జాయంతే మాసతః క్రమాత్. 25

పాణిపాదౌ తథా పార్శ్వః కటిర్జానూ తథైవ చ,
మాసద్వయాత్ప్రజాయంతే క్రమేణైవ న చాన్యథా. 26

త్రిభిర్మాసైః ప్రజాయంతే అంగానాం సంధయః క్రమాత్,
సర్వాంగుల్యః ప్రజాయంతే క్రమాన్మాసచతుష్టయే. 27

నాసా కర్ణౌ చ నేత్రే చ జాయంతే పంచమాసతః,
దంతపంక్తిర్నఖా గుహ్యం పంచమే జాయతే తథా. 28

అర్వాక్ షణ్మాసతశ్ఛిద్రం కర్ణయోర్భవతి స్ఫుటమ్,
పాయుర్మేఢ్రముపస్థం చ నాభిశ్చాపి భవేన్నృణామ్. 29

సప్తమే మాసి రోమాణి శిరః కేశాస్తథైవ చ,
విభక్తావయవత్వం చ సర్వం సంపద్యతేఽష్టమే. 30

ఆతడు చంద్రమండలముపై పడును. తరువాత చంద్ర కిరణముల మూలమున పొగమంచులో కలసి భూమిపై పడి, ధాన్యాదులయందు చాలకాలము నిలిచి తరువాత నాల్గు విధములైన భోజ్యములుగా పురుషునిచేత భుజింప బడును. అంతట రేతస్సుగా మారి ఋతుకాలమున స్త్రీ యోనియందు ప్రవేశించును (20-21).

ఒక్కదినము లోపలనే యోనిలోని రజస్సుతో కలసి మావిచే చుట్టబడి, గర్భస్థ పిండముగా పరిణామము చెంది, గట్టిదనము పొందు చున్నాడు (22). తరువాత అయిదు రాత్రులలో బుడగగా మారి, మరి ఏడు రాత్రులలో మాంసపు ముద్దగా, పదునైదు దినములలోగా రుధిరము నింపుకొని, ఇరువది అయిదు రాత్రులు గడవక మునుపే, అంకురము ఉత్పన్నమగును (23-24). ఒక మాసము గడచిన వెనుక, వరుస క్రమముగ మెడ, తల, భుజములు, వెన్నెముక, పొట్ట అను ఐదు అంగములు జనించును (25).

ఆ తరువాత రెండు నెలలలో క్రమముగా కాళ్ళు, చేతులు, పార్శ్వములు, నడుము, మోకాళ్ళు తయారగును. ఈ క్రమము ఏనాడును మారనిది (26). మూడవనెలలో అంగసంధులు నాల్గవ నెలలో వ్రేళ్ళు వ్యుత్పన్నమగును (27). అయిదవ మాసమున ముక్కు, చెవులు, నేత్రములు ఏర్పడును. అపుడే దంతముల వరుస, గోళ్ళు, గుహ్యము ఏర్పడును (28). ఆరవ మాసారంభమున చెవుల రంధ్రములు స్పష్టమగును. ఈ సమయముననే గుదము, స్త్రీ పురుష భేదముతో యోని లేదా లింగము, నాభి ఉత్పన్న మగును (29). ఏడవ నెలలో రోమములు, శిరోజములు, ఎనిమిదవనెలలో సర్వాంగములు స్పష్టములగును (30)".

జఠరే వర్ధతే గర్భః స్త్రియా ఏవం విహంగమ,
నవమే మాసి చైతన్యం జీవః ప్రాప్నోతి సర్వశః. 31

నాభిసూత్రాల్పరంధ్రేణ మాతృభుక్తాన్నసారతః,
వర్ధతే గర్భగః పిండో న మ్రియేత స్వకర్మతః. 32

స్మృత్వా సర్వాణి జన్మాని పూర్వకర్మాణి సర్వశః,
జఠరానలతప్తోఽయమిదం వచనమబ్రవీత్. 33

నానాయోనిసహస్రేషు జాయమానోఽనుభూతవాన్,
పుత్రదారాదిసంబంధం కోటిశః పశుబాంధవాన్. 34

కుటుంబభరణాసక్త్యా న్యాయాన్యాయైర్ధనార్జనమ్,
కృతం నాకరవం విష్ణుచింతాం స్వప్నేఽపి దుర్భగః. 35

ఇదానీం తత్ఫలం భుంజే గర్భదుఃఖం మహత్తరమ్,
అశాశ్వతే శాశ్వతవద్దేహే తృష్ణాసమన్వితః. 36

అకార్యాణ్యేవ కృతవాన్న కృతం హితమాత్మనః,
ఇత్యేవం బహుధా దుఃఖమనుభూయ స్వకర్మతః. 37

కదా నిష్క్రమణం మే స్యాద్గర్భాన్నిరయసన్నిభాత్,
ఇత ఊర్ధ్వం నిత్యమహం విష్ణుమేవానుపూజయే. 38

ఇత్యాది చింతయన్ జీవో యోనియంత్రప్రపీడితః,
జాయమానోఽతిదుఃఖేన నరకాత్పాతకీ యథా. 39

పూతివ్రణాన్నిపతితః కృమిరేష ఇవాపరః,
తతో బాల్యాదిదుఃఖాని సర్వ ఏవం విభుంజతే. 40

ఓ పక్షిరాజా! ఈ విధముగా స్త్రీ గర్భాశయమందు గర్భము వృద్ధి యగును. తొమ్మిదవ మాసమునందే జీవునకు పూర్తిగా చేతనాశక్తి ప్రాప్తించును (31). గర్భస్థ పిండము తన నాభిలో లగ్నమైయున్న నాళములోని సూక్ష్మరంధ్రము ద్వారా తల్లి తినిన అన్నరసమును గ్రహించి వృద్ధి పొందును. తన కర్మల వల్లనే అతడు గర్భమున మరణించక యుండును (32).

ఆ సమయమున తన పూర్వజన్మమునందలి కర్మలను తలచుకొని జఠరానలముచేత సంతప్తుడగుచు ఆ జీవుడు యీ విధముగా అనుకొనును (33)– "పూర్వము వేనవేలు యోనులలో జన్మించి నేను కోట్లాది బంధువులతోను, పశువర్గముతోను, స్త్రీ పుత్రాదులతోను, సంబంధమును అనుభవించితిని (34). అభాగ్యుడనగు నేను ఆ సమయమున స్వప్నము నందైనను శ్రీవిష్ణుభగవానుని స్మరింపలేదు. నా కుటుంబ పోషణమందే ఆసక్తుడనై, న్యాయముగనో, అన్యాయముగనో ధనార్జన చేయుటయందే నిమగ్నుడనైతిని (35). ఇపుడు దాని ఫలితముగా యీ గర్భదుఃఖమును అనుభవించు చున్నాను. నశ్వరమగు ఈ దేహమునే నిత్యమని భావించి దీని తృష్ణలో చిక్కితిని (36). సర్వదా అకార్యములనే చేయుచుంటిని. ఎన్నడును హితమునకై సాధన చేయలేదు. కావున నా కర్మానుసారముగా నేనీ విధముగా బహుళ దుఃఖము పొందుచున్నాను (37).

ఇపుడీ నరక సమాన మగు గర్భమునుండి ఎపుడు బయట పడెదనో తెలియదు. ఇక మీదట నేను సర్వదా శ్రీవిష్ణుభగవానునే ఉపాసించెదను" (38). ఇట్లు చింతించుచు ఆ జీవుడు యోని యంత్ర పీడితుడై నరకమునుండి పాపి వెలువడినట్లు అతి కష్టముతో బయల్పడును (39). ఆ సమయమున అతడు దుర్గంధ భరితమగు వ్రణమునుండి క్రిందపడిన పురుగువలె నుండును. అటుపై బాల్యాద్యవస్థలయందు దుఃఖమును పొందవలసినదే! (40).

త్వయా చైవానుభూతాని సర్వత్ర విదితాని చ.
న వర్ణితాని మే గృధ్ర యౌవనాదిషు సర్వతః. 41

ఏవం దేహోఽహమిత్యస్మాదధ్యాసాన్నిరయాదికమ్,
గర్భవాసాదిదుఃఖాని భవంత్యభినివేశతః. 42

తస్మాద్దేహద్వయాదన్యమాత్మానం ప్రకృతేః పరమ్,
జ్ఞాత్వా దేహాదిమమతాం త్యక్త్వాత్మజ్ఞానవాన్ భవేత్. 43

''గృధ్రమా! దీని తరువాత కలుగు యౌవనాది దశల దుఃఖములు నీకును తెలిసినవే. చూచినవే! కనుక నేను వర్ణింపలేదు (41). ఈ విధముగా నేను దేహమను అధ్యాసము చేత ఉత్పన్నమైన దేహాభిమానము కారణముగా జీవునకు నరకగర్భవాసాది దుఃఖములు కలుగుచున్నవి (42). కావున మానవుడు ఆత్మను ప్రకృతికి అతీతమైనదిగా, స్థూలసూక్ష్మ దేహములకంటె భిన్నముగా గుర్తించి, దేహాదులందు మమతనువీడి ఆత్మ జ్ఞాన సంపన్నుడు కావలెను (43).

జాగ్రదాదివినిర్ముక్తం సత్యజ్ఞానాదిలక్షణమ్,
శుద్ధం బుద్ధం సదా శాంతమాత్మానమవధారయేత్. 44

చిదాత్మని పరిజ్ఞాతే నష్టే మోహేఽజ్ఞసంభవే,
దేహః పతతు వారబ్ధకర్మవేగేన తిష్ఠతు. 45

యోగినో న హి దుఃఖం వా సుఖం వాజ్ఞానసంభవమ్,
తస్మాద్దేహేన సహితో యావత్ప్రారబ్ధసంక్షయః. 46

ఆత్మను సర్వదా జాగ్రదాది అవస్థలు లేనిదిగా సచ్చిత్స్వరూపముగా శుద్ధమైనదని, బుద్ధమైనదని, శాంత స్వరూపమని తెలియనగును (44). చేతన స్వరూపమగు ఆత్మజ్ఞానము కలుగగా అజ్ఞానజనిత మోహము నశించినపుడు నీ దేహము ప్రారబ్ధవశమున నిలచిన నిలచుగాక! పోయిన పోవుగాక! యోగియగు వానికి అజ్ఞానజన్యములగు సుఖదుఃఖములిక నిలువనేరవు.

తావత్తిష్ఠ సుఖేన త్వం ధృతకంచుకసర్పవత్,
అన్యద్వక్ష్యామి తే పక్షిన్ శృణు మే పరమం హితమ్. 47

త్రేతాయుగే దాశరథిర్భూత్వా నారాయణోఽవ్యయః,
రావణస్య వధార్థాయ దండకానాగమిష్యతి. 48

సీతయా భార్యయా సార్ధం లక్ష్మణేన సమన్వితః,
తత్రాశ్రమే జనకజాం భ్రాతృభ్యాం రహితే వనే. 49

రావణశ్చోరవన్నీత్వా లంకాయాం స్థాపయిష్యతి,
తస్యాః సుగ్రీవనిర్దేశాద్వానరాః పరిమార్గణే. 50

''కావుననే నీ ప్రారబ్ధము క్షయము కానంత వరకు కుబుసము వీడని సర్పమువలె ఆనందపూర్వకముగా దేహము ధరించియుండుము. అంతియేకాక! పక్షిరాజా! అత్యంత హితమగు మాట చెప్పుచున్నాను వినుము (45-47). త్రేతాయుగమున అవ్యయుడగు నారాయణుడు దాశరథియై రావణవధార్థమై దండకా వనమునకు భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో వెళ్లును. ఆ ఆశ్రమములో సోదరులిర్వురు లేని సమయమున సీతను రావణుడు దొంగవలె తీసికొనిపోయి లంకలో నిలుపును. సుగ్రీవాజ్ఞచే ఆమెను వెదకుచు, వానరులు నీవున్న సముద్రతీరమునకు రాగలరు. నీకు వారితో

ఆగమిష్యంతి జలధేస్తీరం తత్ర సమాగమః,
త్వయా తైః కారణవశాద్భవిష్యతి న సంశయః. 51

తదా సీతాస్థితిం తేభ్యః కథయస్వ యథార్థతః,
తదైవ తవ పక్షౌ ద్వావుత్పత్స్యేతే పునర్నవౌ. 52

సంపాతిరువాచ

బోధయామాస మాం చంద్రనామా మునికులేశ్వరః,
పశ్యంతు పక్షౌ మే జాతౌ నూతనావతికోమలౌ. 53

స్వస్తి వోఽస్తు గమిష్యామి సీతాం ద్రక్ష్యథ నిశ్చయమ్,
యత్నం కురుధ్వం దుర్లంఘ్యసముద్రస్య విలంఘనే. 54

యన్నామస్మృతిమాత్రతోఽపరిమితం
సంసారవారాంనిధిం
తీర్త్వా గచ్ఛతి దుర్జనోఽపి పరమం
విష్ణోః పదం శాశ్వతమ్,
తస్యైవ స్థితికారిణస్త్రిజగతాం
రామస్య భక్తాః ప్రియా
యూయం కిం న సముద్రమాత్రతరణే
శక్తాః కథం వానరాః. 55

సమాగమము కాలవశమున జరుగగలదు. ఇది నిశ్చయము (48-51). అపుడు సీత ఉనికిని నీవు చెప్పుము. అప్పటికప్పుడే మరల క్రొత్తగా నీ రెండు రెక్కలు పుట్టును (52)''

సంపాతి అనెను - ''వానరగణాధిపులారా! నాకు చంద్ర మునీశ్వరుడు అట్లు తెలిపినాడు. చూడుడు! నాకు నూతనముగా కోమలములైన రెక్కలుద్భవించినవి (53). మీకు మేలగుగాక! పోయివత్తును. మీరు నిశ్చయముగా సీతను చూచెదరు. అనుల్లంఘనీయమైన సముద్రము దాటుటకు ప్రయత్నింపుడు (54).

దుర్జనుడైనవాడు కూడా ఏ నామస్మృతి మాత్రము చేత అపరిమితమగు సంసారమును అవలీలగా తరించి, విష్ణుపదమునే చేరునో అట్టి మూడులోకములకు సృష్టిస్థితి లయకారకుడగు రాముని భక్తులు, ప్రియులు మీరు వానరులారా! ఈపాటి సముద్రమును దాటుటకు శక్తి చాలనివారు ఎట్లగుదురు?''

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ అష్టమ సర్గము ॥ 8 ॥

----****----

ఓం

నవమ సర్గము

సముద్రోల్లంఘన సమాలోచనము

శ్రీమహాదేవ ఉవాచ

గతే విహాయసా గృధ్రరాజే వానరపుంగవాః,
హర్షేణ మహతావిష్టాః సీతాదర్శనలాలసాః. 1

ఊచుః సముద్రం పశ్యంతో నక్రచక్రభయంకరమ్,
తరంగాదిభిరున్నద్ధమాకాశమివ దుర్గ్రహమ్. 2

పరస్పరమవోచన్ వై కథమేనం తరామహే,
ఉవాచ చాంగదస్తత్ర శృణుధ్వం వానరోత్తమాః. 3

భవంతోఽత్యంతబలినః శూరాశ్చ కృతవిక్రమాః,
కో వాఽత్ర వారిధిం తీర్త్వా రాజకార్యం కరిష్యతి. 4

ఏతేషాం వానరాణాం స ప్రాణదాతా న సంశయః,
తదుత్తిష్ఠతు మే శీఘ్రం పురతో యో మహాబలః. 5

వానరాణాం చ సర్వేషాం రామసుగ్రీవయోరపి,
స ఏవ పాలకో భూయాన్నాత్ర కార్యా విచారణా. 6

ఇత్యుక్తే యువరాజేన తూష్ణీం వానరసైనికాః,
ఆసన్నోచుః కించిదపి పరస్పరవిలోకినః. 7

అంగద ఉవాచ

ఉచ్యతాం వై బలం సర్వైః ప్రత్యేకం కార్యసిద్ధయే,
కేన వా సాధ్యతే కార్యం జానీమస్తదనంతరమ్. 8

శ్రీ మహాదేవుడు ఇట్లు పలికెను - ''పార్వతీ! గృధ్రరాజు సంపాతి ఆకాశమార్గమున ఎగిరిపోవగా, సీతా దర్శనమునకై తహతహలాడు వానర పుంగవులు అత్యంతము ఆనంద భరితులైరి (1). కాని సముద్రమును చూచుచు, తలలూచుచు ఇటుల పరస్పరము చెప్పుకొనసాగిరి ''ఇది మొసళ్లతో, సుడిగుండములతో భయంకరముగా నున్నది. ఆకాశము చేరవలెనన్నట్లు ఉవ్వెత్తుగా ఎగసిపడు తరంగములతో, దాటరానిదైనది. ఎటుల దీనిని దాటగలము!''. అంగదుడిట్లడిగెను - ''వానరులారా! వినుడు! (2-3) మీరందరు అత్యంత బలశాలురు! శూరులు పరాక్రమము చూపగలవారు! ఎవరు సముద్రమును దాటి రాజకార్యము సాధింపగలరు! (4) అతడెవరో నిస్సంశయముగా ఈ వానరకోటికి ప్రాణదాతయే! వేగమే కదలి ముందునకు వచ్చు మహాబలుడెవరు?'' అతడు వానరులకందరికి మాత్రమే కాదు, రామసుగ్రీవులకు ప్రాణదాత! అతడే పరిపాలకుడు. ఇంక విచారింప పనిలేదు (5-6)''. ఇట్లు యువరాజు పలుకగనే వానర సైనికులు ఎవ్వరును ఏమియును పలుకనేరక పరస్పరము చూచుకొనుచు ఊరకుండిరి (7). అంగదు డిట్లనెను - ''ప్రతియొక్కరు కార్యసిద్ధికై తమతమ బలములను ప్రత్యేకముగా చెప్పుడు. ఎవరి కార్యము సాధింపగలరన్న విషయము ముందుమాట!'' (8).

అంగదస్య వచః శ్రుత్వా ప్రోచుర్వీరా బలం పృథక్,
యోజనానాం దశారభ్య దశోత్తరగుణం జగుః. 9

అంగదుని మాటలు విని వీరులందరు వేరువేరుగా తమ బలమును తెలిపిరి. పదియోజనములతో మొదలు పెట్టి పదిహొప్పున పెంచుచు పోయిరి (9).

తతాదర్వాగ్జాంబవాంస్తు ప్రాహ మధ్యే వనౌకసామ్,
పురా త్రివిక్రమేదేవే పాదం భూమానలక్షణమ్. 10

త్రిఃసప్తకృత్వోఽహమగాం ప్రదక్షిణవిధానతః,
ఇదానీం వార్ధకగ్రస్తో న శక్నోమి విలంఘితుమ్. 11

వనచరులందరిలో చివరికి జాంబవంతుడు నూరు యోజనములని చెప్పి యిట్లనెను – ''పూర్వకాలమున శ్రీవిష్ణుభగవానుడు త్రివిక్రముడై పాద ప్రసారము చేసినపుడు అతని చరణము చుట్టును భూభాగమునకు సరిపడియున్నదానికి ఇరువది ఒక్క మారులు ప్రదక్షిణము చేసితిని. ఇపుడు వృద్ధుడనైతిని. లంఘింప శక్తి చాలదు!'' (10-11).

అంగదోఽప్యాహ మే గంతుం శక్యం పారం మహోదధేః,
పునర్లంఘనసామర్థ్యం న జానామ్యస్తి వా న వా. 12

తమాహ జాంబవాన్వీరస్త్వం
రాజా నో నియామకః,
న యుక్తం త్వాం నియోక్తుం
మే త్వం సమర్థోఽసియద్యపి. 13

అంగదుడు ''నేను నూరు యోజనములు లంఘించగలను. మరి తిరిగి వచ్చుటకు శక్తి చాలునో చాలదో ఎరుగను'' అనెను (12). అతనితో జాంబవంతుడు ఇట్లనెను – ''మహావీరా! నీవు రాజావు! మాకు నియామకుడవు. నీవు వెడలి, మరలి వచ్చుటకు సమర్థుడవైనను నిన్ను నియోగింప నర్హుడవు కావు (13).

అంగద ఉవాచ

ఏవం చేత్పూర్వవత్సర్వే స్వప్స్యామో దర్భవిష్టరే,
కేనాపి న కృతం కార్యం జీవితుం చ న శక్యతే. 14

అంగదుడిట్లనెను – ''అట్లయినచో ముందటి వలెనే మనము అందరము దర్భలపై శయనింతము. ఈ పని ఎవరము చేయక, జీవించుట ఎట్లు? (14)''

తమాహ జాంబవాన్వీరో దర్శయిష్యామి తే సుత,
యేనాస్మాకం కార్యసిద్ధిర్భవిష్యత్యచిరేణ చ. 15

ఇత్యుక్త్వా జాంబవాన్ప్రాహ హనూమంతమవస్థితమ్,
హనూమన్ కిం రహస్తూష్ణీం స్థీయతే కార్యగౌరవే. 16

వీరవరుడగు జాంబవంతుడిట్లనెను – ''నాయనా! అచిరకాలములో కార్యసిద్ధి ఎవరివలన జరుగునో అతనిని నేను చూపించెదను''. ఇట్లని ఉదాసీనముగా కూర్చుండిన హనుమంతునితో యిట్లనెను – ''హనుమా! కార్యభారము ఉండగా ఎందులకు ఏకాంతమున ఉదాసీనముగా నుండుట! (15-16).

ప్రాప్తేఽత్రైనేవ సామర్థ్యం దర్శయాద్య మహాబల,
త్వం సాక్షాద్వాయుతనయో వాయుతుల్యపరాక్రమః.
17

నీవు సాక్షాత్తుగ వాయు పుత్రుడవు. వాయుతుల్యపరాక్రముడవే! మహాబలా! నీ సామర్థ్యము ప్రకటించుము! (17) మహాత్ముడగు వాయుదేవునిచే

రామకార్యార్థమేవ త్వం జనితోఽసి మహాత్మనా,
జాతమాత్రేణ తే పూర్వం దృష్ట్వోద్యంతం విభావసుమ్. 18

పక్వం ఫలం జిఘృక్షామీత్యుత్ప్లుతం బాలచేష్టయా,
యోజనానాం పంచశతం పతితోఽసి తతో భువి. 19

అతస్త్వద్బలమాహాత్మ్యం కో వా శక్నోతి వర్ణితుమ్,
ఉత్తిష్ఠ కురు రామస్య కార్యం నః పాహి సువ్రత. 20

రామకార్యార్థమే నీవు జననమొందినావు. పుట్టీ పుట్టగనే ఉదయించు సూర్యుని చూచి (18), పక్వఫల మిది, పట్టి భక్షింతునని చింతించి, బాలచేష్టతో ఆకసమున కెగిరి అక్కడనుండి ఐదువందల యోజనముల ఎత్తు నుండి నేలపై పడితివి (19). అందువలన నీ బల మాహాత్మ్యము ఎవరు వర్ణించగలరు? లెమ్ము! రామకార్యము సాధించుము! సువ్రతా! మమ్ములను రక్షింపుము!'' (20).

శ్రుత్వా జాంబవతో వాక్యం హనూమానతిహర్షితః,
చకార నాదం సింహస్య బ్రహ్మాండం స్ఫోటయన్నివ. 21

బభూవ పర్వతాకారస్త్రివిక్రమ ఇవాపరః,
లంఘయిత్వా జలనిధిం కృత్వా లంకాం చ భస్మసాత్. 22

రావణం సకులం హత్వాఽఽనేష్యే జనకనందినీమ్,
యద్వా బద్ధ్వా గలే రజ్వా రావణం వామపాణినా. 23

లంకాం సపర్వతాం ధృత్వా
రామస్యాగ్రే క్షిపామ్యహమ్,
యద్వా దృష్ట్వైవ యాస్యామి
జానకీం శుభలక్షణామ్. 24

జాంబవంతుడాడిన యీ మాటలకు హనుమ అతి హర్షితుడై బ్రహ్మాండము బీటలు వారునట్లు భయంకర సింహనాదము చేసెను (21). అపర త్రివిక్రముని వలె పర్వతము అంత ఎత్తు ఎదిగెను ''వానరులారా! సముద్రము లంఘించి, లంకనంతయు భస్మము గావించి రావణుని సకులముగా వధించి జనకనందినిని సాధించి తీసికొనివత్తును. లేదా రావణుని మెడలో త్రాడు గట్టి, ఎడమచేతితో సపర్వతయుతముగా లంకను ధరించి (పెకలించి) రాముని ముందు పడవైచెదను. లేదా శుభలక్షణయగు జానకిని చూచియే తిరిగి వత్తును''. (21-24).

శ్రుత్వా హనుమతో వాక్యం జాంబవానిదమబ్రవీత్,
దృష్ట్వైవాగచ్ఛ భద్రం తే జీవంతీం జానకీం శుభామ్. 25

పశ్చాద్రామేణ సహితో దర్శయిష్యసి పౌరుషమ్,
కల్యాణం భవతాద్భద్ర గచ్ఛతస్తే విహాయసా. 26

గచ్ఛంతం రామకార్యార్థం వాయుస్త్వామనుగచ్ఛతు,
ఇత్యాశీర్భిః సమామంత్ర్య విసృష్టః ప్లవగాధిపైః. 27

ఈ మాటలు విని జాంబవంతుడు ఇట్లనెను ''నాయనా! నీకు శుభమగుగాక! జీవించియున్న శుభలక్షణ జానకిని చూచిరమ్ము. తరువాత రామ సహితుడవై పరాక్రమము పౌరుషము చూపింతువు గాని! శుభమగుగాక! ఆకాశమున పోవునపుడు నీకు భద్రమగు గాక! రామకార్యార్థమై పోవు నిన్ను వాయుదేవుడు అనుసరించుగాక!''.

మహేంద్రాద్రిశిరో గత్వా బభూవాద్భుతదర్శనః ॥ 28

స హి నగేంద్రప్రతిమో మహాత్మా
సువర్ణవర్ణోఽరుణచారువక్త్రః ।
మహాఫణీంద్రాభసుదీర్ఘబాహు-
ర్వాతాత్మజోఽదృశ్యత సర్వభూతైః ॥ 29

ఈ విధముగా ఆశీస్సులతో బాగుగా అభినందింప బడి, వానరవీరులచే పంపబడి, మహేంద్రగిరి చేరి అద్భుత దర్శనుడైనాడు హనుమ. మహాత్ముడగు ఆంజనేయుడు మహాపర్వతమువలె విశాలకాయుడై, బంగారు వన్నెకలవాడై, ఎర్రని ముఖము కలవాడై, పెనుబాములవంటి సుదీర్ఘ బాహువులు కలవాడై వాయునందనుడు సర్వ భూతములకు అగుపించెను (25-29).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో కిష్కింధాకాండ నవమ సర్గము ॥ 9 ॥

----****----

సమాప్తమిదం కిష్కింధాకాండమ్



హనుమంతుడు మైనాకుని స్నేహపూర్వకముగా స్పృశించుట

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

అధ్యాత్మ రామాయణము

సుందరకాండము

ప్రథమ సర్గము

హనుమంతుడు సముద్రమును లంఘించుట - లంకలో ప్రవేశించుట

శ్రీమహాదేవ ఉవాచ

శతయోజనవిస్తీర్ణం సముద్రం మకరాలయమ్,
లిలంఘయిషురానందసందోహో మారుతాత్మజః. 1

ధ్యాత్వా రామం పరాత్మానమిదం వచనమబ్రవీత్,
పశ్యంతు వానరాః సర్వే గచ్ఛన్తం మాం విహాయసా . 2

అమోఘం రామనిర్ముక్తం మహాబాణమివాఖిలాః,
పశ్యామ్యద్యైవ రామస్య పత్నీం జనకనందినీమ్. 3

కృతార్థోఽహం కృతార్థోఽహం పునఃపశ్యామి రాఘవమ్

ప్రాణప్రయాణసమయే యస్య నామ సకృత్స్మరన్. 4

నరస్తీర్త్వా భవామ్భోధిమపారం యాతి తత్పదమ్,
కిం పునస్తస్య దూతోఽహం తదంగాంగులిముద్రికః. 5

తమేవ హృదయే ధ్యాత్వా లంఘయామ్యల్పవారిధిమ్,
ఇత్యుక్త్వా హనుమాన్బాహూ ప్రసార్యాయతవాలధిః. 6

ఋజుగ్రీవోర్ధ్వదృష్టిః సన్నాకుంచితపదద్వయః,
దక్షిణాభిముఖస్తూర్ణం పుప్లువేఽనిలవిక్రమః. 7

శ్రీమహాదేవుడిట్లనెను - ఓ పార్వతీ! ఆనంద సందోహము మూర్తీభవించిన మారుతాత్మజుడు ఆంజనేయుడు శతయోజన విస్తీర్ణమై, మొసళ్ల వంటి జలచరముల నిలయమైన సముద్రమును లంఘించుట కుద్యమించి, పరాత్పరుడగు రామచంద్రుని స్మరించి ఈ మాట చెప్పెను - ''ఎవరిచేతను ఎదిరింప శక్యము కాని శ్రీరామనిర్ముక్తమగు మహాబాణమువలె, ఆకాశమున సాగిపోయెడి నన్ను అందరు వానరవీరులు చూచెదరు గాక! జనకుని కుమార్తె శ్రీరామచంద్రుని పత్నియగు సీతను నేనిప్పుడే చూచెదను! నేను కృతార్థుడను, కృతార్థుడను. రాఘవుని తిరిగి చూచెదను. ప్రాణములు విడచు సమయమున ఏ మహానుభావుని నామము ఒక్కసారి తలచి, నరుడు సంసారసముద్రము దాటి, అతని పదమునే చేరునో, అట్టి రాముని దూతను, ఆ స్వామి వ్రేలిముద్రికను పొందినవాడను, నా మాట వేరుగా చెప్పవలెనా! అతనినే హృదయమున ధ్యానించి, ఈ అల్పమగు సముద్రము నిట్లే దాటివేసెదను'' ఇట్లు చెప్పి హనుమంతుడు బాహువులను పొడవుగా చాచి, వాలమును విస్తరించి, మెడను నిటారుగా నిలిపి దృష్టిని ఎగువనె నిలిపి, పాదముల జంటను సంకోచించి, దక్షిణాభిముఖుడై, వాయువేగముతో లంఘించెను (1-7).

హనుమంతుడు సురస ముఖమున ప్రవేశించి బయలు వెడలుట

ఆకాశాత్త్వరితం దేవైర్వీక్ష్యమాణో జగామ సః,
దృష్ట్వానిలసుతం దేవా గచ్ఛంతం వాయువేగతః. 8

పరీక్షణార్థం సత్త్వస్య వానరస్యేదమబ్రువన్,
గచ్ఛత్యేష మహాసత్త్వో వానరో వాయువిక్రమః. 9

లంకాం ప్రవేష్టుం శక్తో వా న వా జానీమహే బలమ్,
ఏవం విచార్య నాగానాం మాతరం సురసాభిధామ్. 10

అబ్రవీద్దేవతావృన్దః కౌతూహలసమన్వితః,
గచ్ఛ త్వం వానరేంద్రస్య కించిద్విఘ్నం సమాచర. 11

జ్ఞాత్వా తస్య బలం బుద్ధిం పునరేహి త్వరాన్వితా,
ఇత్యుక్తా సా యయౌ శీఘ్రం హనుమద్విఘ్నకారణాత్.
12

ఆవృత్య మార్గం పురతః స్థిత్వా వానర మబ్రవీత్,
ఏహి మే వదనం శీఘ్రం ప్రవిశస్వ మహామతే. 13

దేవైస్త్వం కల్పితో భక్ష్యః క్షుధాసంపీడితాత్మనః,
తామాహ హనుమాన్మాతరహం రామస్య శాసనాత్.14

గచ్ఛామి జానకీం ద్రష్టుం పునరాగమ్య సత్వరః,
రామాయ కుశలం తస్యాః కథయిత్వా త్వదాననమ్. 15

నివేక్ష్యే దేహి మే మార్గం సురసాయై నమోఽస్తు తే,
ఇత్యుక్త్వా పునరేవాహ సురసా క్షుధితాస్మ్యహమ్. 16

ప్రవిశ్య గచ్ఛ మే వక్త్రం నో చేత్త్వాం భక్షయామ్యహమ్,
ఇత్యుక్తో హనుమానాహ ముఖం శీఘ్రం విదారయ. 17

ప్రవిశ్య వదనం తేఽద్య గచ్ఛామి త్వరయాన్వితః,
ఇత్యుక్త్వా యోజనాయామదేహో భూత్వా పురః స్థితః.
18

దృష్ట్వా హనూమతో రూపం సురసా పంచయోజనమ్,
ముఖం చకార హనుమాన్ ద్విగుణం రూపమాదధత్.19

తతశ్చకార సురసా యోజనానాం చ వింశతిమ్,
వక్త్రం చకార హనుమాంస్త్రింశద్యోజనసమ్మితమ్. 20

ఆకాశమున దేవతలు పరికించి చూచుచుండగనే అతడు అతివేగముగా వెళ్లెను. వాయువేగముగా వెడలుచున్న పవనసుతుని చూచి, ఆ వానరుని బలమును పరీక్షింప దలచి, దేవతలు ఇట్లు అనుకొనిరి – ''గొప్ప బలశాలి, వాయువేగము కల ఈ వానరుడు వెడలుచున్నాడు. ఇతడు లంక ప్రవేశింప శక్తుడగునా కాదా! అతని బలమును తెలిసికొందుము గాక!'' ఇట్లు కుతూహలము నిండిన దేవతాగణము విచారించి సురస పేరుగలిగిన నాగమాతతో, ఇట్లనెను – ''వెడలుము! నీవు కపివీరునికి కొంచెము విఘ్నము కలిగించుము. అతని బలమును, బుద్ధిని తెలిసికొని అతివేగమున తిరిగిరమ్ము''. ఇటుల చెప్పబడి ఆమె శీఘ్రముగా హనుమకు విఘ్నము కలిగింప వెళ్లెను (8–12). ఆమె ఎదురుగా నిలిచి, మార్గమును అవరించి, వానర వీరునితో యిట్లనెను – ''రమ్ము! మహామతీ! నా నోటిలోనికి వేగమే ప్రవేశింపుము. ఆకలితో పీడితురాలనగు నాకు దేవతలచే భక్ష్యముగా నీవు కల్పింపబడినావు''. హనుమంతు డామెకు ఇట్లు చెప్పెను – ''తల్లీ! శ్రీరాముని శాసనమున జానకిని చూచుటకు పోవుచుంటిని. వేగమే తిరిగివచ్చి ఆమె క్షేమవార్తను రామునికి తెలిపి నీ నోట ప్రవేశింతును. నాకు దారి వదలుము. సురసవగు నీకు నమస్కారము''. ఇట్లు చెప్పబడి సురస మరల ఇట్లనెను – ''నేను ఆకలితో నుంటిని! ముందు నా నోటిలోనికి ప్రవేశింపుము. పోవుట అనుమాట తర్వాత చెప్పుము. అటుల కానిచో నిన్ను తినివేసెదను''. ఇటుల పలుకబడి హనుమ ఇట్లనెను – ''వేగముగా నీ నోటిని తెరవుము. నీ నోట ప్రవేశించి, వెంటనే బయటపడి నేను ఇపుడే పోయెదను'' అని చెప్పి యోజనము విస్తృతి గల దేహము ధరించి ముందు నిలిచెను (13–18).

హనుమంతుని రూపమును చూచి, సురస ఐదు యోజనముల వెడల్పుగా నోరు తెరచెను. హనుమంతుడు రెట్టింపు రూపము ధరించెను (19). అంతట సురస ఇరవై యోజనములుగా నోటిని తెరచెను. హనుమంతుడు ముప్పది యోజనములు పెరిగెను (20).

తతశ్చకార సురసా పంచాశద్యోజనాయతమ్,
వక్త్రం తదా హనూమాంస్తు బభూవాంగుష్ఠసన్నిభః. 21

ప్రవిశ్య వదనం తస్యాః పునరేత్య పురః స్థితః,
ప్రవిష్టో నిర్గతోఽహం తే వదనం దేవి తే నమః. 22

ఏవం వదన్తం దృష్ట్వా సా హనూమన్తమథాబ్రవీత్,
గచ్ఛ సాధయ రామస్య కార్యం బుద్ధిమతాం వర. 23

దేవైః సమ్ప్రేషితాఽహం తే బలం జిజ్ఞాసుభిః కపే,
దృష్ట్వా సీతాం పునర్గత్వా రామం ద్రక్ష్యసి గచ్ఛ భోః. 24

ఇత్యుక్త్వా సా యయౌ దేవలోకం వాయుసుతః పునః,
జగామ వాయుమార్గేణ గరుత్మానివ పక్షిరాట్. 25

సముద్రోఽప్యాహ మైనాకం మణికాంచనపర్వతమ్,
గచ్ఛత్యేష మహాసత్త్వో హనూమాన్మారుతాత్మజః 26

రామస్య కార్యసిద్ధ్యర్థం తస్య త్వం సచివో భవ,
సగరైర్వర్ధితో యస్మాత్పురాఽహం సాగరోఽభవమ్.
27

తస్యాన్వయే బభూవాసౌ రామో దాశరథిః ప్రభుః,
తస్య కార్యార్థసిద్ధ్యర్థం గచ్ఛత్యేష మహాకపిః. 28

త్వముత్తిష్ఠ జలాత్తూర్ణం త్వయి విశ్రమ్య గచ్ఛతు,
స తథేతి ప్రాదురభూజ్జలమధ్యాన్మహోన్నతః. 29

నానామణిమయైః శృంగైస్తస్యోపరి నరాకృతిః,
ప్రాహ యాన్తం హనూమన్తం మైనాకోఽహం మహాకపే
30

సురస ఏబది యోజనముల విస్తీర్ణముగా నోటిని తెరువగా, హనుమంతుడు అంగుష్ఠ మాత్రుడుగా మారిపోయెను (21). అతడు ఆమె నోటిలోనికి ప్రవేశించి, వేగిరముగా బయటికి వచ్చి, ముందు నిలిచి, ''నీ వదనమున ప్రవేశించితిని! నిర్గమించితిని! దేవీ! నీకు నమస్కారము''. ఇటుల చెప్పుచున్న హనుమను చూచి ఆమె ఇట్లు చెప్పెను -''పోయిరమ్ము! (22) బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా! రామకార్యము సాధించుము (23). ఓ వానరా! నీ బలము తెలిసికొనగోరిన దేవతలచే నేను ప్రేరేపింపబడినదానను. ఓయీ! సీతను చూచి, తిరిగివెళ్లి రాముని చూచెదవు గాక ! (24). ఇట్లు చెప్పి ఆమె దేవలోకమునకు చేరెను. మరల వాయుపుత్రుడు వాయుమార్గములో పక్షిరాజగు గరుడునివలె వెళ్లెను (25). సముద్రుడు కూడ మణికాంచన పర్వతరూపుడైన మైనాకునితో ఇట్లనెను - ''వెడలువాడీతడు మహాసత్త్వుడు, వాయుసుతుడు, హనుమానుడు. రామకార్యసిద్ధికై పోవు చున్నాడు! అతనికి నీవు సహాయకుడవగుము. పూర్వ కాలము సగరచక్రవర్తిచేత వర్ధిల్లి సాగరుడనైతిని (26-27). సగరవంశమునందే ప్రభువగు దాశరథి రాముడు అవతరించినాడు. అతని కార్యార్థసిద్ధికై కపివరుడిపుడు ఏగుచున్నాడు. నీటినుండి నీవు వెంటనే బయల్పడుము. నీయందు విశ్రమించి అతడు మరల ప్రయాణించుగాక!'' అతడు 'అట్లే' యని మహోన్నతుడై జలమధ్యమునుండి ఎదురుగా కనిపించిన వాడాయెను (28-29). నానా మణిమయములైన ఆ గిరిశిఖరపై నరాకృతి దాల్చి నిలిచి, మైనాకుడు ఆకసమున తనను దాటిపోవనున్న హనుమతో ఇట్లనెను - ''కపివరా! నేను మైనాకుడను. మారుతీ! నీకు విశ్రాంతి కల్పించుటకై సముద్రునిచే ఆజ్ఞాపింపబడితిని. రా! రమ్ము! అమృతమయములగు నా పక్వఫలములు ఆరగించి,

సముద్రేణ సమాదిష్టస్త్వద్విశ్రామాయ మారుతే,
అగచ్ఛామృతకల్పాని జగ్ధ్వా పక్వఫలాని మే. 31

విశ్రమ్యాత్ర క్షణం పశ్చాద్గమిష్యసి యథాసుఖమ్,
ఏవముక్తోఽథ తం ప్రాహ హనూమాన్మారుతాత్మజః. 32

గచ్ఛతో రామకార్యార్థం క్షణం మే కథం భవేత్,
విశ్రామో వా కథం మే స్యాద్గన్తవ్యం త్వరితం మయా. 33

ఇత్యుక్త్వా స్పృష్టశిఖరః
కరాగ్రేణ యయౌ కపిః,
కించిద్దూరం గతస్యాస్య
ఛాయాం ఛాయాగ్రహో ఽగ్రహీత్. 34

సింహికా నామ సా ఘోరా జలమధ్యే స్థితా సదా,
ఆకాశగామినాం ఛాయామాక్రమ్యాకృష్య భక్షయేత్. 35

తయా గృహీతో హనుమాంశ్చిన్తయామాస వీర్యవాన్,
కేనేదం మే కృతం వేగరోధనం విఘ్నకారిణా. 36

దృశ్యతే నైవ కో ఽప్యత్ర విస్మయో మే ప్రజాయతే,
ఏవం విచిన్త్య హనూమానధో దృష్టిం ప్రసారయత్. 37

తత్ర దృష్ట్వా మహాకాయాం సింహికాం ఘోరరూపిణీమ్,

పపాత సలిలే తూర్ణం పద్భ్యామేవాహనద్రుషా. 38

పునరుత్పత్య హనుమాన్దక్షిణాభిముఖో యయౌ,
తతో దక్షిణమాసాద్య కూలం నానాఫలద్రుమమ్. 39

నానాపక్షిమృగాకీర్ణం నానాపుష్పలతావృతమ్,
తతో దదర్శ నగరం త్రికూటాచలమూర్ధని. 40

ప్రాకారైర్బహుభిర్యుక్తం పరిఖాభిశ్చ సర్వతః,
ప్రవేక్ష్యామి కథం లంకామితి చింతాపరో ఽభవత్. 41

క్షణమిక్కడ విశ్రమించుము. తదుపరి యథాసుఖముగా వెళ్లవచ్చును''. ఇట్లు చెప్పబడి మారుతి, హనుమంతుడు ఇట్లు బదులు పలికెను (30-32).

- ''రామకార్యార్థమై పోవువానికి నాకు ఫలభక్షణమెట్లగును! విశ్రాంతియు ఎట్లు వీలగును? నేను త్వరగా వెళ్లవలసి యున్నాను!'' ఇట్లుచెప్పి (మైనాకుని ఆతిథ్యము గౌరవించిన దానికి ప్రతీకగా) వ్రేళ్లతో మైనాకుని స్పృశించి, కపివీరుడు ముందుకు సాగెను. కొంచెము ముందుకి వెళ్లిన అతని ఛాయను సింహికయనెడు ఛాయాగ్రహియగు ఘోరరక్కసి పట్టుకొనెను. అది ఎల్లపుడు జలమధ్యమందే యుండి, ఆకాశమునందు పోవుచున్నవాని ఛాయను పట్టి లాగి తినుచుండును (33-35).

వీర్యవంతు డగు హనుమ ఆమెచే పట్టుబడి ఇట్లు చింతించెను - ''విఘ్నమగునటుల నా వేగమునకు నిరోధము ఎవరిచేత కల్పించబడినది? (36). ఇక్కడ ఎవ్వరును కానరారు! నాకు ఆశ్చర్యము కలుగుచున్నది''. ఇట్లు బాగుగా యోచించి హనుమంతుడు క్రిందికి దృష్టిని ప్రసారించెను (37). ఘోరరూపిణి, అతికాయురాలు అగు సింహికను అచట చూచి, నీటిలో అతివేగముగా దూకి, రోషముతో పాదముల తోనే చంపి వేసెను (38). మరల పైకెగసి హనుమంతుడు దక్షిణాభిముఖముగా వెడలిపోయెను. అంతట నానావిధములగు ఫలవృక్షములు, నానా పక్షి మృగములచే నిండినది, నానావిధములగు పుష్పలతలు కలిగిన దక్షిణ తీరమును చేరి, అచట త్రికూట గిరిశిఖరిని, ఎన్నియో ప్రాకారములతో నిండియుండి అన్నివంకల అగడ్తలు కలిగియున్న నగరమును చూచెను. 'ఈ లంకా నగరము ఎటుల ప్రవేశించగల' నని చింతాపరుడయ్యెను (39-41). ''రావణ పాలితమగు యీ



హనుమంతుడు లంఖిణికి ముష్టిఘాతము నిచ్చుట

రాత్రౌ పేక్ష్యామి సూక్ష్మోఽహం లంకాం రావణపాలితామ్,
ఏవం విచింత్య తత్రైవ స్థిత్వా లంకాం జగామ సః. 42

లంకను సూక్ష్మ రూపముతో నేను రాత్రియే ప్రవేశించెదను''. ఈవిధముగా చింతించి అతడప్పుటనే నిలిచి, (రాత్రి యగుచుండగా) లంకలోనికి వెళ్లెను (42).

ధృత్వా సూక్ష్మం వపుర్ద్వారం ప్రవివేశ ప్రతాపవాన్,
తత్ర లంకాపురీ సాక్షాద్రాక్షసీవేషధారిణీ. 43

ప్రవిశంతం హనూమంతం దృష్ట్వా లంకా వ్యతర్జయత్,
కస్త్వం వానరరూపేణ మామనాదృత్య లంకినీమ్. 44

ప్రవిశ్య చోరవద్రాత్రౌ కిం భవాన్కర్తుమిచ్ఛతి,
ఇత్యుక్త్వా రోషతామ్రాక్షీ పాదేనాభిజఘాన తమ్. 45

ప్రతాప వంతుడగు నాతడు సూక్ష్మశరీరముదాల్చి, ద్వారమునను ప్రవేశించెను. అక్కడ సాక్షాత్తుగ రాక్షసీరూపము ధరించిన లంకాపురి, ప్రవేశించు చున్న హనుమనుచూచి బెదిరించెను. ''ఎవడవురా నీవు! వానరరూపము దాల్చి లంకిణియగు నన్ను సరకు చేయక, చోరునివలె రాత్రియందు ప్రవేశించి నీవు ఏమి చేయ నిచ్ఛగల వాడవైతివి?'' ఇట్లనుచు రోషముతో ఎఱ్ఱబడిన కన్నులు గల ఆమె హనుమంతుని పాదముతో గట్టిగాతన్నెను (43-45).

హనుమానపి తాం వామముష్టినావజ్ఞయాఽహనత్,
తదైవ పతితా భూమౌ రక్తముద్వమతీ భృశమ్. 46

ఉత్థాయ ప్రాహ సా లంకా హనూమంతం మహాబలమ్,
హనూమన్ గచ్ఛ భద్రం తే జితా లంకా త్వయాఽనఘ.
47

హనుమంతుడును, ఆమెను స్త్రీగదా యను చులకన భావముతో ఎడమచేతితో ప్రహరించెను. ఆ మాత్రమునకే వెంటనే మిక్కిలిరక్తము గ్రక్కుచు ఆమె నేలకూలెను (46). లంకిణి తిరిగి నిలచి, మహాబలుడగు హనుమంతునితో ఇట్లు చెప్పెను - ''హనుమా! వెడలుము! నీకు మంగళమగు గాక! అనఘుడా! నీచేత లంక జయించబడినది (47). ఇంతకు ముందు ఒకపుడు బ్రహ్మ నాతో చెప్పియున్నాడు. భూభార హరణార్థమై భగవంతుని బ్రహ్మ స్వయముగ ప్రార్థించగా, 'ఇరువది ఎనిమిదవ చతుర్యుగమున త్రేతాయుగమున అవ్యయుడను, నారాయణుడను అగు నేను దాశరథీ రాముడనై అవతరించగలను. యోగమాయ జనకుని ఇంట జానకిగా అవతరించును' అని చెప్పెననియు, అంతేగాక భార్యా సోదరులతో రాఘవుడు మహావనమునకు వెళ్లగలడు. మహామాయయగు సీతను అచట రావణుడు అపహరించ గలడు. ఆ తరువాత రామునకు సుగ్రీవునితో మైత్రి ఏర్పడును. సుగ్రీవుడు జానకిని వెదకుటకై వానరులను పంపగలడు! అంతట వారిలో నొక వానరుడు నీవున్న చోటికి రాత్రియందు రాగలడు. నీచేత నాతడు బెదిరించబడి

పురాహం బ్రహ్మణా ప్రోక్తా హ్యష్టావింశతిపర్యయే,
త్రేతాయుగే దాశరథీ రామో నారాయణోఽవ్యయః.
48

జనిష్యతే యోగమాయా సీతా జనకవేశ్మని,
భూభారహరణార్థాయ ప్రార్థితోఽయం మయా క్వచిత్.
49

సభార్యో రాఘవో భ్రాత్రా గమిష్యతి మహావనమ్,
తత్ర సీతాం మహామాయాం రావణోఽపహరిష్యతి.50

పశ్చాద్రామేణ సాచివ్యం సుగ్రీవస్య భవిష్యతి,
సుగ్రీవో జానకీం ద్రష్టుం వానరాన్ప్రేషయిష్యతి. 51

తత్రైకో వానరో రాత్రావాగమిష్యతి తేఽంతికమ్,
త్వయా చ భర్త్సితః సోఽపి త్వాం హనిష్యతి ముష్టినా.
52

తేనాహతా త్వం వ్యథితా భవిష్యసి యదానఘే.
తదైవ రావణస్యాంతో భవిష్యతి న సంశయః. 53

తస్మాత్త్వయా జితా లంకా జితం సర్వం త్వయానఘ.
రావణాంతఃపురవరే క్రీడాకాననముత్తమమ్. 54

తన్మధ్యేఽశోకవనికా దివ్యపాదపసంకులా.
అస్తి తస్యాం మహావృక్షః శింశపా నామ మధ్యగః. 55

తత్రాస్తే జానకీ ఘోరరాక్షసీభిః సురక్షితా.
దృష్ట్వైవ గచ్ఛ త్వరితం రాఘవాయ నివేదయ. 56

ధన్యాహమప్యద్య చిరాయ రాఘవ-
స్మృతిర్మమాసీద్భవపాశమోచనీ.
తద్భక్తసంగోఽప్యతిదుర్లభో మమ
ప్రసీదతాం దాశరథిః సదా హృది. 57

ఉల్లంఘితేఽబ్ధౌ పవనాత్మజేన
ధరాసుతాయాశ్చ దశాననస్య.
పుస్ఫోర వామాక్షి భుజశ్చ తీవ్రం
రామస్య దక్షాంగమతీంద్రియస్య. 58

ముష్టితో నిన్ను కొట్టగలడు. అతనిచే కొట్టబడి నీవు బాధను పొందగలవు. అనఘురాలా! అపుడే రావణుని వినాశము కాగలదు. నిస్సంశయము'. అనఘా! హనుమా! అందువలన నీచే లంక జయించబడినది. అంతియేనా! సర్వము జయించ బడినది. శ్రేష్ఠమగు రావణాంతఃపురములో, ఉత్తమమగు క్రీడావనములో, మధ్యలో దివ్యవృక్షములు నిండియున్న అశోకవనమున్నది. శింశుపావృక్షమొకటి ఆ వనమునకు మధ్యలో నున్నది (48–55).

ఘోరరూపులగు రాక్షస స్త్రీలచే రక్షింపబడుచు జానకి అక్కడనున్నది. ఆమెను చూచి వేగమే రాఘవునికి నివేదించుటకు పొమ్ము! (56). నేను ధన్యురాలను. చిరకాలమునకైనను నాకు ఈనాడు సంసారపాశములను వదలించెడి 'శ్రీరాముని స్మృతి' కలిగినది. అతి దుర్లభమైన అతని భక్తుల సంగము కూడ లభించినది. నా హృదయము నందు దాశరథి ఎల్లపుడు అనుగ్రహముతో నుండుగాక!'' (57).

పవన సుతునిచే సముద్రము లంఘింపబడగానే భూపుత్రి సీతకు, దశవదనుడు రావణునికి ఎడమకన్ను, ఎడమ భుజములు, అతీంద్రియుడగు రామునికి శరీరము కుడిభాగము పదేపదే తీవ్రముగా అదిరినవి (58).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
సుందరకాండ ప్రథమ సర్గము ॥1॥

---- ★★★★ ----

ఓం

ద్వితీయ సర్గము

హనుమ అశోకవాటిక చేరుట, రావణుడు సీతను భయపెట్టుట

శ్రీమహాదేవ ఉవాచ

తతో జగామ హనుమాన్ లంకాం పరమశోభనామ్,
రాత్రౌ సూక్ష్మతనుర్భూత్వా బభ్రామ పరితః పురీమ్. 1

సీతాన్వేషణకార్యార్థీ ప్రవివేశ నృపాలయమ్,
తత్ర సర్వప్రదేశేషు విచిత్య హనుమాన్కపిః. 2

నాపశ్యజ్జానకీం స్మృత్వా తతో లంకాభిభాషితమ్,
జగామ హనుమాన్ శీఘ్రమశోకవనికాం శుభామ్. 3

సురపాదపసంబాధాం రత్నసోపానవాపికామ్,
నానాపక్షిమృగాకీర్ణాం స్వర్ణప్రాసాదశోభితామ్. 4

ఫలైరానమ్రశాఖాగ్రపాదపైః పరివారితామ్,
విచిన్వన్ జానకీం తత్ర ప్రతివృక్షం మరుత్సుతః. 5

దదర్శాభ్రంలిహం తత్ర చైత్యప్రాసాదముత్తమమ్,
దృష్ట్వా విస్మయమాపన్నో మణిస్తంభశతాన్వితమ్. 6

సముల్లంఘ్య పునర్గత్వా కించిద్దూరం స మారుతిః,
దదర్శ శింశపావృక్షమత్యంతనిబిడచ్ఛదమ్. 7

అదృష్టాతపమాకీర్ణం స్వర్ణవర్ణవిహంగమమ్,
తన్మూలే రాక్షసీమధ్యే స్థితాం జనకనందినీమ్. 8

దదర్శ హనుమాన్ వీరో దేవతామివ భూతలే,
ఏకవేణీం కృశాం దీనాం మలినాంబరధారిణీమ్. 9

భూమౌ శయానాం శోచంతీంరామరామేతి భాషిణీమ్,
త్రాతారం నాధిగచ్ఛంతీముపవాసకృశాం శుభామ్. 10

శ్రీమహాదేవుడు ఇట్లనెను - ''పార్వతీ! అనంతరము పరమశోభాయమానమగు లంకాపురిలో హనుమ ప్రవేశించెను. రాత్రియందు సూక్ష్మమగు తనువుతో నగరమంతయు తిరుగాడెను (1). రావణమందిరములోనికి సీతాన్వేషణ కార్యార్థియై ప్రవేశించెను. కపివరుడు హనుమ అచట సర్వప్రదేశములు వెదకివెదకి, జానకిని చూడలేక పోయెను. అంతట లంకిణి చెప్పినమాట గుర్తునకు తెచ్చుకొని, శీఘ్రముగా, శుభంకరమై, కల్పతరువులు నిండియుండి, రత్నములు పొదిగిన మెట్లు కలిగి దిగుడు బావులతో, వివిధములగు పక్షి మృగములతో, బంగారు ప్రాసాదములతో శోభించుచు, నిండుగా ఫలములు కాచియున్నందున బాగుగా వంగియున్న వృక్షములచే చుట్టబడి, ప్రకాశించుచున్న అశోకవనమునకు హనుమ వెళ్లెను (2-4). అచ్చట ప్రతివృక్షమును జానకికై వెదకుచు, ఆ మారుతాత్మజుడు అచట నింగిని తాకుచున్నదో యన్నట్లు నిలిచిన అత్యుత్తమమగు చైత్యప్రాసాదమును (దేవాలయమును) దర్శించెను (5-6). వందలకొలది మణిమయములగు స్తంభములున్న ఆ దేవాలయము చూచి మిగుల ఆశ్చర్యము పొందెను. అది దాటిపోయి, మరల కొంతదూరము వెడలి, అచ్చట, ఎండపొడజాడ గూడ కానరీయనంత దట్టముగా ఆవరించి పెరిగినది, బంగారు వన్నెగల పక్షులు కలది యగు శింశుపావృక్షమును చూచెను. వీరుడగు హనుమంతుడు ఆ శింశుపావృక్షమున క్రింద, మూలము నాశ్రయించి భూమిని తాకుచున్న దేవతవలె, జడలు కట్టిన కేశములతో ఏకవేణియై, కృశించిపోయి, దుఃఖితయై మలినాంబరధారియై కఠినవేలపై కూర్చొని, శోకించుచు, 'రామా! రామా!' యనుచు పలుకునది, రక్షకుని ఎవరిని పొడగాననిది, ఉపవాసముతో కృశించి నప్పటికినీ శోభించుచుండెడిది అయిన తల్లి సీతను, జనక నందినిని, చూచెను (8-10).

రావణాసురుడు సీతాదేవిని బెదిరించుచుండగా హనుమంతుడు శింశుపావృక్షమునుండి చూచుట

శాఖాంతచ్ఛదమధ్యస్థో
దదర్శ కపికుంజరః,
కృతార్థోఽహం కృతార్థోఽహం
దృష్ట్వాజనకనందినీమ్. 11

మయ్యైవ సాధితం కార్యం రామస్య పరమాత్మనః,
తతః కలకిలాశబ్దో బభూవాంతఃపురాద్బహిః. 12

శింశుపా వృక్షశాఖల మధ్య ఆకులమాటున దాగి కపిశ్రేష్ఠుడు సీతను చూచెను. ''నేను కృతార్థుడ! నేనే కృతార్థుడ! జనకనందినిని చూడగల్గితిని! పరమాత్మయగు రాముని కార్యము నాచేతనే సాధింప బడినది'' అనుచు ఆనందించెను. ఇంతలో అంతఃపురము వెలుపల కిలాకిలా శబ్దము వెలువడినది (11-12).

కిమేతదితి సంల్లీనో వృక్షపత్రేషు మారుతిః,
ఆయాంతం రావణం తత్ర స్త్రీజనైః పరివారితమ్. 13

దశాస్యం వింశతిభుజం నీలాంజనచయోపమమ్,
దృష్ట్వా విస్మయమాపన్నః పత్రషండేష్వలీయత. 14

''ఇది ఏమై యుండునో'' అని మారుతి వృక్షము యొక్క ఆకుల మధ్యనే ఒదిగియుండి అచట, స్త్రీజనులతో పరివేష్టితుడై, పదిముఖములు, ఇరువది చేతులు, కాటుక కొండవంటి ఆకారముతో వచ్చుచున్న రావణుని చూచి, ఆశ్చర్యమును పొంది ఆకుల మాటున మరింత ఒదిగి పోయెను (13-14).

రావణో రాఘవేణాశు మరణం మే కథం భవేత్,
సీతార్థమపి నాయాతి రామః కిం కారణం భవేత్. 15

అట ''రామునిచేత శీఘ్రముగా నా మరణమెట్లు కలుగును? రాముడు సీతకొరకైనను ఇంతవరకు రాలేదే! కారణమేమై యుండును?'' (15). ఇటులనే చింతించుచు,

ఇత్యేవం చింతయన్నిత్యం రామమేవ సదా హృది,
తస్మిందినేఽపరరాత్రౌ రావణో రాక్షసాధిపః. 16

స్వప్నే రామేణ సందిష్టః కశ్చిదాగత్య వానరః,
కామరూపధరః సూక్ష్మో వృక్షాగ్రస్థోఽనుపశ్యతి. 17

నిత్యనిరంతరము రామునే హృదయమున నిలిపి, అనాటి అపరరాత్రి రాక్షసరాజగు రావణుడు స్వప్నములో రామునిచే పంపబడిన వానరుడొక్కరుడు కామరూపధరుడు, సూక్ష్మ రూపమున వచ్చి వృక్షాగ్రము పైనుండి సీతను చూచు చున్నటుల కనవచ్చెను (16-17). ఇటుల అద్భుతమగు స్వప్నమును చూచి తనలో తానే అతడు ఆలోచింప సాగెను- ''ఈ స్వప్నము సత్యమయి ఉండగలదు! అట్లయిన ఇపుడీ విధముగా చేయుదును. జానకిని వాగ్బాణములతో

ఇతి దృష్ట్వాద్భుతం స్వప్నం స్వాత్మన్యేవానుచింత్య సః,
స్వప్నః కదాచిత్సత్యః స్యాదేవం తత్ర కరోమ్యహమ్. 18

జానకీం వాక్శరైర్విద్ధ్వా దుఃఖితాం నితరామహమ్,
కరోమి దృష్ట్వా రామాయ నివేదయతు వానరః. 19

నేను ఎక్కువగా వేధించి దుఃఖపెట్టెదను. ఆ వచ్చిన వానరుడు ఇదిచూచి రామునకు చెప్పునట్లు చేయుదును'' (18-19).

ఇత్యేవం చింతయన్ సీతాసమీపమగమద్ద్రుతమ్,
నూపురాణాం కింకిణీనాం శ్రుత్వా శింజితమంగనా. 20

సీతా భీతా లీయమానా స్వాత్మన్యేవ సుమధ్యమా,
అధోముఖ్యశ్రునయనా స్థితా రామార్పితాంతరా. 21

ఇదియే చింతించుచు అతడు వేగముగా సీతాసమీపమునకు వచ్చి చేరెను. అంగనామణుల నూపుర కింకిణుల శింజానములు విని, సీత కడు భీతయై తల దించుకొని, కన్నుల నీరు నింపుకొని, ఎదలో తన స్వామిని చింతించుకొని, సుమధ్యమయగు నామె తన శరీరమును తాను కుచింపచేసుకొనెను (20-21).

రావణోఽపి తదా సీతామాలోక్యాహ సుమధ్యమే.
మాం దృష్ట్వా కిం వృథా సుభ్రు స్వాత్మన్యేవ విలీయసే. 22

రామో వనచరాణాం హి మధ్యే తిష్ఠతి సానుజః.
కదాచిద్దృశ్యతే కైశ్చిత్కదాచిన్నైవ దృశ్యతే. 23

మయా తు బహుధా లోకాః ప్రేషితాస్తస్య దర్శనే.
న పశ్యంతి ప్రయత్నేన వీక్షమాణాః సమంతతః. 24

కిం కరిష్యసి రామేణ నిస్పృహేణ సదా త్వయి.
త్వయా సదాలింగితోఽపి సమీపస్థోఽపి సర్వదా. 25

హృదయేఽస్య న చ స్నేహస్త్వయి రామస్య జాయతే.
త్వత్కృతాన్సర్వభోగాంశ్చ త్వద్గుణానపి రాఘవః. 26

భుంజానోఽపి నజానాతి
కృతఘ్నో నిర్గుణోఽధమః.
త్వమానీతా మయా సాధ్వి
దుఃఖశోకసమాకులా. 27

ఇదానీమపి నాయాతి భక్తిహీనః కథం వ్రజేత్.
నిస్సత్త్వో నిర్మమో మానీ మూఢః పండితమానవాన్. 28

నరాధమం త్వద్విముఖం కిం కరిష్యసి భామిని.
త్వయ్యతీవ సమాసక్తం మాం భజస్వాసురోత్తమమ్. 29

రావణుడును ఆమెను చూచి యిట్లనెను - "సుమధ్యమా! సుభ్రూవిలాసినీ! నన్నుచూచి ఎందులకు వ్యర్థముగా సిగ్గుపడెదవు! (22). [1] రాముడిపుడు తమ్మునితో వనచరుల మధ్య నిలిచియున్నాడు. ఒకప్పుడు ఎవరికైనను కానవచ్చును. ఒకపుడు ఎవరికిని కానరాడు! (23).

"అతని దర్శనమునకై నేనెందరనో పంపినాను. ఎంత ప్రయత్నించినను, ఎచ్చటనైనను అతడు ఎవ్వరికిని దర్శనమీయలేదు (24). నీ యందు ఇపుడు ఉదాసీనుడై యున్న రాముని కేమి పని! నీచే అతడు సర్వదా ఆలింగనము చేసికొనబడినను నీవెంతగా సన్నిధి యుండియున్నను, ఆ రామునికి తన హృదయములో నీయందు అభిమానము పుట్టనేలేదు. ఆ రాఘవుడు నీచేత అర్పించబడిన సర్వ భోగములను గాని, నీవు పొందియున్న సుగుణములు గాని, అనుభవించియు అతడు తెలియనివాడు. కృతఘ్నుడు, నిర్గుణుడు, అధముడు. సాధ్వీ, దుఃఖశోక సమాకుల చిత్తవు అయిన నీవు నాచే గొనిరాబడినను, ఇంతవరకు అతడు రాలేదు. భక్తిహీనుడు అతడు ఎటుల రాగలడు? నిస్సత్త్వుడు, మమతాశూన్యుడు, అభిమాని, మూఢుడు, పండితమ్మాన్యుడు (తాను పండితుడనని యనుకొను వాడు) నరాధముడు, భవద్విముఖుడు అయిన అతనితో నీకేమి! భామినీ! నీయందు అత్యంతము ఆసక్తుడనగు అసురోత్తముని నన్ను సేవింపుము (25-29).

1 23వ శ్లోకమునుండి 28వ శ్లోకమువరకు రామచంద్రుని గురించి రావణుడు చేసిన నిందాస్తుతి. రాముడు సోదరునితో వనవాసులగు తాపసులతో నున్నాడు. ధ్యానధారణాది ప్రక్రియల ద్వారా కొందరికి కనవచ్చును. కొందరికి ధ్యాన ధారణాదుల వలన కూడ కనబడక పోవచ్చును. (23) నేను అతని సాక్షాత్కారము కోరి ఎన్నోమారులు నా ఇంద్రియములు అటువంక లక్ష్యము చేసితిని. కాని ఎంత ప్రయత్నము చేసినను నాకు అతని సాక్షాత్కారము కలుగలేదు. (24) నీవు యోగమాయవు. పరబ్రహ్మమగు స్వామితో నీకు నిత్య సావాసమున్నది. తాదాత్మ్యముకూడ ఉన్నది. అయినను అతడు సర్వదా నిస్పృహుడు, అసంగుడు. ఉదాసీనుడు (25). ఆ కారణమున అతడు మాయారూపిణివగు నీచే బంధింపబడడు. అతడు నీ మాయాగుణములలో భోగములలో చిక్కుపడడు (26). సాంఖ్యమతానుసారము 'బహూన్యేనాం భుక్తభోగామజోఽన్యః' అను శ్రుతి ననుసరించి అనుభవించిన భోగములయందు లిప్తుడు కాడు. అనగా కర్తృత్వ భోక్తృత్వ అభిమానముండదు. ఈ విధముగా అతనిపై చేసిన కర్మలు అంతమగును. అతడు 'కృత+ఘ్న' చేసిన కర్మలను నాశము చేయువాడు. సత్త్వ రజస్, తమో గుణములకు అతీతుడు (న ధమతి శబ్ద విషయో భవతి) అధముడు, మాటలకందనివాడు అశబ్దుడు (27). అతనికి మాయయందు ప్రీతి లేదు. అందులకే నావంకకు రాలేదు. కావున రావణుడు తనను లక్ష్యముగా చేసి చెప్పునది ఏమనగా అతడింకను నా హృదయములోనికి వచ్చుట లేదు. భక్తిహీనుడనగుటచే నా హృదయము అతని కడకు ఎట్లు చేరును? ఆ నిర్గుణుడు, మమతా రహితుడు, అమాని, మూఢుడు (మ్ = శివః; + ఊః = బ్రహ్మా తాభ్యాం ఊఢః - ధ్యానవిషయస్థితః :- శివ బ్రహ్మలకు ధ్యేయమైనవాడు) మరియు విద్వాంసులలో సమ్మానితుడు. (28) నరాధమః (నరాః అధమాః యస్మాత్ సః నరాధమః - మానవులందరూ ఇతనికంటె అధములు. అనగా పురుషోత్తముడు. విముఖుడు (మాయా పరాఙ్ముఖుడు).

దేవగంధర్వనాగానాం యక్షకిన్నరయోషితామ్,
భవిష్యసి నియోక్త్రీ త్వం యది మాం ప్రతిపద్యసే. 30

రావణస్య వచః శ్రుత్వా సీతాఽమర్షసమన్వితా,
ఉవాచాధోముఖీ భూత్వా నిధాయ తృణమంతరే. 31

రాఘవాద్భిభ్యతా నూనం భిక్షురూపం త్వయాధృతమ్,
రహితే రాఘవాభ్యాం త్వం శునీవ హవిరధ్వరే. 32

హృతవానసి మాం నీచ! తత్ఫలం ప్రాప్స్యసేఽచిరాత్,
యదా రామశరాఘాతవిదారితవపుర్భవాన్. 33

జ్ఞాస్యసేఽమానుషం రామం గమిష్యసి యమాంతికమ్,

సముద్రం శోషయిత్వా వా శరైర్బద్ధ్వాఽథ వారిధిమ్. 34

హంతుం త్వాం సమరే రామో లక్ష్మణేన సమన్వితః,
ఆగమిష్యత్యసందేహో ద్రక్ష్యసే రాక్షసాధమ. 35

త్వాం సపుత్రం సహబలం హత్వా నేష్యతి మాం పురమ్,
శ్రుత్వా రక్షఃపతిః క్రుద్ధో జానక్యాః పరుషాక్షరమ్. 36

వాక్యం క్రోధసమావిష్టః ఖడ్గముద్యమ్య సత్వరః,
హంతుం జనకరాజస్య తనయాం తామ్రలోచనః. 37

మందోదరీ నివార్యాహ
పతిం పతిహితే రతా,
త్యజైనాం మానుషీం దీనాం
దుఃఖితాం కృపణాం కృశామ్. 38

దేవగంధర్వనాగానాం బహ్వ్యః సంతి వరాంగనాః,
త్వామేవ వరయంత్యుచ్చైర్మదమత్తవిలోచనాః. 39

నన్నే నీవు చేపట్టిన దేవ గంధర్వ నాగ యక్ష కిన్నర నారీమణులకు అందరికిని నీవే నియామకురాలవగుదువు'' (30).

రావణుని మాటలువిని, సీత క్రోధోద్రిక్తయై తలదించుకొని, వానికిని తనకు నడుమ (పతివ్రతలు పరపురుషునితో ప్రత్యక్షముగా మాటలాడకూడని కారణము వలన తప్పనిసరి అయిన పక్షమున జడవస్తువును మధ్యలో నుంచవలెనను నియమమున్న కారణమున) ఒక గడ్డిపరకను వైచి ఇట్లు సమాధానము చెప్పెను (31).

''రాముని వలన భయము నొందియే నీచే భిక్షుక రూపము ధరించబడినది. ఇది నిశ్చయము. యజ్ఞమునందు పురోడాశము కుక్క దొంగిలించినట్లు రాఘవులు ఇద్దరు నా తోడు లేని సమయమున నన్ను అపహరించినవాడవైతివి. మానవుడని నీవు పలికెడి రాముని, నీవు, అతని శరాఘాతముచే ఖండఖండములుగా నీ శరీరము చీల్చబడి నపుడు తెలిసికొందువు లెమ్ము. నాడు నీవు యముని కడకే పోగలవు. రాముడు లక్ష్మణ సహాయుడై, సముద్రమును ఇంకింపచేసి గాని, బాణములతో వారధి బంధించిగాని, నిన్ను యుద్ధములో వధించుటకు తప్పక రాగలడు. రాక్షసాధమా! ఆ సన్నివేశము నీవు చూడగలవు. నిన్ను నీ పుత్రులతో, నీ బలగముతో వధించి, నన్ను నగరమునకు తీసికొని పోగలడు'' జానకి యాడిన యీ పరుషాక్షరముల వాక్యములకు రక్షోనాథుడు రూక్షతామ్రాక్షుడై, క్రోధ సమావిష్టుడై చరాలున ఖడ్గము దూసి, జనకనందినిని వధింప సమకట్టెను (32-37).

అంతట పతి హితమునందే ఆసక్తిగల మందోదరి అతనిని వారించి ఇట్లనెను - ''నాథా! ఈ మానవకాంతను దీనురాలిని, దుఃఖితను, అసహాయకురాలిని కృశను వదలిపెట్టుడు. దేవగంధర్వ నాగ వర్గములలో ఎందరెందరో వరాంగనలు మదమత్తవిలోచనలు నిన్నే వరించి తపించు వారున్నారు'' (38-39).

తతో౾బ్రవీద్దశగ్రీవో
రాక్షసీర్వికృతాననాః,
యథా మే వశగా సీతా
భవిష్యతి సకామనా,
తథా యతధ్వం త్వరితం
తర్జనాదరణాదిభిః. 40

ద్విమాసాభ్యంతరే సీతా యది మే వశగా భవేత్,
తదా సర్వసుఖోపేతా రాజ్యం భోక్ష్యతి సా మయా. 41

యది మాసద్వయాదూర్ధ్వం మచ్ఛయ్యాం నాభినందతి,
తదా మే ప్రాతరాశాయ హత్వా కురుత మానుషీమ్. 42

ఇత్యుక్త్వా ప్రయయౌ స్త్రీభీ రావణో౾ంతఃపురాలయమ్,
రాక్షస్యో జానకీమేత్య భీషయంత్యః స్వతర్జనైః. 43

తత్రైకా జానకీమాహ యౌవనం తే వృథా గతమ్,
రావణేన సమాసాద్య సఫలం తు భవిష్యతి. 44

అపరా చాహ కోపేన కిం విలంబేన జానకి!
ఇదానీం ఛేద్యతామంగం విభజ్య చ పృథక్ పృథక్. 45

అన్యా తు ఖడ్గముద్యమ్య జానకీం హంతుముద్యతా,
అన్యా కరాలవదనా విదార్యాస్యమభీషయత్. 46

ఏవం తాం భీషయంతీస్తా రాక్షసీర్వికృతాననాః,
నివార్య త్రిజటా వృద్ధా రాక్షసీ వాక్యమబ్రవీత్. 47

శృణుధ్వం దుష్టరాక్షస్యో మద్వాక్యం వో హితం భవేత్.
48

న భీషయధ్వం రుదతీం నమస్కురుత జానకీమ్,
ఇదానీమేవ మే స్వప్నే రామః కమలలోచనః. 49

ఆరుహ్యైరావతం శుభ్రం లక్ష్మణేన సమాగతః,
దగ్ధ్వా లంకాపురీం సర్వాం హత్వా రావణమాహవే. 50

అంతట దశగ్రీవుడు వికృతాననులగు రాక్షస స్త్రీలతో ఇట్లు చెప్పెను - "మీరు ఏ విధముగా అతి తొందరలో సీత నాయందు అసక్తురాలు కాగలదో, నాకు వశము కాగలదో, ఆ విధముగా భయపెట్టిగాని, అనునయించి గాని మరి ఏ ఇతర ఉపాయముచేత గాని ప్రయత్నింపుడు! (40). రెండునెలల లోపల సీత నాకు వశమే అయినచో ఆమె నాతో సర్వసుఖముల పొంది, నా రాజ్యమును అనుభవించగలదు (41). రెండునెలలు గడచిన మీదట కూడ నా శయ్యకు తరలి రాకుండిన, ఆ వెంటనే ఈ మానవస్త్రీని నరకి వేసి, నాకు ప్రాతఃకాల భోజనముగా ఏర్పరచుడు (42)"

ఇట్లు అని తన స్త్రీలతో రావణుడు అంతఃపురము లోనికి వెడలిపోయెను. రాక్షసస్త్రీలు సీతను సమీపించి తమ బెదిరింపులతో భయపెట్ట మొదలిడిరి (43). వారిలో ఒకతె సీతకు ఇట్లు చెప్పెను - 'నీ యౌవనము వృథా యగుచున్నది. రావణుని పొందినయెడల అది సఫల మగును' (44). మరొక రాక్షసి చాల కోపముతో ఇట్లనెను - 'జానకీ! ఇంకను ఆలసించెదవేల! ఇపుడే నీ శరీరమును ఖండ ఖండములుగా ఒక్కొక్కరము చీల్చగలము! (45)'. మరొకతె కత్తి దూసి జానకిని చంప సిద్ధపడెను. భయంకర మగు ముఖము గల మరియొక రాక్షసి నోరు వెడల్పుగా తెరచి భయపెట్టెను (46).

ఈవిధముగా సీతను భయపెట్టుచున్న వికృత ముఖములు గల రాక్షస స్త్రీలను వారించి త్రిజట యను వృద్ధరాక్షసి ఇట్లు చెప్పెను - "దుష్టరాక్షస స్త్రీగణము లారా! వినుడు! నా మాట మీకందరకు హితము కాగలదు (47-48). రోదించెడు ఈమెను భయపెట్టవలదు. ఈ జానకికి నమస్కరింపుడు. ఇపుడిపుడే నా స్వప్నములో కమలలోచనుడగు రాముడు లక్ష్మణునితో కలసి, తెల్లని ఐరావతమును ఎక్కి వచ్చినట్లు, మొత్తము లంకాపురి దహించి, రావణుని యుద్ధమున వధించి, జానకిని తన అంకమందు కూర్చుండబెట్టుకొని పర్వతాగ్రమున ఉన్నాడని

ఆలోక్య జానకీం స్వాంకే స్థితో దృష్టోఽగమూర్ధని,
రావణో గోమయహ్రదే తైలాభ్యక్తో దిగంబరః. 51

అగాహత్పుత్రపౌత్రైశ్చ కృత్వా వదనమాలికామ్,
విభీషణస్తు రామస్య సన్నిధౌ హృష్టమానసః. 52

సేవాం కరోతి రామస్య పాదయో ర్భక్తిసంయుతః,
సర్వథా రావణం రామో హత్వా సకులమంజసా. 53

విభీషణాయాధిపత్యం దత్త్వా సీతాం శుభాననామ్,
అంకే నిధాయ స్వపురీం గమిష్యతి న సంశయః. 54

త్రిజటాయా వచః శ్రుత్వా భీతాస్తా రాక్షసస్త్రియః,
తూష్ణీమాసంస్తత్ర తత్ర నిద్రావశముపాగతాః. 55

తర్జితా రాక్షసీభిః సా సీతా భీతాఽతివిహ్వలా,
త్రాతారం నాధిగచ్ఛంతీ దుఃఖేన పరిమూర్ఛితా. 56

అశ్రుభిః పూర్ణనయనా చింతయంతీదమబ్రవీత్,

ప్రభాతే భక్షయిష్యంతి రాక్షస్యో మాం న సంశయః,
ఇదానీమేవ మరణం కేనోపాయేన మే భవేత్. 57

ఏవం సుదుఃఖేన పరిప్లుతా సా
విముక్తకంఠం రుదతీ చిరాయ,
ఆలంబ్య శాఖాం కృతనిశ్చయా మృతా
న జానతీ కంచిదుపాయమంగనా. 58

చూచితిని. రావణుడు తైలము ఒడలినిండ పులిమికొని, దిగంబరుడై, పుత్రపౌత్రులతో కపాలమాలికలు ధరించి, గోమయము నిండిన హ్రదములో మునకలు వేయుచున్నట్లు, విభీషణుడు రాముని సన్నిధియందు అత్యంతానందమనస్కుడై, రామపాదములయందు భక్తికలవాడై రాముని సేవ చేయుచున్నట్లును చూచితిని. ఎన్నివిధముల చూచినను, రాముడు రావణుని అవలీలగా అతని వంశమును కూడ నాశము చేసివైచి, లంకాధిపత్యము విభీషణునకు ఇచ్చి, శుభదర్శనయగు సీతను అంకము నందుంచికొని తన నగరమునకు చేరగలడు. ఇది నిస్సంశయము (49-54)''.

త్రిజట మాటలువిని ఆ రాక్షసస్త్రీలు భీతులై, ఒక్కుమ్మడి ఉదాసీనులైరి. అందందు నిద్రావశులై పడిరి (55). రాక్షస స్త్రీలచే బెదిరించబడి, భీతిచెంది, విహ్వలదశ పొంది రక్షించువారి దిక్కులేక, దుఃఖముతో కలత చెంది, కన్నుల నీరునిండ సీత చింతించుచు ఇట్లనెను - ''నిస్సంశయము. తెల్లవారగనే రాక్షస స్త్రీలు నన్ను తప్పక తినివేయుదురు. ఈ క్షణమున నాకు ఏ ఉపాయము చేత మరణము సిద్ధించగలదు?'' (56-57).

ఈ విధముగా అత్యంత దుఃఖముతో, శింశుపా శాఖను ఆలంబనగా పట్టుకొని, మరణింప నిశ్చయించుకొని అందులకు వేరు ఉపాయము కానరాక, అబలయగు ఆ సీత చాలసేపటివరకు ఎలుగెత్తి ఏడ్చుచునే యుండెను (58)''.

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో సుందరకాండ ద్వితీయ సర్గము ॥2॥

---- ★★★★ ----

ఓం

తృతీయ సర్గము

సీతా హనుమ సంభాషణ, అశోకవన ధ్వంసము - బ్రహ్మపాశ బంధము

శ్రీమహాదేవ ఉవాచ

ఉద్బంధనేన వా మోక్ష్యే శరీరం రాఘవం వినా,
జీవితేన ఫలం కిం స్యాన్మమ రక్షోఽధిమధ్యతః. 1

దీర్ఘా వేణీ మమాత్యర్థముద్బంధాయ భవిష్యతి,
ఏవం నిశ్చితబుద్ధిం తాం మరణాయాథ జానకీమ్. 2

విలోక్య హనుమాన్కించిద్విచార్యైతదభాషత,
శనైః శనైః సూక్ష్మరూపో జానక్యాః శ్రోత్రగం వచః. 3

ఇక్ష్వాకువంశసంభూతో రాజా దశరథో మహాన్,
అయోధ్యాధిపతిస్తస్య చత్వారో లోకవిశ్రుతాః. 4

పుత్రా దేవసమాః సర్వే లక్షణైరుపలక్షితాః,
రామశ్చ లక్ష్మణశ్చైవ భరతశ్చైవ శత్రుహా. 5

జ్యేష్ఠో రామః పితుర్వాక్యాద్దండకారణ్యమాగతః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా భార్యయా సహ. 6

ఉవాస గౌతమీతీరే పంచవట్యాం మహామనాః,
తత్ర సీతా మహాభాగా సీతా జనకనందినీ. 7

రహితే రామచంద్రేణ రావణేన దురాత్మనా,
తతో రామోఽతిదుఃఖార్తో మార్గమాణోఽథ జానకీమ్. 8

జటాయుషం పక్షిరాజమపశ్యత్పతితం భువి,
తస్మై దత్త్వా దివం శీఘ్రమృష్యమూకముపాగమత్. 9

సుగ్రీవేణ కృతా మైత్రీ రామస్య విదితాత్మనః,
తద్భార్యాపహారిణం హత్వా వాలినం రఘునందనః. 10

రాజ్యేఽభిషిచ్య సుగ్రీవం మిత్రకార్యం చకార సః,
సుగ్రీవస్తు సమానాయ్య వానరాన్వానరప్రభుః. 11

ప్రేషయామాస పరితో వానరాన్పరిమార్గణే,
సీతాయాస్తత్ర చైకోఽహం సుగ్రీవసచివో హరిః. 12

శ్రీమహాదేవుడు ఇట్లనెను-'పార్వతీ! ఆ విధముగా సీతాదేవి రోదించుచు ఇట్లు తలచెను - ''ఉరి వేసుకొని యైనను శరీరత్యాగము చేయుదును. అటు నా స్వామి రాఘవుడు నా వంక లేక, ఇట రాక్షసస్త్రీల మధ్య నుండిన నా మనుగడకు ఏమి ఫలము? (1) ఈ దీర్ఘమగు కేశపాశము నేను ఉరి వేసికొనుటకై అత్యంతము ఉపయోగి యగు గాక!'' ఈ విధముగా కేశపాశముతో ఉరికి సిద్ధమగుచున్న జానకిని (2) చూచి, హనుమ కొంచెము ఆలోచించి సూక్ష్మ రూపమున ఉండియే మెల్లమెల్లగా జానకి చెవి చేరునట్లుగ మాటలు పలుకసాగెను (3) - ''ఇక్ష్వాకువంశమునందు మహానుభావుడగు దశరథుడను రాజు జన్మించెను. ఆయన అయోధ్యాపతి. ఆతనికి లోకప్రసిద్ధులగు నలుగురు పుత్రులు. వారు దైవసములు. అందరు సల్లక్షణ లక్షితులు. వారు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు (4-5). వారిలో పెద్దవాడగు రాముడు పితృవాక్యమునకై భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో దండకారణ్యమునకు వచ్చెను (6). గౌతమీ తీరములో మహామనస్వినులు వారు పంచవటీకుటిలో నివసించిరి. శ్రీరామచంద్రుడు అక్కడ లేనపుడు మహాభాగ యగు జనకనందిని సీత దురాత్ముడగు రావణునిచే అపహరింపబడినది. అంతట రాముడు అతి దుఃఖార్తుడై జానకిని అన్వేషించుచున్నవాడై (7-8), నేలకూలియున్న జటాయువను పక్షిరాజును చూచెను. వానికి అతడు మోక్ష మిచ్చి శీఘ్రముగా ఋష్యమూకమునకు వచ్చి చేరెను (9). విదితాత్ముడు (స్వాత్మదర్శి) రామునికి సుగ్రీవునికి మైత్రి ఘటింపబడినది. సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని రఘునందనుడు వధించి, సుగ్రీవునికి వానరరాజ్యాభిషేకము చేసి, మిత్రునకు ఇచ్చిన మాట నిలబెట్టుకొనెను. వానర ప్రభువగు సుగ్రీవుడు తనవారగు వానరులను ఆహ్వానించి, సమాయత్తపరచి సమస్తదిశలకు సీతాపరిమార్గణమునకై వానర నాయకులను పంపివేసెను. నేను ఒక్కడను సుగ్రీవుని మంత్రిని, వానరుడను, సంపాతి మాటబలముతో, శీఘ్రముగా శతయోజన విస్తీర్ణముగల సముద్రమును

సంపాతివచనాచ్ఛ్రీఘ్రముల్లంఘ్య శతయోజనమ్,
సముద్రం నగరీం లంకాం విచిన్వన్ జానకీంశుభామ్.
13

శనైరశోకవనికాం విచిన్వన్ శింశపాతరుమ్,
అద్రాక్షం జానకీమత్ర శోచంతీం దుఃఖసంప్లుతామ్. 14

రామస్య మహిషీం దేవీం కృతకృత్యోఽహమాగతః,
ఇత్యుక్త్వోపరరామాథ మారుతిర్బుద్ధిమత్తరః. 15

సీతా క్రమేణ తత్సర్వం శ్రుత్వా విస్మయమాయయౌ,
కిమిదం మే శ్రుతం వ్యోమ్ని వాయునా సముదీరితమ్.
16

స్వప్నో వా మే మనోభ్రాంతిర్యది వా సత్యమేవ తత్,
నిద్రా మే నాస్తి దుఃఖేన జానామ్యేతత్కుతో భ్రమః. 17

యేన మే కర్ణపీయూషం వచనం సముదీరితమ్,
స దృశ్యతాం మహాభాగః ప్రియవాదీ మమాగ్రతః. 18

శ్రుత్వా తజ్జానకీవాక్యం హనుమాన్వృక్షషండతః,
అవతీర్య శనైః సీతాపురతః సమవస్థితః. 19

కలవింకప్రమాణాంగో రక్తాస్యః పీతవానరః,
ననామ శనకైః సీతాం ప్రాంజలిః పురతః స్థితః. 20

దృష్ట్వా తం జానకీ భీతా రావణోఽయముపాగతః,
మాం మోహయితుమాయాతో
మాయయా వానరాకృతిః. 21

ఇత్యేవం చింతయిత్వా సా తూష్ణీమాసీదధోముఖీ,
పునరప్యాహ తాం సీతాం దేవి యత్త్వం విశంకసే. 22

నాహం తథావిధో మాత-
స్త్యజ శంకాం మయి స్థితామ్,
దాసోఽహం కోసలేంద్రస్య
రామస్య పరమాత్మనః. 23

సచివోఽహం హరీంద్రస్య సుగ్రీవస్య శుభప్రదే,
వాయోః పుత్రోఽహమఖిలప్రాణభూతస్య శోభనే. 24

గెంతివైచి, లంకా నగరమందు శుభంకరియగు జానకిని అన్వేషించుచు క్రమముగా శింశుపాతరువుండితమగు అశోకవనమున వెదకుచు, అచట దుఃఖసముద్రమగ్నయై శోకించుచు నిలచియున్న రామమహిషిని (పత్నిని), దేవిని, జానకిని చూచితిని. ఇటకు చేరి నేను కృతకృత్యుడనైతిని''. ఇట్లు పలికి అత్యంతము బుద్ధిశాలియగు మారుతి, విరమించెను (10-15).

సీత క్రమముగా నివియన్నియు విని ఆశ్చర్య పడెను. ''ఏమి నేను విన్నది ఆకాశమునుండి వాయుదేవుని పలుకులా? ఇది స్వప్నమా? మనోభ్రాంతియా? ఇది అంతయు వాస్తవమే! ఏలయన దుఃఖముతో నున్న నాకు నిద్ర లేనేలేదు. నా చెవికి అమృతము చిలకరించు పలుకులు బాగుగా పలుకబడినవి కనుక వినుచున్నాను. భ్రమయును కాదు. ఇట్టి మాటలు పలికిన అతడు మహాభాగ్యశాలి, ప్రియవాది నా ఎదురుగా దర్శనమిచ్చుగాక!'' (17-18).

జానకి పలికిన ఆ పలుకులు విని హనుమంతుడు ఆకుల గుంపు నుండి, నెమ్మదిగా దిగి, సీతముందు చేరి నిలచెను (19). ఊరపిచ్చుకవంటి పరిమాణముకల దేహముతో, ఎర్రని ముఖముకలవాడు, పట్టు వస్త్రము ధరించినవాడు, అతడు సీతకు వినయముగా నమస్కరించి చేతులు జోడించి కట్టెదుట నిలచియుండెను (20).

అతనిని చూచి జానకి రావణుడు మరల వచ్చెనేమో యని భయపడెను. ''నన్ను మోహపరచుటకు మాయతో వానరాకారముతో వచ్చెనేమో'' (21), అని చింతించుచు తలదించుకొని ఉదాసీనభావముతో నుండెను. అతడు మరల సీతకు ఇట్లు చెప్పెను - ''దేవీ! నీవు ఏది శంకించుచుంటివో నేను అటువంటివాడను కాను (రావణుడను కాదు). నాయందు నీకు గల శంకను వీడుము తల్లీ! నేను పరమాత్ముడు కోసలేంద్రుడగు రామునికి దాసుడను (22-23). హరీంద్రుడగు సుగ్రీవునికి మంత్రిని; శుభప్రదా! శోభనా! అఖిలలోకములకు ప్రాణభూతుడగు వాయువునకు పుత్రుడను'' (24).



రాముడిచ్చిన ముద్రికను హనుమంతుడు సీతకిచ్చుట

తచ్ఛ్రుత్వా జానకీ ప్రాహ హనూమంతంకృతాంజలిమ్.
వానరాణాం మనుష్యాణాం సంగతిర్ఘటతే కథమ్. 25

యథా త్వం రామచంద్రస్య దాసోఽహమితి భాషసే.
తామాహ మారుతిః ప్రీతో జానకీం పురతః స్థితః. 26

ఋష్యమూకమగాద్రామః శబర్యా నోదితః సుధీః.
సుగ్రీవో ఋష్యమూకస్థో దృష్టవాన్ రామలక్ష్మణౌ. 27

భీతో మాం ప్రేషయామాస జ్ఞాతుం రామస్యహృద్గతమ్.
బ్రహ్మచారివపుర్ధృత్వా గతోఽహం రామసన్నిధిమ్. 28

జ్ఞాత్వా రామస్య సద్భావం స్కంధోపరి నిధాయ తౌ.
నీత్వా సుగ్రీవసామీప్యం సఖ్యం చాకరవం తయోః. 29

సుగ్రీవస్య హృతా భార్యా వాలినా తం రఘూత్తమః,
జఘానైకేన బాణేన తతో రాజ్యేఽభ్యషేచయత్. 30

సుగ్రీవం వానరాణాం స ప్రేషయామాస వానరాన్.

దిగ్భ్యో మహాబలాన్వీరాన్ భవత్యాః పరిమార్గణే. 31

గచ్ఛంతం రాఘవో దృష్ట్వా మామభాషత సాదరమ్. 32

త్వయి కార్యమశేషం మే స్థితం మారుతనందన.
బ్రూహి మే కుశలం సర్వం సీతాయై లక్ష్మణస్య చ. 33

అంగులీయకమేతన్మే పరిజ్ఞానార్థముత్తమమ్.
సీతాయై దీయతాం సాధు మన్నామాక్షరముద్రితమ్. 34

ఇత్యుక్త్వా ప్రదదౌ మహ్యం కరాగ్రాదంగులీయకమ్.
ప్రయత్నేన మయానీతం దేవి! పశ్యాంగులీయకమ్. 35

ఇత్యుక్త్వా ప్రదదౌ దేవ్యై ముద్రికాం మారుతాత్మజః,
నమస్కృత్య స్థితో దూరాద్బద్ధాంజలిపుటో హరిః. 36

దృష్ట్వా సీతా ప్రముదితా రామనామాంకితాం తదా,
ముద్రికాం శిరసా ధృత్వా స్రవదానందనేత్రజా. 37

కపే మే ప్రాణదాతా త్వం బుద్ధిమానసి రాఘవే,
భక్తోఽసి ప్రియకారీ త్వం విశ్వాసోఽస్తి తవైవ హి. 38

అది విని కృతాంజలియై నిలిచియున్న హనుమతో జానకి ఇట్లు అనెను - ''వానరులకు నరులకు సాంగత్యము ఘటించుట ఎట్లు? మరి నీవు రామచంద్రదాసుడవని చెప్పుట ఎట్లు?'' అనగా విని జానకి ఎదురుగా నిలిచిన మారుతి అత్యంత సంతోషముతో ఇట్లు సమాధానమిచ్చెను (25-26).

''అమ్మా! శబరిచే నిర్దేశించబడి, ధీమంతుడగు రాముడు ఋశ్యమూకము చేరెను. ఋష్యమూకమందున్న సుగ్రీవుడు రామలక్ష్మణులను చూచెను. వారిని చూచి భయపడి, రాముని హృదయమున అభిప్రాయము తెలిసికొని రమ్మని నన్ను ప్రేరేపించెను. బ్రహ్మచారిరూపమున నేను రామసన్నిధికి చేరితిని (27-28). రాముని సద్భావము తెలిసికొని వారిని భుజములపై నుంచికొని, సుగ్రీవుని సమీపమునకు గొనిపోయి, వారికి సఖ్యమును కూడ చేయించితిని (29). వాలిచేత సుగ్రీవుని భార్య తీసికొని పోబడినది. ఆ వాలిని రాముడు ఒక్కబాణముతో వధించెను. సుగ్రీవునికి వానరరాజ్యాభిషేకము చేసెను. అతడు నీ అన్వేషణకై మహాబలులను వీరులను దశదిశల పంపించెను (30-31). వెడలుచున్న నన్ను చూచి రాఘవుడు సాదరముగా నాతో ఇట్లు చెప్పెను - ''మారుతీ నందనా! నా కార్యము సర్వము నీయందే యున్నది. నా క్షేమమును, లక్ష్మణుని క్షేమమును సీతకొరకై తెలియ చేయుము. నా నామాక్షరముల అంకితమైన ఈ అంగులీయకము భద్రముగా నా అభిజ్ఞానముగా సీతకు ఇవ్వబడు గాక! (33-34).'' ఇటుల చెప్పి అతడు వేతి వ్రేలినుండి తీసి యుంగరము నాకిచ్చెను. అతి ప్రయత్నమున అది తేబడినది! దేవీ! చూడుమీ యుంగరము! (35)''. ఇట్లు చెప్పి మారుతి సీతాదేవికి యుంగరమిచ్చెను. ఆమెకు నమస్కరించి యా వానరుడు దూరముగనే బద్ధాంజలియై నిలిచెను (36).

అంతట రామనామాంకితమగు ముద్రికను చూచి, సీత అత్యంతానందభరితురాలై, శిరమున ధరించి, కంటి వెంట ఆనంద బాష్పములు ప్రవహింప (37) - ''వానరా! నీవు నా ప్రాణదాతవు. బుద్ధిమంతుడవు. రాఘవునియందు భక్తియుతుడవు. నీవు ప్రియకరుడవు. నీయందే రాఘవునకు ప్రబల విశ్వాసమున్నది (38).

నో చేన్మత్సన్నిధిం చాన్యం పురుషం ప్రేషయేత్కథమ్.
హనూమన్దృష్టమఖిలం మమ దుఃఖాదికం త్వయా. 39

సర్వం కథయ రామాయ యథా మే జాయతే దయా.
మాసద్వయావధి ప్రాణాః స్థాస్యంతి మమ సత్తమ. 40

నాగమిష్యతి చేద్రామో భక్షయిష్యతి మాం ఖలః.
అతః శీఘ్రం కపీంద్రేణ సుగ్రీవేణ సమన్వితః. 41

వానరానీకపైః సార్థం హత్వా రావణమాహవే.
సపుత్రం సబలం రామో యది మాం మోచయేత్ప్రభుః. 42

తత్తస్య సదృశం వీర్యం వీర వర్ణయ వర్ణితమ్.
యథా మాంతారయేద్రామో హత్వాశీఘ్రందశాననమ్. 43

తథా యతస్వ హనుమన్వాచా ధర్మమవాప్నుహి.
హనూమానపి తామాహ దేవి దృష్టో యథా మయా. 44

రామః సలక్ష్మణః శీఘ్రమాగమిష్యతి సాయుధః.
సుగ్రీవేన ససైన్యేన హత్వా దశముఖం బలాత్. 45

సమానేష్యతి దేవి త్వామయోధ్యాం నాత్ర సంశయః.
తమాహ జానకీ రామః కథం వారిధిమాతతమ్. 46

తీర్త్వాయాస్యత్యమేయాత్మా వానరానీకపైః సహ.
హనూమానాహ మే స్కంధావారుహ్య పురుషర్షభౌ. 47

ఆయాస్యతః ససైన్యశ్చ సుగ్రీవో వానరేశ్వరః.
విహాయసా క్షణేనైవ తీర్త్వా వారిధిమాతతమ్. 48

నిర్దహిష్యతి రక్షౌఘాంస్త్వత్కృతే నాత్ర సంశయః.
అనుజ్ఞాం దేహి మే దేవి గచ్ఛామి త్వరయాన్వితః. 49

కాకున్నచో నావద్దకు అన్యపురుషుని రాముడు ఎటుల పంపగలడు? హనుమా! నా దుఃఖాదికము అంతయు నీచే చూడబడినది కదా! (39). నాయందు ఎటుల దయ కలుగగలదో ఆవిధముగా రామునికి అంతయు వివరింపుము. ఉత్తముడా! నా ప్రాణము కేవలము రెండు మాసముల అవధి వరకు నిలుచును (40). రాముడే ఇటకు రానియెడల నన్నా దుర్మార్గుడు భక్షించగలడు. అందువలన శీఘ్రముగా కపీంద్రుడగు సుగ్రీవునితో కూడి (41), వానరసైన్యము వెంటనిడుకొని రావణుని యుద్ధమందు సపుత్ర పరివారముగా పరిమార్చి రాముడు నన్నిటనుండి విడిపించగలిగిన (42), అది వేదములచే, ఋషులచే, బ్రాహ్మణులచే వర్ణితమైన అతని వీరత్వమునకు తగినదని ఓ మహావీరా! హనుమా! వర్ణించి చెప్పుము. ఎంత శీఘ్రముగా రావణుని వధించి నన్ను రాముడు తరింపచేయునో అట్టి విధముగా నీవు యత్నించుకొనుము. హనుమా! వాక్కుతో ఈ ధర్మమును పొందుము'' అనెను.

హనుమంతుడు కూడా ఆమెకిట్లు చెప్పెను - ''దేవీ! నేను చూచినది చూచినట్లు రామునకు వివరించెదను. అంతట రాముడు లక్ష్మణయుతుడై, సాయుధుడై సుగ్రీవునితో వానరసైన్యముతో వేగమే రాగలడు. దశముఖుని బలగముతో సహా వధించి, దేవీ! నిన్ను అయోధ్యకు గొనిపోగలడు. నిస్సంశయము''.

అపుడు జానకి ఇట్లనెను - ''రాముడు అసామాన్యుడైనను ఇంతటి సువిశాల సముద్రమును ఎటుల వానరసైన్యముతో సహా దాటిరాగలడు?'' హనుమ ఇట్లు చెప్పెను ''రాఘవ పురుషపుంగవులిద్దరు నా భుజ స్కంధములపై అధిరోహించి రాగలరు. వానరేశ్వరుడు సుగ్రీవుడు ససైన్యముగా క్షణములో ఆకాశమార్గమున విశాలసముద్రముదాటి రాగలడు (48). నీ గురించియే రక్షస్సంఘాతములను దహించివేయగలడు. ఇందు సంశయము లేదు. దేవీ! నా కనుజ్ఞ ఇమ్ము. రాముని, అతని సోదరునితో చూచుటకు త్వరగా వెళ్లవలెను (49).

ద్రష్టుం రామం సహ భ్రాత్రా త్వరయామి తవాంతికమ్
దేవి కించిదభిజ్ఞానం దేహి మే యేన రాఘవః. 50

విశ్వసేన్మాం ప్రయత్నేన తతో గంతా సముత్సుకః,
తతః కించిద్విచార్యాథ సీతా కమలలోచనా. 51

విముచ్య కేశపాశాంతే స్థితం చూడామణిం దదౌ,
అనేన విశ్వసేద్రామస్త్వాం కపీంద్ర సలక్ష్మణః. 52

అభిజ్ఞానార్థమన్యచ్చ వదామి తవ సువ్రత,
చిత్రకూటగిరౌ పూర్వమేకదా రహసి స్థితః,
మదంకే శిర ఆధాయ నిద్రాతి రఘునందనః. 53

ఐంద్రః కాకస్తదాగత్య నఖైస్తుండేన చాసకృత్,
మత్పాదాంగుష్ఠమారక్తం విదదారామిషాశయా. 54

తతో రామః ప్రబుద్ధ్యాథ దృష్ట్వా పాదం కృతవ్రణమ్,
కేన భద్రే కృతం చైతద్విప్రియం మే దురాత్మనా. 55

ఇత్యుక్త్వా పురతోఽపశ్యద్వాయసం మాం పునః పునః,
అభిద్రవంతం రక్తాక్తనఖతుండం చుకోప హ. 56

తృణమేకముపాదాయ దివ్యాస్త్రేణాభియోజ్య తత్,
చిక్షేప లీలయా రామో వాయసోపరి తజ్జ్వలత్. 57

అభ్యద్రవద్వాయసశ్చ భీతో లోకాన్ భ్రమన్పునః,
ఇంద్ర బ్రహ్మాదిభిశ్చాపి న శక్యో రక్షితుం తదా. 58

రామస్య పాదయోరగ్రేఽపతద్భీత్యా దయానిధేః,
శరణాగతమాలోక్య రామస్తమిదమబ్రవీత్. 59

అమోఘమేతదస్త్రం మే దత్త్వైకాక్షమితో వ్రజ,
సవ్యం దత్త్వా గతః కాక ఏవం పౌరుషవానపి. 60

ఉపేక్షతే కిమర్థం మామిదానీం సోఽపి రాఘవః,
హనూమానపి తామాహ శ్రుత్వా సీతానుభాషితమ్. 61

దేవి! త్వాం యది జానాతి స్థితామత్ర రఘూత్తమః,
కరిష్యతి క్షణాద్భస్మ లంకాం రాక్షసమండితామ్. 62

వారిని చూచి, నీకడకు తొందరగా వచ్చుటకు త్వరపెట్టెదను. దేవీ! రాఘవుడు నన్ను తప్పక విశ్వసించుటకై ఏదైనను ఒకటి అభిజ్ఞానమును ఈయతగును. ఇక నేను మరలిపోవ ఉత్సహింతును''.

అంతట కమలలోచన సీత కొంచెము విచారించి (50-51), తన కేశపాశమునందున్న చూడామణిని విడిపించి అతనికిచ్చెను. ''కపీంద్రా! దీనితో లక్ష్మణ యుతుడుగు రాముడు నిన్ను విశ్వసించగలడు! (52).

''సువ్రతా! గుర్తుకొరకై మరొక్కటి కూడా నీకు చెప్పెదను. ఒకనాడు పూర్వము చిత్రకూటమునందు ఏకాంతమున మేముండగా, నా అంకమందు శిరస్సు నుంచికొని రఘునందనుడు నిద్రించుచుండెను (53). అంతట ఇంద్రపుత్రుడు కాకిరూపమున వచ్చి మాంసమును నాశతో నా ఎర్రని పాదాంగుష్ఠమును గోళ్లతో, చంచువుతో పలుమారులు చీరెను (54). అంతట నిద్దుర లేచి, రాముడు నా పాదము గాయపడియుండుట చూచి, ''ప్రియా! ఏ దురాత్మునిచేత ఇట్టి అప్రియము నీకు చేయబడినది?'' ఇట్లని ముందునకు చూచి, ఆ వాయసము మరల మరల నావద్దకు రక్తసిక్తములగు గోళ్లతో చంచువుతో పరుగిడుచు వచ్చుచుండుట గాంచి క్రోధము పొందెను (55-56). ఒక గడ్డిపరకను తీసి, దివ్యాస్త్రముతో అభిమంత్రించి అవలీలగా ఆ వాయసముపై వదలెను. అది జ్వలించుచు వెంటనంటెను. ఆ వాయసము కూడ, భయముతో లోకములన్నియు మరల మరల తిరుగుచుండగా, ఇంద్ర బ్రహ్మాదులుకూడా రక్షింప శక్తులు కాలేదు (58). అతడు అంతట భీతుడై దయానిధియగు రాముని ముందు పడెను. శరణాగతుడగు వానిని చూచి రాముడు అతనితో ఇట్లనెను (59)- ''నా అస్త్రమునకు ఎదురులేదు. అందువలన ప్రతిగా ఒక కన్ను సమర్పించి పొమ్ము''. వాయసము ఎడమకన్ను ఇచ్చి వెళ్లిపోయెను. ఇంతటి పౌరుషశాలి అయి ఉండియు, నన్నిట్టివిధముగా ఎందులకు ఉపేక్ష చేయుట! అతడు రాఘవుడే (రఘువంశ ప్రతిష్ఠకు తగినట్లుండవలె గదా యని భావము)''.

సీత చెప్పిన మాటలను అనుసరించి హనుమ ఇట్లనెను - ''దేవీ! నీవు ఇక్కడ ఉంటివని రఘూత్తముడు ఎరిగియుండిన, రాక్షసులతో నిండియున్న లంకను క్షణములో భస్మము చేసి యుండెడివాడు (61-62)''.

జానకీ ప్రాహ తం వత్స కథం త్వం యోత్స్యసేఽసురైః
అతిసూక్ష్మవపుః సర్వే వానరాశ్చ భవాదృశాః. 63

శ్రుత్వా తద్వచనం దేవ్యై పూర్వరూపమదర్శయత్,
మేరుమందరసంకాశం రక్షోగణవిభీషణమ్. 64

దృష్ట్వా సీతా హనూమంతం మహాపర్వతసన్నిభమ్,
హర్షేణ మహతాఽఽవిష్టా ప్రాహ తం కపికుంజరమ్. 65

సమర్థోఽసి మహాసత్త్వ! ద్రక్ష్యంతి త్వాం మహాబలమ్,
రాక్షస్యస్తే శుభః పంథా గచ్ఛ రామాంతికం ద్రుతమ్. 66

బుభుక్షితః కపిః ప్రాహ దర్శనాత్పారణం మమ,
భవిష్యతి ఫలైః సర్వైస్తవ దృష్టౌ స్థితైర్హి మే. 67

తథేత్యుక్తః స జానక్యా భక్షయిత్వా ఫలం కపిః,
తతః ప్రస్థాపితోఽగచ్ఛజ్జానకీం ప్రణిపత్య సః,
కించిద్దూరమథో గత్వా స్వాత్మన్యేవాన్వచింతయత్. 68

కార్యార్థమాగతో దూతః స్వామికార్యావిరోధతః,
అన్యత్కించిదసమ్పాద్య గచ్ఛత్యధమ ఏవ సః. 69

అతోఽహం కించిదన్యచ్చ
కృత్వా దృష్ట్వాఽథ రావణమ్,
సంభాష్య చ తతో రామ
దర్శనార్థం వ్రజామ్యహమ్. 70

ఇతి నిశ్చిత్య మనసా వృక్షషండాన్మహాబలః,
ఉత్పాట్యాశోకవనికాం నిర్వృక్షామకరోత్ క్షణాత్. 71

సీతాశ్రయనగం త్యక్త్వా వనం శూన్యం చకార సః,
ఉత్పాటయంతం విపినం దృష్ట్వా రాక్షసయోషితః. 72

అపృచ్ఛన్ జానకీం కోఽసౌ వానరాకృతిరుద్భటః. 73

జానక్యువాచ

భవత్య ఏవ జానంతి మాయాం రాక్షసనిర్మితామ్,
నాహమేనం విజానామి దుఃఖశోకసమాకులా. 74

ఇత్యుక్తాస్త్వరితం గత్వా రాక్షస్యో భయపీడితాః,
హనూమతా కృతంసర్వంరావణాయ న్యవేదయన్. 75

అంతట జానకి అడిగెను - ''వత్సా! నీవు అతి చిన్న శరీరము కలవాడవే! ఎటుల రాక్షసులతో పోరగలవు? వానరులందరును నీ వంటివారే అగుదురు గదా!'' (63)

దేవి యాడిన మాటలు విని తన యపూర్వమగు పూర్వరూపమును, మేరుమందర సమానమును, రక్షోవీర భయదమును హనుమ చూపెను (64). మహాపర్వతము వంటి హనుమ (ఆకారము)ను చూచి సీత అత్యంత హర్షము పొంది, కపికుంజరునితో యిట్లు చెప్పెను - ''మహాసత్త్వా! నీవు సమర్థుడవు. రాక్షసులు మహాబలశాలి వగు నిన్ను చూచెదరు. మార్గంబున శుభంబయ్యెడు. రాముని సన్నిధికి వెంటనే పోయిరమ్ము!'' (65-66).

ఆకలిగొన్న కపిరాజు ఇట్లనెను - ''అమ్మా! నీ దర్శనము అయినది. రామకార్యము సిద్ధించినది. ఇక వ్రత పూర్తి చేసిన నాకు పారణము మిగిలినది. నీ కంటికి ఎదురుగానున్న ఫలములన్నియు నాకు పారణము కాగలవు'' (67) అని జానకిచే 'అటులే' యనిపించుకొని ఫలములు భుజించి కపివీరుడు మరలిపోవ బయలుదేరి, జానకికి నమస్కరించి, కొంచెము దూరము వెళ్లి తనలో తాను ఇట్లు ఆలోచించెను (68).

''కార్యార్థియై దూతగా వచ్చినవాడు, స్వామి కార్యమునకు విరోధము కలగకుండ వెడలిపోయినవాడు అధముడనిపించుకొనును (69). అందువలన వేరే ఏదో విశేషమును చేసి, రావణుని చూచి, సంభాషించి ఆ తరువాత రామదర్శనార్థమై వెళ్లెదను (70)''

ఇట్లు మనసులో నిశ్చయించుకొని క్షణ కాలములో అశోకవనమునంతయు మహాబలుడై వృక్షముల గుంపులను పెకలించివైచి, చెట్లు లేనిదానిగా చేసెను (71).

ఏ వృక్షము క్రింద సీత ఉండెనో అది తప్ప, మిగిలిన వనమును శూన్యము చేసివేసెను. వనమును నాశము చేయువానిని చూచి రాక్షసస్త్రీలు (72) జానకిని ''ఎవడితడు ! వానరాకృతి నున్న అమిత పరాక్రముడు ఎవరు?'' అని అడిగిరి (73) సీత ఇట్లనెను.

''రాక్షస నిర్మితమగు మాయ మీకే తెలియును. నేను దుఃఖసమాకులనై యుంటిని. నేనేమి తెలియుదును? (74)'' ఇట్లు చెప్పబడిన రాక్షసస్త్రీలు వడివడిగా భయపడుచు వెళ్లి హనుమంతుని చేత చేయబడినది అంతయు రావణునకు చెప్పిరి (75).

దేవ! కశ్చిన్మహాసత్త్వో వానరాకృతిదేహధృక్,
సీతయా సహ సంభాష్య హ్యశోకవనికాం క్షణాత్,
ఉత్పాట్య చైత్యప్రాసాదం బభంజామితవిక్రమః. 76

ప్రాసాదరక్షిణః సర్వాన్హత్వా తత్రైవ తస్థివాన్,
తచ్ఛ్రుత్వా తూర్ణముత్థాయ వనభంగం మహాప్రియమ్. 77

కింకరాన్ప్రేషయామాస నియుతం రాక్షసాధిపః,
నిభగ్నచైత్యప్రాసాదప్రథమాంతరసంస్థితః. 78

హనుమాన్పర్వతాకారో లోహస్తంభకృతాయుధః,
కించిల్లాంగూలచలనో రక్తాస్యో భీషణాకృతిః. 79

ఆపతంతం మహాసంఘం రాక్షసానాం దదర్శ సః,
చకార సింహనాదం చ శ్రుత్వా తే ముముహుర్భృశమ్. 80

హనూమంతమథో దృష్ట్వా రాక్షసా భీషణాకృతిమ్,
నిర్జఘ్నుర్వివిధాస్త్రౌఘైః సర్వరాక్షసఘాతినమ్. 81

తత ఉత్థాయ హనుమాన్ముద్గరేణ సమంతతః,
నిష్పిపేష క్షణాదేవ మశకానివ యూథపః. 82

నిహతాన్కింకరాన్ శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః,
పంచ సేనాపతీంస్తత్ర ప్రేషయామాస దుర్మదాన్. 83

హనూమానపి తాన్సర్వాన్ లోహస్తంభేన చాహనత్,
తతః క్రుద్ధో మంత్రిసుతాన్ప్రేషయామాస సప్త సః. 84

ఆగతానపి తాన్సర్వాన్పూర్వవద్వానరేశ్వరః,
క్షణాన్నిశ్శేషతో హత్వా లోహస్తంభేన మారుతిః. 85

పూర్వస్థానముపాశ్రిత్య ప్రతీక్షన్ రాక్షసాన్ స్థితః,
తతో జగామ బలవాన్కుమారోఽక్షః ప్రతాపవాన్. 86

తముత్పపాత హనుమాన్ దృష్ట్వాకాశే సముద్గరః,
గగనాత్త్వరితో మూర్ధ్ని ముద్గరేణ వ్యతాడయత్. 87

హత్వా తమక్షం నిశ్శేషం బలం సర్వం చకార సః. 88

తతః శ్రుత్వా కుమారస్య వధం రాక్షసపుంగవః,
క్రోధేన మహతావిష్ట ఇంద్రజేతారమబ్రవీత్. 89

''దేవా! ఎవడో మహాసత్త్వుడు వానరరూపము ధరించి, సీతతో సంభాషించి, ఆలయమంటపమును పెకలించి, క్షణములో అశోకవనమును భంజనము చేసినాడు (76). ప్రాసాదమును కావలివాయు వారలనందర చంపి అచ్చటనే యున్నాడు''. తనకు దుర్వార్తయగు వనభంగమును విని, అదరిపడి లేచి, పదిలక్షల మంది కింకరులను రాక్షసాధిపుడు పంపెను. శిథిలము చేసిన ప్రాసాదపు మొదటి ఆవరణలో నిలిచి, పర్వతాకారముతో లోహస్తంభమును ఆయుధములుగా ధరించి వాలమును కొంచెము కదలించుచు, రక్తముఖుడై, భయానక రూపముతో నిలచిన హనుమమీదికి ఎత్తివచ్చుచున్న మహారాక్షస సేనావాహినిని చూచి, సింహనాదము చేసెను. అది విని వారు ఒక్కసారిగా నిశ్చేష్టులైరి (77-80).

సర్వరాక్షస సంహారకుడైన భీషణాకృతియగు ఆంజనేయుని చూచి, రాక్షసకింకరులు వివిధములగు ఆయుధములను అతనిపై ప్రయోగించిరి. అంతట గజరాజు దోమలను నలిపివేయునట్లు, హనుమ ముద్గరాయుధుడై లేచి, క్షణములో అందరిని మట్టి కరపించెను (81-82).

కింకరులు నిహతులైరని విని, రావణుడు క్రోధావిష్టుడై, దుర్మదులగు అయిదుగురు సేనాపతులను పంపెను (83). వానరేశ్వరుడు మీదికి వచ్చుచున్న ఆ అయిదుగురిని ఇంతకు ముందువారి వలెనే క్షణములో లోహస్తంభముతో నిశ్శేషముగా వధించి (85) తన పాత స్థానమునకేపోయి, ఇంకను రాబోయెడి రాక్షసుల కొరకై ఎదురుచూచుచు కూర్చుండెను. అంతట బలశాలియగు రావణకుమారుడు, ప్రతాపవంతుడు, అక్షుడు వచ్చెను (86). అతనిని చూచి, లోహస్తంభముతో ఆకాశమున కెగిరి గగనతలము నుండియే వేగముగా దూకి శిరమును ముద్గరముతో కొట్టెను (87). ఇట్లు అక్షుని చంపి, అతని సైన్యమును నిశ్శేషము చేసివేసెను (88). రాక్షస పుంగవుడు రావణుడు కుమారుని మరణమువిని క్రోధముచేత ఉద్రిక్తుడై ఇంద్రజిత్తుతో ఇట్లు చెప్పెను (89)

పుత్ర గచ్ఛామ్యహం తత్ర యత్రాస్తే పుత్రహా రిపుః,
హత్వా తమథవా బద్ధ్వా ఆనయిష్యామి తేఽంతికమ్.

ఇంద్రజిత్పితరం ప్రాహ త్యజ శోకం మహామతే,
మయి స్థితే కిమర్థం త్వం భాషసే దుఃఖితం వచః. 91

బద్ధ్వాఽఽనేష్యే ద్రుతం తాత వానరం బ్రహ్మపాశతః,
ఇత్యుక్త్వా రథమారుహ్య రాక్షసైర్బహుభిర్వృతః. 92

జగామ వాయుపుత్రస్య సమీపం వీరవిక్రమః,
తతోఽతిగర్జితం శ్రుత్వా స్తంభముద్యమ్య వీర్యవాన్. 93

ఉత్పపాత నభోదేశం గరుత్మానివ మారుతిః,
తతో భ్రమంతం నభసి హనూమంతం శిలీముఖైః. 94

విద్ధ్వా తస్య శిరోభాగమిషుభిశ్చాష్టభిః పునః,
హృదయం పాదయుగలం షడ్భిరేకేన వాలధిమ్. 95

భేదయిత్వా తతో ఘోరం సింహనాదమథాకరోత్,
తతోఽతిహర్షాద్ధనుమాన్ స్తంభముద్యమ్య వీర్యవాన్. 96

జఘాన సారథిం సాశ్వం రథం చాచూర్ణయత్ క్షణాత్,
తతోఽన్యం రథమాదాయ మేఘనాదో మహాబలః. 97

శీఘ్రం బ్రహ్మాస్త్రమాదాయ బద్ధ్వా వానరపుంగవమ్,

నినాయ నికటం రాజ్ఞో రావణస్య మహాబలః. 98

యస్య నామ సతతం జపంతి యే-
ఽజ్ఞానకర్మకృతబంధనం క్షణాత్,
సద్య ఏవ పరిముచ్య తత్పదం
యాంతి కోటిరవిభాసురం శివమ్. 99

తస్యైవ రామస్య పదాంబుజం సదా
హృత్పద్మమధ్యే సునిధాయ మారుతిః,
సద్యైవ నిర్ముక్తసమస్తబంధనః
కిం తస్య పాశైరితరైశ్చ బంధనైః. 100

– ''కుమారా! నా పుత్రుని చంపిన శత్రువు ఉన్నచోటికి పోయెదను. నీ ఎదుటికి వానిని చంపిగాని, బంధించి గాని కొనివచ్చెదను (90)''. ఇంద్రజిత్తు ఇట్లనెను – ''మహామతీ! శోకము విడువుము. నేనింకను జీవించియే యుండగా, ఎందులకు నీవు ఇట్లు దుఃఖకరమగు మాటలాడుట? ఆ వానరుని బ్రహ్మపాశముతో కట్టి వెంటనే తీసికొని వచ్చెదను'' ఇట్లు చెప్పి, రథము నధిరోహించి, చాలమంది రాక్షసులతో పరివేష్టించబడి (92), వీరవిక్రముడు ఇంద్రజిత్తు వాయుపుత్రుని సమీపమునకు ఏగెను. అతిగా సింహనాదము చేయు ఇంద్రజిత్తును చూచి, వీర్యవంతుడగు హనుమ స్తంభమును ఎత్తి (93) గరుత్మంతునివలె ఆకాశమునకు ఎగసెను. అటుల ఆకాశమున తిరుగాడుచున్న హనుమంతుని శిరస్సుపై ఎనిమిది, హృదయమున, పాదయుగమున ఆరింటిని, వాలముపై ఒక్కటి చొప్పున వాడియగు బాణములను ప్రయోగించి (94-95), భయంకరముగా సింహనాదము చేసెను. అంతట అత్యంత హర్షముతో వీర్యవంతుడగు హనుమంతుడు స్తంభమును ఎత్తి (96) సారథిని చంపి, ఇంద్రజిత్తు రథమును గుఱ్ఱములతో సహా క్షణములో చూర్ణము చేసెను. అంతట మహాబలశాలి మేఘనాదుడు మరొక రథమునెక్కి (97), బ్రహ్మాస్త్రమును వేగముగా తీసి, వానరపుంగవుని బంధించి, రావణరాజు సమీపమునకు నడిపించెను (98).

ఏ నామమును సతతము జపించు మహానుభావులు అజ్ఞానకృత కర్మబంధనమును క్షణములో అప్పటికప్పుడే విడిపించుకొని, కోటి రవిభాసురమగు అతని పదమునకే చేరుదురో – అట్టి శ్రీరామచంద్రుని పాదపద్మములనే సదా హృత్పద్మ మధ్యమునందు బాగుగా నిలుపుకొని మారుతి అపుడే సమస్త బంధములనుండి ముక్తుడైనాడు. ఇంక ఇతర బంధనములు, పాశములు అతనిని బంధింపగలవా! (99-100).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో సుందరకాండ తృతీయ సర్గము ॥3॥

---- ★★★★ ----

ఓం

చతుర్థ సర్గము

హనుమద్రావణ సంవాదము - లంకాదహనము

శ్రీమహాదేవ ఉవాచ

యాంతం కపీంద్రం ధృతపాశబంధనం
విలోకయంతం నగరం విభీతవత్.
అతాడయన్ముష్టితలైః సుకోపనాః
పౌరాః సమన్తాదనుయాంత ఈక్షితుమ్. 1

బ్రహ్మాస్త్రమేనం క్షణమాత్రసంగమం
కృత్వా గతం బ్రహ్మవరేణ సత్వరమ్.
జ్ఞాత్వా హనూమానపి ఫల్గురజ్జుభి-
ర్ధృతో యయౌ కార్యవిశేషగౌరవాత్. 2

సభాంతరస్థస్య చ రావణస్య తం
పురో నిధాయాహ బలారిజిత్తదా.
బద్ధో మయా బ్రహ్మవరేణ వానరః
సమాగతోఽనేన హతా మహాసురాః. 3

యద్యుక్తమత్రార్య విచార్య మంత్రిభి-
ర్విధీయతామేష న లౌకికో హరిః.
తతో విలోక్యాహ స రాక్షసేశ్వరః
ప్రహస్తమగ్రే స్థితమంజనాద్రిభమ్. 4

ప్రహస్త! పృచ్ఛైనమసౌ కిమాగతః?
కిమత్ర కార్యం? కుత ఏవ వానరః?
వనం కిమర్థం సకలం వినాశితం?
హతాః కిమర్థం మమ రాక్షసా బలాత్? 5

తతః ప్రహస్తో హనుమంతమాదరాత్
పప్రచ్ఛ కేన ప్రహితోఽసి వానర.
భయం చ తే మాస్తు విమోక్ష్యసే మయా
సత్యం వదస్వాఖిలరాజసన్నిధౌ. 6

తతోఽతిహర్షాత్పవనాత్మజో రిపుం
నిరీక్ష్య లోకత్రయకంటకాసురమ్.
వక్తుం ప్రచక్రే రఘునాథసత్కథాం
క్రమేణ రామం మనసా స్మరన్ముహుః. 7

శ్రీమహాదేవుడు ఇట్లు పలికెను - ఓ పార్వతీ! బ్రహ్మపాశబద్ధుడై నగరమును పరిశీలించుచునే, భయము భయముగా నున్నట్లు నటించుచు కపీంద్రుడగు ఆంజనేయుడు, ఇంద్రజిత్తుచే తీసికొనిపోబడుచుండగా, అతని గాంచు కౌతుకముతో లంకానగర పౌరులు అతని వెనువెనుకగా నడచుచు తమ కోపమును చల్లార్చుకొనుటకై అతనిని ముష్టిఘాతములచే మర్దించుచుండిరి (1).

అతనిని బ్రహ్మాస్త్రము క్షణకాలము మాత్రమే బంధించి, బ్రహ్మవరముచేత వెంటనే విడిపోయెను. హనుమంతుడు ఇది తెలిసికొనియు తాను సాధింప బోవు కార్యగరిమను దృష్టియందుంచుకొని అల్పములైన త్రాళ్లచే బంధింపబడియే నడచెను (2).

రావణ సభాంతరమున అతనిని రావణుని ముందు నిలువబెట్టి ఇంద్రజిత్తు ఇట్లనెను ''ఈ వానరుడు బ్రహ్మ వరము(అస్త్రము)వలన నాచే బంధింపబడి తీసికొని రాబడినాడు. గొప్ప రాక్షసులు ఈతని చేత నిహతులైనారు (3). ఆర్యా! మంత్రులతో ఇపుడు తగినట్లుగా ఆలోచించి శిక్షింపుడు. ఇతడు సాధారణమగు వానరుడు మాత్రము కాడు''. అంతట హనుమను చూచి రాక్షసరాజు తన ముందే కాటుక కొండవంటి కాంతి కలిగిన ప్రహస్తునితో యిట్లనెను (4) - ''ప్రహస్తా! ఎందులకిటకు వచ్చినవాడో వీని నడుగుము. ఇక్కడ వీనికి ఏమి పని? ఇటవచ్చిన వానరుడు ఎచటివాడు? ఎందులకు వనమును నాశము చేసినాడు? నా రాక్షసులను బలవంతముగ ఎందుకు హతమార్చినాడు? (5). అంతట ప్రహస్తుడు హనుమంతుని ఆదరముగా ప్రశ్నించెను - ''వానరా! నీవు ఎవరిచేత పంపబడితివి? నీవు భయపడవలదు. నీవు నాచే విడిపింప బడగలవు. అఖిలరాజగు రావణు సన్నిధిలో సత్యమునే చెప్పికొనుము (6)''

అంతట రాముని పదేపదే మనసున స్మరించు కొనుచు, అతిహర్షముతో పవనసుతుడు లోకత్రయ కంటకు డగు రాక్షసుని, తన శత్రువును, నిరీక్షించి క్రమముగా రఘునాథుచరితమును వివరించుటకు ఉపక్రమించెను (7).

బ్రహ్మాస్త్రబద్ధుడై వచ్చిన హనుమ రావణునికి హితోపదేశమును చేయుట



శృణు స్ఫుటం దేవగణాద్యమిత్ర హే
రామస్య దూతోఽహమశేషహృత్స్థితేః,
యస్యాఖిలేశస్య హృతాధునా త్వయా
భార్యా స్వనాశాయ శునేవ సద్ధవిః. 8

"ఓయీ! వినుము! బాగుగా వినుము! సమస్త దేవతా గణములకు శత్రువగువాడా! అశేషజన హృదయస్థితుడు అఖిలేశ్వరుడు, ఏ మహానుభావుని భార్యను నీ నాశము కొరకే, శునకము పురోడాశమును హరించినట్లు అపహరించితివో ఆ శ్రీరాముని దూతను నేను (8).

స రాఘవోఽభ్యేత్య మతంగపర్వతం
సుగ్రీవమైత్రీమనలస్య సన్నిధౌ,
కృత్వైకబాణేన నిహత్య వాలినం
సుగ్రీవమేవాధిపతిం చకార తమ్. 9

ఆ రాఘవుడు మతంగ పర్వతమునకు వచ్చిచేరి, అగ్ని సన్నిధిలో సుగ్రీవునితో మైత్రి నెరపి, ఒక్కబాణముతో వాలిని హతమార్చి సుగ్రీవునే వానరాధిపతిని చేసెను (9).

స వానరాణామధిపో మహాబలీ
మహాబలైర్వానరయూథకోటిభిః,
రామేణ సార్థం సహ లక్ష్మణేన భోః
ప్రవర్షణేఽమర్షయుతోఽవతిష్ఠతే 10

"ఓయీ! ఆ వానరాధిపుడు మహాబలీయుడగు సుగ్రీవుడు మహాబలశాలురగు వానర యూథపతులతో, లక్ష్మణ సహాయుడగు రామునితో దుర్మర్షణుడై ప్రవర్షణ గిరిపై నిలిచియున్నాడు (10).

సంచోదితాస్తేన మహాహరీశ్వరా
ధరాసుతాం మార్గయితుం దిశో దశ,
తత్రాహమేకః పవనాత్మజః కపిః
సీతాం విచిన్వఞ్ఛనకైః సమాగతః. 11

"గొప్ప వానరవీరులు అతనిచేత భూజాత సీతను అన్వేషించుటకై దశదిశలలో నియోగింపబడినారు. అందరిలో నేను ఒక్కడను. పవనతనయుడను. వానరుడనే! సీతను వెదకుచు అతిగోప్యముగా ఇక్కడకు చేరితిని (11). పద్మపు రేకులవంటి అభినేత్రి సీత నాచే దర్శింపబడినది.

దృష్టా మయా పద్మపలాశలోచనా
సీతా కపిత్వాద్విపినం వినాశితమ్,
దృష్ట్వా తతోఽహం రభసా సమాగతా-
న్మాం హంతుకామాన్ ధృతచాపసాయకాన్. 12

"నేను వానరుడను కనుక వనము వినాశము చేయబడినది. అంతట నన్ను చూచి ధృతచాప సాయకులై, నన్ను వధించుటకై సరభసముగా మీ వీరులు వచ్చిరి (12). నా ఒడలు కాపాడుకొనుటకే వారు హతమార్చబడిరి! ప్రభూ! దేహధారులకెల్లరకును దేహమే ప్రియము కదా! అంతట బ్రహ్మపాశముతో నన్ను బంధించి మేఘనాథ నామకుడితడు తీసుకొని వచ్చినాడు (13).

మయా హతాస్తే పరిరక్షితం వపుః
ప్రియో హి దేహోఽఖిలదేహినాం ప్రభో,
బ్రహ్మాస్త్రపాశేన నిబధ్య మాం తతః
సమాగమన్మేఘనినాదనామకః. 13

"బ్రహ్మవరప్రసాదినియగు నన్ను ఓ రావణా! బ్రహ్మాస్త్రము స్పృశించియే విడచిపెట్టినదని నాకు తెలియును. అయినను కరుణారసముతో తడిసిన మనసు కలవాడనై, నీకు హితము చెప్పెడి కోరికతో నేను బంధింప బడినవానివలెనే వచ్చినాడను (14).

స్పృష్ట్వైవ మాం బ్రహ్మవరప్రసాదత -
స్త్యక్త్వా గతం సర్వమవైమి రావణ,
తథాప్యహం బద్ధ ఇవాగతో హితం
ప్రవక్తుకామః కరుణారసార్ద్రధీః. 14

విచార్య లోకస్య వివేకతో గతిం
న రాక్షసీం బుద్ధిముపైహి రావణ,
దైవీం గతిం సంసృతిమోక్షహైతుకీం
సమాశ్రయాత్యంతహితాయ దేహినః. 15

త్వం బ్రహ్మణో హ్యుత్తమవంశసంభవః,
పౌలస్త్యపుత్రోఽసి కుబేరబాంధవః,
దేహాత్మబుద్ధ్యాపి చ పశ్య రాక్షసో
నాస్యాత్మబుద్ధ్యా కిము రాక్షసో నహి. 16

శరీరబుద్ధీంద్రియదుఃఖసంతతి-
ర్న తే న చ త్వం తవ నిర్వికారతః,
అజ్ఞానహేతోశ్చ తథైవ సంతతే-
రసత్త్వమస్యాః స్వపతో హి దృశ్యవత్. 17

ఇదం తు సత్యం తవ నాస్తి విక్రియా
వికారహేతుర్న చ తేఽద్వయత్వతః,
యథా నభః సర్వగతం న లిప్యతే
తథా భవాన్దేహగతోఽపి సూక్ష్మతః,
దేహేంద్రియప్రాణశరీరసంగత-
స్త్వాత్మేతి బుద్ధ్వాఖిలబంధభాగ్భవేత్. 18

చిన్మాత్రమేవాహమజోఽహమక్షరో
హ్యానందభావోఽహమితి ప్రముచ్యతే,
దేహోఽప్యనాత్మా పృథివీవికారజో
న ప్రాణ ఆత్మానిల ఏష ఏవ సః. 19

మనోఽప్యహంకారవికార ఏవ నో
న చాపి బుద్ధిః ప్రకృతేర్వికారజా,
ఆత్మా చిదానందమయోఽవికారవాన్
దేహాదిసంఘాద్వ్యతిరిక్త ఈశ్వరః. 20

నిరంజనో ముక్త ఉపాధితః సదా
జ్ఞాత్వైవమాత్మానమితో విముచ్యతే,
అతోఽహమాత్యంతికమోక్షసాధనం
వక్ష్యే శృణుష్వావహితో మహామతే. 21

"రావణా! రాక్షసమగు బుద్ధి వదలిపెట్టుము. లోకముయొక్క వివేకగతిని విచారించి దేహధారులకు అత్యంత హితమును ప్రసాదించునది, సంసారబంధము నుండి విడగొట్టగలుగునది అయిన దైవీగతిని ఆశ్రయించుము (15). నీవు ఉత్తమమగు బ్రహ్మవంశ సంజాతుడవు. పౌలస్త్యుని పుత్రుడవు. కుబేరుని బంధుడవు. చూడుము నీవు దేహాత్మబుద్ధితోను రాక్షసుడవు కావు. ఆత్మబుద్ధి చేతను నీవు రాక్షసుడవు కావే! (16). శరీర ఇంద్రియ దుఃఖపరంపరలు నీవి కావు. నీవు వాటికి సంబంధించినవాడవు కావు. నీవు నిర్వికారుడవు. స్వప్నమునందు అగుపించువాని వలె, అజ్ఞానమూలకముగా ఈ పరంపరలు అసత్యములు (17). ఇది సత్యము. నీయందు వికారము లేదు. వికారమునకు నీవును కారణము కాదు. అందువలన నీవు అద్వితీయుడవు. ఆకాశము అంతట వ్యాపించినను దేనిచేతను అంటుపడ నట్లు నీవును అట్టివాడవే! సూక్ష్మరూపమున దేహము నందుండి కూడ, దేహ ఇంద్రియ ప్రాణ శరీర సాంగత్యము, సాన్నిహిత్యము వలన ఆత్మబుద్ధితో అఖిల బంధముల పాలు అగుచున్నావు (18).

"ఆ జీవుడు 'నేను చిన్మాత్రుడను, నేను అజాడను, నేను అక్షరుడను, నేను ఆనందభావ స్వరూపుడను' అని తెలిసి విడివడును. పృథివీ వికారమగుటచే దేహము అనాత్మ. ప్రాణము వాయువే యగుట వలన అదియు అనాత్మయే (19). మనస్సుకూడా అహంకార వికారము కనుక ఆత్మ కాదు. ప్రకృతి వికారజము కనుక బుద్ధియు ఆత్మకాదు. చిదానందమయుము, అవికారి, దేహాది సమూహముల కంటె భిన్నమగునది యగు ఆత్మ సర్వస్వామి (20). అది నిరంజనము. సదా ఉపాధులు లేనిది. ఇట్లు ఆత్మను తెలిసిన సంసారబంధములనుండి విడివడగలవు. ఓ మహామతీ! నేనిపుడు ఆత్యంతిక మోక్షసాధనమును తెలుపుచున్నాను. సావధానచిత్తుడవై వినుము (21).

విష్ణోర్హి భక్తిః సువిశోధనం ధియ-
స్తతో భవేజ్జ్ఞానమతీవ నిర్మలమ్,
విశుద్ధతత్త్వానుభవో భవేత్తతః
సమ్యగ్విదిత్వా పరమం పదం వ్రజేత్. 22

అతో భజస్వాద్య హరిం రమాపతిం
రామం పురాణం ప్రకృతేః పరం విభుమ్,
విసృజ్య మౌర్ఖ్యం హృది శత్రుభావనాం
భజస్వ రామం శరణాగతప్రియమ్.

సీతాం పురస్కృత్య సపుత్రబాంధవో
రామం నమస్కృత్య విముచ్యసే భయాత్. 23

రామం పరాత్మానమభావయన్జనో
భక్త్యా హృదిస్థం సుఖరూపమద్వయమ్,
కథం పరం తీరమవాప్నుయాజ్జనో
భవాంబుధేర్దుఃఖతరంగమాలినః 24

నో చేత్త్వమజ్ఞానమయేన వహ్నినా
జ్వలంతమాత్మానమరక్షితారివత్,
నయస్యధోఽధః స్వకృతైశ్చ పాతకై-
ర్విమోక్షశంకా న చ తే భవిష్యతి. 25

శ్రుత్వామృతాస్వాదసమానభాషితం
తద్వాయుసూనోర్దశకంధరోఽసురః,
అమృష్యమాణోఽతిరుషా కపీశ్వరం
జగాద రక్తాంతవిలోచనో జ్వలన్. 26

కథం మమాగ్రే విలపస్యభీతవత్
ప్లవంగమానామధమోఽసి దుష్టధీః,
క ఏష రామః కతమో వనేచరో
నిహన్మి సుగ్రీవయుతం నరాధమమ్. 27

త్వాం చాద్య హత్వా జనకాత్మజాం తతో
నిహన్మి రామం సహలక్ష్మణం తతః,
సుగ్రీవమగ్రే బలినం కపీశ్వరం
సవానరం హన్మ్యచిరేణ వానర,
శ్రుత్వా దశగ్రీవవచః స మారుతి-
ర్వివృద్ధకోపేన దహన్నివాసురమ్. 28

విష్ణువునందలి భక్తియే బుద్ధిని బాగుగా శోధించి వేయునది. దానివలన అత్యంత నిర్మలమగు జ్ఞానము కలుగును. అంతట విశుద్ధమగు భగవత్ తత్త్వ అనుభవము కలుగును. అది పూర్తిగా తెలిసికొని పరమపదమునకు పోగలము (22). అందువలన ఇప్పటికిపుడే హరిని, రమాపతిని, సనాతనుని, ప్రకృతికన్న పరుని, సర్వవ్యాపకుడగువానిని, రాముని సేవించుకొనుము. శరణాగతప్రియుడగు రాముని, నీ మదిలోని శత్రుభావన వదలి, మూర్ఖతకు వీడుకోలు పలికి, సేవించుకొనుము. సీతను వెంటనిడుకొని సపుత్ర బాంధకముగా రామునికి నమస్కరించి, భయమునుండి ముక్తుడవు కమ్ము (23).

"హృదయస్థుడగు వానిని, సుఖస్వరూపుని, అద్వయుని, పరమాత్మయగు రాముని సేవింపక, జనులు దుఃఖతరంగకల్లోలమగు సంసారకల్లోలిని ఎట్లు దాటి ఆవలి తీరము చేరగలరు? (24). అటులకాక, అజ్ఞాన మయమగు అగ్నిచే దగ్ధమగుచు నున్న నీవు నీచే శత్రువువలె రక్షింపుకొనలేవు. నీచే చేయబడు పాపకర్మలు నిన్ను అధోధ (ఉత్తరోత్తర) పతితుని చేసివేయగలవు. అపుడు నీకు మోక్షము కలుగు నేమో అన్న అనుమానమునకు కూడా తావుండదు. (ఆత్మైవహ్యాత్మనో బంధురాత్మైవరిపురాత్మనః గీత. 6-5) (25)".

అట్లు పవనతనయుడగు ఆంజనేయుని అమృతాస్వాదన సమాన సుభాషితము విని, రాక్షసుడగు దశకంధరుడు సహింపలేక, మండిపడుచు అతి క్రోధముతో కన్నుల నెత్తురు జీరలు జార, కపీశ్వరునితో ఇట్లు అనెను - "ఎట్టెట్టా! నా ముందు నిర్భీతునివలె ప్రలాపము చేయుచుంటివి. వానరులలో అధమాధముడవు. నీ తెలివి నాకు తెలియనే తెలిసినది. ఎవరు ఆ రాముడు? వనచరుడు ఆ సుగ్రీవుడు ఏపాటివాడు? సుగ్రీవయుతుడైన ఆ నరాధముని నిహతుని చేసివైచెదను (27). నిన్నిప్పుడే చంపి జానకిని వధించి, అంతట రాముని లక్ష్మణునితో సహా వధించెదను. ముందుగా బలీయుడు కపీశ్వరుని అచిర కాలములో, ఓ వానరా! సవానరముగా హతమార్చెదను". రావణుడాడిన ఈ మాటలు విని వాయుపుత్రుడు వర్ధమాన మగుచున్న క్రోధముతోనే రాక్షసరాజును దహింపువానివలె (28), ఇట్లు చెప్పెను - "రాక్షసాధమా! కోట్లాది రావణులు

న మే సమా రావణకోటయోఽధమ
రామస్య దాసోఽహమపారవిక్రమః,
శ్రుత్వాతికోపేన హనూమతో వచో
దశాననో రాక్షసమేవమబ్రవీత్. 29

పార్శ్వే స్థితం మారయ ఖండశః కపిం
పశ్యంతు సర్వేఽసురమిత్రబాంధవాః,
నివారయామాస తతో విభీషణో
మహాసురం సాయుధముద్యతం వధే,
రాజన్వధార్హో న భవేత్కథంచన
ప్రతాపయుక్తైః పరరాజవానరః. 30

హతేఽస్మిన్వానరే దూతే వార్తాం కో వా నివేదయేత్,
రామాయ త్వం యముద్దిశ్య వధాయ సముపస్థితః. 31

అతో వధసమం కించిదన్యచ్చింతయ వానరే,
సచిహ్నో గచ్ఛతు హరిర్యం
దృష్ట్వాఽఽయాస్యతి ద్రుతమ్. 32

రామః సుగ్రీవసహితస్తతో యుద్ధం భవేత్తవ,
విభీషణవచః శ్రుత్వా రావణోఽప్యేతదబ్రవీత్. 33

వానరాణాం హి లాంగూలే మహామానో భవేత్కిల,
అతో వస్త్రాదిభిః పుచ్ఛం వేష్టయిత్వా ప్రయత్నతః. 34

వహ్నినా యోజయిత్వైనం భ్రామయిత్వా పురేఽఖిలః,

విసర్జయత పశ్యంతు సర్వే వానరయూథపాః. 35

తథేతి శణపట్టైశ్చ వస్త్రైరన్యైరనేకశః,

తైలాక్తైర్వేష్టయామాసుర్లాంగూలం మారుతేర్దృఢమ్. 36

పుచ్ఛాగ్రే కించిదనలం దీపయిత్వాథ రాక్షసాః,

రజ్జుభిః సుదృఢం బద్ధ్వా ధృత్వా తం బలినోఽసురాః. 37

సమంతాద్భ్రామయామాసుశ్చోరోఽయమితివాదినః,
తూర్యఘోషైర్ఘోషయంతస్తాడయంతో ముహుర్ముహుః. 38

హనూమతాపి తత్సర్వం సోఢం కించిచ్చికీర్షుణా,
గత్వా తు పశ్చిమద్వారసమీపం తత్ర మారుతిః. 39

నా తోడనే సమానము కారు. నేను అపారవిక్రముడగు రాముని దాసుడను''. హనుమ చెప్పిన యీ మాటలు విని అతికోపముతో దశకంఠుడు, ప్రక్కనున్న రాక్షసునితో (ప్రహస్తునితో) ఇట్లనెను - ''అందరు అసురమిత్రులు, బంధువులు చూచుచుండగనే ఈ కపిని ఖండఖండములుగా చేసివేయుడు''. అంతలో ఆయుధము ధరించి హనుమ వధకుద్యమించు గొప్ప రాక్షసుని విభీషణుడు నివారించినవాడాయెను. ఇట్లనెను - ''రాజా! ప్రతాపవంతుడగు వానిచేత పరరాజుచే పంపబడిన యీ వానరుడు ఎన్నడును వధార్హుడు కాడు (30). ఈ వానర దూతయే హతమారిన, ఎవరిని ఉద్దేశించిన, ఎవరి వధముకై ఎదురుచూచు చుంటివో, ఆ రామునికి ఈ వార్త తెలుపు వారింకెవరు? (31). అందువలన వానరుని వధించుటతో సమానమగు మరియొక శిక్ష యోచింపవలయును. ఆ శిక్ష గుర్తులను ధరించి, ఈ వానరుడు పోవుగాక! అపుడు నీకు అతనితో యుద్ధము జరుగును''. విభీషణుని యీ మాటవిని రావణుడును ఇట్లు చెప్పెను (32 - 33) - ''వానరులకు వాలమే కదా అభిమానమునకు గుర్తు! అందువలన ప్రయత్న పూర్వకముగా వస్త్రాదులచే పుచ్ఛమును చుట్టివైచి (34), మంట తగులవైచి, పురమంతట త్రిప్పి, వదలిపెట్టుడు. వీని స్థితిని వానరచమూపతులు చూతురు గాక! (35).

అట్లే యని గోగునారలతోను, వస్త్రములతోను, మరియు అనేకములతో, నూనెలో తడిపి, మారుతి లాంగూలమునకు దృఢముగా చుట్టిరి (36). రాక్షసులంతట వాలము చివర కొంచెము నిప్పు రగుల్కొల్పి, ఆ బలీయుడగు వానరుని త్రాళ్లతో బలముగా కట్టి, అసురులందరు (37) ''దొంగ యితడు, దొంగ యితడు'' అని చాటుచు మాటిమాటికి కొట్టుచు, తూర్యఘోషములు ఘోషించుచు త్రిప్పసాగిరి (38). హనుమంతుడదంతయు ఇంకను చేయతగినది యున్నదని, సహించుచు పశ్చిమ ద్వార సమీపమువరకు పోయెను. అచట మారుతి (39),



హనుమంతుడు లంకాదహనము చేయుట

సూక్ష్మో బభూవ బంధేభ్యో నిస్సృతః పునరప్యసౌ.
బభూవ పర్వతాకారస్తత ఉత్ప్లుత్య గోపురమ్. 40

తత్రైకం స్తంభమాదాయ హత్వా తాన్ రక్షిణః క్షణాత్.
విచార్య కార్యశేషం స ప్రాసాదాగ్రాద్గృహాద్గృహమ్. 41

ఉత్ప్లుత్యోత్ప్లుత్య సందీప్తపుచ్ఛేన మహతా కపిః.
దదాహ లంకామఖిలాం సాట్టప్రాసాదతోరణామ్. 42

హా తాత! పుత్ర! నాథేతి క్రందమానాః సమంతతః,
వ్యాప్తాః ప్రాసాదశిఖరేఽప్యారూఢా దైత్యయోషితః. 43

దేవతా ఇవ దృశ్యంతే పతంత్యః పావకేఽఖిలాః,
విభీషణగృహం త్యక్త్వా సర్వం భస్మీకృతం పురమ్. 44

తత ఉత్ప్లుత్య జలధౌ హనూమాన్మారుతాత్మజః,
లాంగూలం మజ్జయిత్వాంతః స్వస్థచిత్తో బభూవ సః. 45

వాయోః ప్రియసఖిత్వాచ్చ సీతయా ప్రార్థితోఽనలః,
న దదాహ హరేః పుచ్ఛం బభూవాత్యంతశీతలః. 46

యన్నామసంస్మరణధూతసమస్తపాపా-
స్తాపత్రయానలమపీహ తరంతి సద్యః,
తస్యైవ కిం రఘువరస్య విశిష్టదూతః
సంతప్యతే కథమసౌ ప్రకృతానలేన. 47

అతి చిన్నవాడుగా మారెను, బంధములనుంచి విడివడెను, వెంటనే పర్వతాకారుడయ్యెను. గోపురము పైనెక్కి (40), ఒక స్తంభమును పెరికి, గోపుర రక్షకులగు వారిని క్షణములో చంపి, కార్యశేషమును ఆలోచించెను. ప్రాసాదమునుండి ఒక ఇంటికి అటనుండి మరొక ఇంటికి దుమికి, దుమికి జ్వాలలు ఎగయుచున్న లాంగూలముతో, మహాత్ముడగు ఆ కపివీరుడు పరిఘలు, ప్రాసాదములు, తోరణద్వారము లతో సహా లంకానగరమును పరశురామప్రీతి చేసివైచెను (41-42). ''హా! తండ్రీ! హా పుత్రా! హా నాథా!'' అను ఆక్రందనలు లంకలో అంతట వ్యాపించెను. రక్కసి పడుచులు ప్రాసాదాగ్రములు చేరియుండియు, అందరు అగ్నిలో పడుచు దేవతల వలె చూపట్టిరి. అతడు విభీషణ గృహము ఒక్కటి వదలిపెట్టి, పురమంతయు భస్మపటలము చేసెను (44).

అంతట మారుతాత్మజుడు సముద్రములో దూకి, పుచ్ఛమును స్నానము చేయించి (అగ్ని చల్లార్చుకొని) కృతార్థుడాయెను (45).

వాయుదేవుని ప్రియమిత్రుడగుట చేతను, సీతచే ప్రార్థింపబడుటవలన, అగ్ని వానరుని పుచ్ఛమును కాల్చలేదు సరికదా, అత్యంతము శీతలుడయ్యెను (46).

ఎవరి నామ సంస్మరణము వలన పాపములన్నియు తొలగి, తాపత్రయ అనలమును కూడా వెంటనే దాటి పోగలరో, అట్టి రఘువరుని రాముని ప్రత్యేకదూతను ఇతనిని ప్రాకృతమగు ఈ అనలము దహింపగలదా ఏమి!

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో సుందరకాండ చతుర్థ సర్గము ॥4॥

----★★★★----

ఓం

పంచమ సర్గము

సీతకు వీడుకోలు - శ్రీరామునకు వేడికోలు

శ్రీమహాదేవ ఉవాచ

తతః సీతాం నమస్కృత్య హనూమానబ్రవీద్వచః,
ఆజ్ఞాపయతు మాం దేవి భవతీ రామసన్నిధిమ్. 1

గచ్ఛామి రామస్త్వాం ద్రష్టుమాగమిష్యతి సానుజః,
ఇత్యుక్త్వా త్రిః పరిక్రమ్య జానకీం మారుతాత్మజః. 2

ప్రణమ్య ప్రస్థితో గంతుమిదం వచనమబ్రవీత్,
దేవి! గచ్ఛామి భద్రం తే తూర్ణం ద్రక్ష్యసి రాఘవమ్. 3

లక్ష్మణం చ ససుగ్రీవం వానరాయుతకోటిభిః,
తతః ప్రాహ హనూమంతం జానకీ దుఃఖకర్శితా. 4

త్వాం దృష్ట్వా విస్మృతం దుఃఖమిదానీం త్వం గమిష్యసి,
ఇతః పరం కథం వర్తే రామవార్తాశ్రుతిం వినా. 5

మారుతిరువాచ

యద్యేవం దేవి మే స్కంధమారోహ క్షణమాత్రతః,
రామేణ యోజయిష్యామి మన్యసే యది జానకి!. 6

సీతోవాచ

రామః సాగరమాశోష్య బద్ధ్వా వా శరపంజరైః,
ఆగత్య వానరైః సార్ధం హత్వా రావణమాహవే. 7

మాం నయేద్యది రామస్య కీర్తిర్భవతి శాశ్వతీ,
అతో గచ్ఛ కథం చాపి ప్రాణాన్సంధారయామ్యహమ్.8

ఇతి ప్రస్థాపితో వీరః సీతయా ప్రణిపత్య తామ్,
జగామ పర్వతస్యాగ్రే గంతుం పారం మహోదధేః. 9

శ్రీమహాదేవుడు ఇట్లనెను - ''ఓ పార్వతీ! అంతట ఆంజనేయుడు సీతకు నమస్కరించి ఈ మాట చెప్పెను. ''దేవీ! నాకు అనుమతి నిమ్ము! ఇప్పుడే శ్రీరామ సన్నిధికి పోయెదను. అనుజానితో రాముడు నిన్ను చూడ రాగలడు''. ఈ మాటచెప్పి, జానకికి ముమ్మారు ప్రదక్షిణ మాచరించి, మారుతి నమస్కరించి వెడలుటకు నిలిచి ఈ మాట చెప్పెను - ''దేవీ! నేను వెడలుచున్నాను. నీకు భద్రమగు గాక! రాఘవుని అచిరకాలములో చూచెదవు గాక! (1-3) సుగ్రీవు సహితుడైన లక్ష్మణుని కోట్లాది వానరులనుకూడా చూచెదవుగాక!'' అంతట దుఃఖాకులిత యగు జానకి హనుమంతునితో ఈమాట చెప్పెను (4) - ''తండ్రీ! నిన్ను చూచి దుఃఖము మరచితిని. ఇపుడు నీవు వెడలిపోదువు. ఇకపైన శ్రీరామ క్షేమ సమాచారము లేక ఎటుల బ్రతుక గలనయ్యా!'' (5).

హనుమంతుడు ఇట్లనెను - ''అట్లయిన దేవీ! నీకిష్టమైన నా భుజస్కంధముల నధిరోహించవమ్మా! అమ్మా జానకీ! క్షణమాత్ర కాలములో రామునివద్దకు చేర్చెదను'' (6).

సీత ఇట్లనెను - ''నాయనా! రాముడు సాగరమును ఇంకింపచేసియో, శరపంజరముతో బంధించియో వానరులతో కదలివచ్చి, రావణుని యోహరమున నిహతుని చేసి, నన్ను తీసికొనిపోయిన రాముని కీర్తి శాశ్వతమగును. ఇక నీవు పోయిరమ్ము. ఏదియో విధముగా ప్రాణములు ధరించియుందును'' (7-8).

ఇటుల పంపబడి, వీరుడగు హనుమ సీతకు ప్రణమిల్లి పర్వతశిఖరముపైకి, సముద్రతీరమునకు లంఘించుటకై వెళ్లి చేరెను (9).

తత్ర గత్వా మహాసత్త్వః పాదాభ్యాం పీడయన్ గిరిమ్.
జగామ వాయువేగేన పర్వతశ్చ మహీతలమ్. 10

గతో మహీసమానత్వం త్రింశద్యోజనముచ్ఛ్రితః
మారుతిర్గగనాంతస్థో మహాశబ్దం చకార సః. 11

తం శ్రుత్వా వానరాః సర్వే జ్ఞాత్వా మారుతిమాగతమ్.
హర్షేణ మహతావిష్టాః శబ్దం చక్రుర్మహాస్వనమ్. 12

శబ్దేనైవ విజానీమః కృతకార్యః సమాగతః.
హనూమానేవ పశ్యధ్వం వానరా వానరర్షభమ్. 13

ఏవం బ్రువత్సు వీరేషు వానరేషు స మారుతిః.
అవతీర్య గిరేర్మూర్ధ్ని వానరానిదమబ్రవీత్. 14

దృష్టా సీతా మయా లంకా ధర్షితా చ సకాననా.
సంభాషితో దశగ్రీవస్తతోఽహం పునరాగతః. 15

ఇదానీమేవ గచ్ఛామో రామసుగ్రీవసన్నిధిమ్.
ఇత్యుక్తా వానరాః సర్వే హర్షేణాలింగ్య మారుతిమ్. 16

కేచిచ్చుచుంబుర్లాంగూలం ననృతుః కేచిదుత్సుకాః.
హనూమతా సమేతాస్తే జగ్ముః ప్రస్రవణం గిరిమ్. 17

గచ్ఛంతో దదృశుర్వీరా వనం సుగ్రీవరక్షితమ్.
మధుసంజ్ఞం తదా ప్రాహురంగదం వానరర్షభాః. 18

క్షుధితాః స్మో వయం వీర దేహ్యనుజ్ఞాం మహామతే!
భక్షయామః ఫలాన్యద్య పిబామోఽమృతవన్మధు. 19

సంతుష్టా రాఘవం ద్రష్టుం గచ్ఛామోఽద్యైవ సానుజమ్.
20

అక్కడికిపోయి, మహాసత్త్వుడగు హనుమ గిరిని పాదములతో నొక్కిపట్టి పీడించి వాయువేగముతో ఎగిరిపోయెను. ముప్పది యోజనముల ఎత్తుగల ఆ పర్వతము భూమిలోనికి దిగబారి సమతలమై పోయెను. మారుతి ఆకాశమునందు పోవుచు, సింహనాదము చేసెను (10-11). దానిని విని వానరు లందరు మారుతి వచ్చుచున్నాడని తెలిసి మిక్కిలిగా ఆనందపడిరి. వారును గొప్ప ధ్వనిని చేసిరి (12). "మన హనుమయే కృతకార్యుడై వచ్చినాడు. ఆ శబ్దముతోనే తెలిసికొంటిని. వానరవీరులారా! అదిగో! వానరవృషభుని చూడుడు!"(13). ఇటుల పరస్పరము వీరులగు వానరులు సంభాషించుకొనుచుండగనే, మారుతి గిరి శిఖరముపైకి దిగి, వానరులతో ఈ మాట చెప్పెను (14) - "సీత నాచేత చూడబడినది. వనములతో కూడిన లంక ధ్వంసము చేయబడినది. దశగ్రీవునితో సంభాషించితిని. నేను తిరిగి వచ్చితిని (15). ఇక ఇపుడే రామ సుగ్రీవుల సన్నిధికి పోదము గాక!" ఇట్లు అనగా విని అందరు వానరులు ఆనందాతిరేకమున మారుతిని ఆలింగనము చేసికొని (16), కొందరు లాంగూలమును చుంబించిరి. కొందరు అత్యుత్సాహముతో నృత్యము చేసిరి. హనుమత్ సమేతముగా అందరు ప్రస్రవణగిరికి బయలు దేరిరి (17). ఆ వీరులు అటుల పోవుచు, సుగ్రీవ రక్షితమైన మధునామాంకితమైన వనమును చూడనే చూచిరి. వానర ఋషభులు అంగదునితో ఇట్లనిరి "వీరుడా! మేమందరము ఆకలిగొని యుంటిమి. మహామతీ! అనుజ్ఞ నిమ్ము. ఇపుడే ఫలములు తిందుము. అమృతమువంటి మధువు త్రావెదము (18-19). సంతుష్టులమై, ఇపుడే సానుజుడౌ రాఘవుని చూడపోవుదము (20)"

అంగద ఉవాచ

హనూమాన్కృతకార్యోఽయం పీతశైతత్ప్రసాదతః.
జక్షధ్వం ఫలమూలాని త్వరితం హరిసత్తమాః. 21

అంగదుడిట్లనెను - "వానరపుంగవులారా! హనుమంతుడు కృతకార్యుడై తిరిగి వచ్చినాడు. అతని ప్రసాదముగా (దయచేతనే) త్రావుడు. త్వరత్వరగా ఫలమూలములు భక్షింపుడు" (21).

తతః ప్రవిశ్య హరయః పాతుమారేభిరే మధు,
రక్షిణస్తాననాదృత్య దధివక్త్రేణ నోదితాన్. 22

పిబతస్తాడయామాసుర్వానరాన్వానరర్షభాః,
తతస్తాన్ముష్టిభిః పాదైశ్చూర్ణయిత్వా పపుర్మధు. 23

తతో దధిముఖః క్రుద్ధః సుగ్రీవస్య స మాతులః,
జగామ రక్షిభిః సార్ధం యత్ర రాజా కపీశ్వరః. 24

గత్వా తమబ్రవీద్దేవ చిరకాలాభిరక్షితమ్,
నష్టం మధువనం తేఽద్య కుమారేణ హనూమతా. 25

శ్రుత్వా దధిముఖేనోక్తం సుగ్రీవో హృష్టమానసః,
దృష్ట్వాఽఽగతో న సందేహః సీతాం పవననందనః.26

నో చేన్మధువనం ద్రష్టుం సమర్థః కో భవేన్మమ,
తత్రాపి వాయుపుత్రేణ కృతం కార్యం న సంశయః. 27

శ్రుత్వా సుగ్రీవవచనం హృష్టో రామస్తమబ్రవీత్,
కిముచ్యతే త్వయా రాజన్వచః సీతాకథాన్వితమ్. 28

సుగ్రీవస్త్వబ్రవీద్వాక్యం దేవ దృష్టాఽవనీసుతా,
హనూమత్ప్రముఖాః సర్వే ప్రవిష్టా మధుకాననమ్. 29

భక్షయంతి స్మ సకలం తాడయంతి స్మ రక్షిణః,
అకృత్వా దేవకార్యం తే ద్రష్టుం మధువనం మమ. 30

న సమర్థాస్తతో దేవీ దృష్టా సీతేతి నిశ్చితమ్,
రక్షిణో వో భయం మాస్తు గత్వా బ్రూత మమాజ్ఞయా.31

వానరానంగదముఖానానయధ్వం మమాంతికమ్,
శ్రుత్వా సుగ్రీవవచనం గత్వా తే వాయువేగతః. 32

హనూమత్ప్రముఖానూచుర్గచ్ఛతేశ్వరశాసనాత్,
ద్రష్టుమిచ్ఛతి సుగ్రీవః సరామో లక్ష్మణాన్వితః. 33

యుష్మానతీవ హృష్టాస్తే త్వరయంతి మహాబలాః,
తథేత్యంబరమాసాద్య యయుస్తే వానరోత్తమాః. 34

అంతట వారు మధువనములో చొరబడి మధువు గ్రోల నారంభించిరి. దధివక్త్రునిచే పంపబడిన వానర వనరక్షకులను అనాదరించిరి. ఆ వానరులు మధువు గ్రోలు యీ వానర పుంగవులను వేగముగా తాడించిరి. వీరు వారిని ముష్టిఘాతములతో మట్టి గరపి, మధువు గ్రోలిరి (22-23).

అంతట సుగ్రీవుని మేనమామయగు దధిముఖుడు క్రోధముతో వనరక్షకులతో కూడి, వానరరాజగు సుగ్రీవు డున్న చోటికి చేరెను (24), వెళ్లి అతనితో ఇట్లనెను - ''దేవా! చిరకాలముగా సంరక్షింపబడిన మధువనము ఇపుడు నీ కుమారునిచేత, హనుమంతునిచేత నాశనమైనది (25)''. దధిముఖుడు చెప్పిన యీ మాట విని సుగ్రీవుడు చాల సంతోషించిన మనసుకలవాడై, ''పవనసుతుడు సీతను చూచి వచ్చియుండవచ్చును. ఇది నిస్సందేహము (26). కానిచో నా మధువనమును తాకుటకు కూడ ఎవరికి శక్యము! అందుచే వాయుపుత్రునిచేతనే కార్యసాధన జరిగియుండవలయును. ఇది నిస్సంశయము (27). సుగ్రీవుని మాట విని సంతోషముతో రాముడనెను - ''రాజా! సీతాదేవి వార్త గురించిన మాట ఏమది నీచే చెప్పబడినది?'' (28).

సుగ్రీవుడు ఇట్లు చెప్పెను - ''దేవా! భూజాత సీత చూడబడినది. హనుమత్ప్రముఖులైన వానర వీరులు అందరిపుడు మధువనములో విడిసియున్నారు (29). తినుచున్నారట! రక్షకులందరిని కొట్టుచున్నారట! దేవా! మీ కార్యము చేయకుండగ నా మధువనమును చూచుటకు కూడ వారు సమర్థులు కారు. నిశ్చయముగా సీతాదేవి చూడబడినది. వనపాలకులారా! భయపడవలదు! వెడలి, మా ఆజ్ఞగా చెప్పుడు (30-31). నా సన్నిధికి అంగద ప్రముఖాది వానరులనందరిని పంపించి వేయుడు!'' సుగ్రీవుని యీ మాట విని వారందరు వాయువేగముగా (32) పోయి, హనుమంతుడు మొదలైనవారికిట్లు చెప్పిరి ''రాజశాసనమిది! పొండు పొండు! రామలక్ష్మణ సమేతుడై సుగ్రీవుడు మిమ్ములను చూడకోరుచున్నారు. మీ అందరి యందు వారు అతి సంతుష్టులుగా నున్నారు. మహాబలులగు వారు మిమ్ముల వేగిరించిరి''. ఇది విని 'అట్లే' యని

హనూమంతం పురస్కృత్య యువరాజం తథాంగదమ్.
రామసుగ్రీవయోరగ్రే న్యపేతుర్భువి సత్వరమ్. 35

హనూమాన్రాఘవం ప్రాహ దృష్టా సీతా నిరామయా.

సాష్టాంగం ప్రణిపత్యాగ్రే రామం పశ్చాద్ధరీశ్వరమ్. 36

కుశలం ప్రాహ రాజేంద్ర జానకీ త్వాం శుచాన్వితా.
అశోకవనికామధ్యే శింశపామూలమాశ్రితా. 37

రాక్షసీభిః పరివృతా నిరాహారా కృశా ప్రభో.
హా రామ రామ రామేతి శోచంతీ మలినాంబరా. 38

ఏకవేణీ మయా దృష్టా శనైరాశ్వాసితా శుభా.
వృక్షశాఖాంతరే స్థిత్వా సూక్ష్మరూపేణ తే కథామ్. 39

జన్మారభ్య తవాత్మర్థం దండకాగమనం తథా.
దశాననేన హరణం జానక్యా రహితే త్వయి. 40

సుగ్రీవేణ యథా మైత్రీ కృత్వా వాలినిబర్హణమ్.
మార్గణార్థం చ వైదేహ్యాః సుగ్రీవేణ విసర్జితాః. 41

మహాబలా మహాసత్త్వా హరయో జితకాశినః.
గతాః సర్వత్ర సర్వే వై తత్రైకోఽహమిహాగతః. 42

అహం సుగ్రీవసచివో దాసోఽహం రాఘవస్య హి.
దృష్టా యజ్జానకీ భాగ్యాత్ప్రయాసః ఫలితోఽద్య మే. 43

ఇత్యుదీరితమాకర్ణ్య సీతా విస్ఫారితేక్షణా.
కేన వా కర్ణపీయూషం శ్రావితం మే శుభాక్షరమ్. 44

యది సత్యం తదాయాతు మద్దర్శనపథం తు సః.
తతోఽహం వానరాకారః సూక్ష్మరూపేణ జానకీమ్. 45

ప్రణమ్య ప్రాంజలిర్భూత్వా దూరాదేవ స్థితః ప్రభో.
పృష్టోఽహం సీతయా కస్త్వమిత్యాది బహువిస్తరమ్. 46

మయా సర్వం క్రమేణైవ విజ్ఞాపితమరిందమ.
పశ్చాన్మయార్పితం దేవ్యై భవద్దత్తాంగులీయకమ్. 47

వానరోత్తములు అందరు హనుమత్ పురస్కృతముగా అంగదునితో, ఆకాశమార్గమున వెడలి, బయలుదేరి, వేగమే శ్రీరామ సుగ్రీవుల ముందు నేలపై దిగిరి (33-35).

హనుమ రాఘవునితో యిట్లనెను - ''సీత క్షేమముగా నుండుట చూడబడినది''. ఈ మాటతో రాముని ముందు సాష్టాంగముగా నమస్కరించి, తరువాత సుగ్రీవునికి కూడా నమస్కరించి ఇట్లనెను (36) - ''రాజేంద్రా! శోకాకులయగు నా తల్లి జానకి నీ క్షేమమును అడిగినది. ప్రభూ! అశోకవనము నడుమ, శింశుపావృక్ష మూలమున, రాక్షసీగణము చుట్టును పరివేష్టించి యుండ, నిరాహారయై కృశయై, ''హా రామా! హా రామా!'' యనుచు శోకించుచు మలిన వస్త్రధారిణియై (37-38), జడలు గట్టిన కేశములతో ఏకవేణియై, నాచే చూడబడినది. శుభదర్శనురాలగు నామె నాచే నెమ్మదిగా నాశ్వాసింపబడినది. (అది ఇటుల జరిగినది) వృక్షశాఖయందు సూక్ష్మరూపమున నుండి, నీ గాథను జన్మము మొదలుగా దండకాగమన ప్రయాణము వరకు సవిస్తరముగా తెల్పి, నీవు లేనివేళ రావణకృత జానకీహరణము, సుగ్రీవుని మైత్రి నెరపిన వైనము, వాలివధ, ఆమెను వెదకుటకై సుగ్రీవుని చేత మహాసత్త్వులు, మహాబలులు, విజయోత్సాహులగు వానరవీరులు బయల్వెడలుట, అన్నిదిశలకు వెళ్ళిన అందరిలో నేనొక్కడ లంకకు వచ్చుట తెలిపి, (39-42), నేను సుగ్రీవ సచివుడ, శ్రీరామ పదదాసుడ, జానకీ దర్శన భాగ్యమున ఉద్యమించిన నా ప్రయాసము ఫలించినదని నా చెప్పినది విని, ఆశ్చర్యానందములు విప్పారిన కనులతో సీత ''చెవికి అమృతపు సోనలై జాలువారు శుభాక్షరములు వినిపించువారు ఎవరు? (43-44).

ఇదంతయు సత్యమైన ఆ వ్యక్తి నా ముందు దృష్టిపథమందు నిలచుగాక'' యనగా నేను వానరాకారముతో సూక్ష్మరూపముతో జానకికి (45) నమస్కరించి, దూరముగనే నిలిచితిని. ప్రభూ! 'ఎవడవు నీవని' సీతచే నేను ప్రశ్నించబడితిని. శత్రుదమనా! సర్వము క్రమముగా విస్తారపూర్వముగా విజ్ఞాపనము చేసితిని. తరువాత నీవు నాకిచ్చిన ఉంగరమును దేవికి అర్పించితిని. దానివలన నన్ను బాగుగా విశ్వసించి ఈ మాట చెప్పెను -

సీతాదేవి హనుమంతునకు చూడామణిని ఇచ్చుట



సీతాదేవి ఇచ్చిన చూడామణిని హనుమంతుడు శ్రీరామచంద్రునకు అర్పించుట

తేన మామతివిశ్వస్తా వచనం చేదమబ్రవీత్,
యథా దృష్టాస్మి హనుమన్పీడ్యమానా దివానిశమ్. 48

రాక్షసీనాం తర్జనైస్తత్సర్వం కథయ రాఘవే.
మయోక్తం దేవి రామోఽపి త్వచ్చింతాపరినిష్ఠితః. 49

పరిశోచత్యహోరాత్రం త్వద్వార్తాం నాధిగమ్య సః,
ఇదానీమేవ గత్వాహం స్థితిం రామాయ తే బ్రువే. 50

రామః శ్రవణమాత్రేణ సుగ్రీవేణ సలక్ష్మణః,
వానరానీకపైః సార్ధమాగమిష్యతి తేఽన్తికమ్. 51

రావణం సకులం హత్వా నేష్యతి త్వాం స్వకం పురమ్,
అభిజ్ఞాం దేహి మే దేవి యథా మాం విశ్వసేద్విభుః. 52

ఇత్యుక్తా సా శిరోరత్నం చూడాపాశే స్థితం ప్రియమ్,
దత్త్వా కాకేన యద్వృత్తం చిత్రకూటగిరౌ పురా. 53

తదప్యాహాశ్రుపూర్ణాక్షీ కుశలం బ్రూహి రాఘవమ్,
లక్ష్మణం బ్రూహి మే కించిద్దురుక్తం భాషితం పురా. 54

తత్ క్షమస్వాజ్ఞభావేన భాషితం కులనందన,
తారయేన్మాం యథా రామస్తథా కురు కృపాన్వితః. 55

ఇత్యుక్త్వా రుదతీ సీతా దుఃఖేన మహతావృతా,
మయాప్యాశ్వాసితా రామ వదతా సర్వమేవ తే. 56

తతః ప్రస్థాపితో రామ త్వత్సమీపమిహాగతః,
తదాగమనవేలాయామశోకవనికాం ప్రియామ్. 57

ఉత్పాట్య రాక్షసాంస్తత్ర బహూన్హత్వా క్షణాదహమ్,
రావణస్య సుతం హత్వా రావణేనాభిభాష్య చ. 58

లంకామశేషతో దగ్ధ్వా పునరప్యాగమం క్షణాత్,
శ్రుత్వా హనూమతో వాక్యం రామోఽత్యంతప్రహృష్టధీః. 59

హనూమంస్తే కృతం కార్యం దేవైరపి సుదుష్కరమ్,
ఉపకారం న పశ్యామి తవ ప్రత్యుపకారిణః. 60

''హనుమా! దివానిశము రాక్షసస్త్రీలచే ఎటుల పీడింపబడుచున్నానో చూచితివి కదా! వారి బెదిరింపులు సర్వమును రాఘవునికి నివేదింపుము''. అప్పుడు నేను ''తల్లీ! రాముడు కూడా నీవలెనే చింతాగ్రస్తుడై యున్నాడు. అంతేగాక నీజాడ తెలియక రేయింబవళ్ళు నీకొరకై తపించుచున్నాడు'' అని వివరించి, 'అమ్మా! నేనిపుడే పోయి సంగతి రామునికి నివేదించెదనని' చెప్పితిని. (45 - 50).

రాముడు ఈ మాట విన్నంతనే లక్ష్మణ సుగ్రీవులతో కలసి, వానరవీరులతో సహా నీకడకు వచ్చును (51). రావణుని సకులముగా హతమార్చి నిన్ను తన పురమునకు తీసికొనిపోవును. నన్ను విశ్వసించునట్లు ఏదియైన అభిజ్ఞానము ఇమ్ము! (52)''. ఇట్లు ఆమె నాచే చెప్పబడి, కేశపాశమునయున్న చూడామణిని, తమకు ప్రియమైన ఈ భూషణమును ఇచ్చినది. చిత్రకూటగిరి యందు కాకాసుర వృత్తాంతమును కూడా చెప్పినది (53). కన్నుల నీరు నింపుకొని ఆమె - ''నేను ఇప్పటికీ జీవించి యున్నానని రాఘవునితో చెప్పుము. లక్ష్మణునికి కూడ ఇటుల చెప్పుము - 'తండ్రీ! కులనందనా! ఇంతకు ముందు అజ్ఞానభావముతో నాచే పలుకబడిన కఠినపు మాటలను మన్నింపుమయ్యా! ఇక యిపుడు రాముడు నన్ను ఏ విధముగా ఉద్ధరించగలుగునో, అట్టి ఉపాయమును దయగా నిండు మనసుతో, తలపెట్టుమయ్యా! (54-55)'. ఇటుల పలికిన సీత మహాదుఃఖములో మునిగి రోదించసాగెను. రామా! నేను కూడా నీ వృత్తాంతమంతయు నెరిగించి ఆమెను ఓదార్చితిని.

ఆ తరువాత నీ సమీపమునకు వచ్చుటకై అటనుండి బయలు దేరితిని. అటు తిరిగి వచ్చువేళ రావణ ప్రియమగు అశోకవనమును పెకలించి వైచి, క్షణములో అచటి రాక్షసులను చాలమందిని హతమార్చి, రావణపుత్రుని అక్షుని వధించి, రావణునితో భాషించితిని (57-58). లంకానగరము నిశ్శేషముగా దహించి, క్షణములో తిరిగి వచ్చితిని''. హనుమంతుని ఈ మాటవిని రాముడు అత్యంత ప్రహృష్టుడై (59), ''హనుమా! దేవతలకు కూడా కష్టమగు కార్యము నీచే సాధించబడినది. మరి నీకు ప్రత్యుపకారముగా ఏమి చేయుటకు కానరాకున్నది (60).

ఇదానీం తే ప్రయచ్ఛామి సర్వస్వం మమ మారుతే,
ఇత్యాలింగ్య సమాకృష్య గాఢం వానరపుంగవమ్. 61

సాశ్రునేత్రో రఘుశ్రేష్ఠః పరాం ప్రీతిమవాప సః,
హనూమంతమువాచేదం రాఘవో భక్తవత్సలః. 62

మారుతీ! నేను నీకిదే నాకున్న సర్వస్వమును యివ్వగలను'' అనుచు గాఢముగా రఘుశ్రేష్ఠుడు వానర పుంగవుని సాశ్రునయనుడై కౌగలించుకొనెను. అతడు (హనుమంతుడును) అత్యంత ప్రీతి పొందెను. భక్తవత్సలు డగు రాముడు హనుమంతునితో ఈ మాట పలికెను (61-62).

పరిరంభో హి మే లోకే
దుర్లభః పరమాత్మనః,
అతస్త్వం మమ భక్తోఽసి
ప్రియోఽసి హరిపుంగవ. 63

''పరమాత్ముడనగు నా పరిష్వంగము లోకములో ఎవరికిని దుర్లభము. హరిపుంగవా! నీవు నాభక్తుడవు. ప్రియుడవు''(63).

యత్పాదపద్మయుగలం తులసీదలాద్యైః
సంపూజ్య విష్ణుపదవీమతులాం ప్రయాంతి,
తేనైవ కిం పునరసౌ పరిరబ్ధమూర్తి
రామేణ వాయుతనయః కృతపుణ్యపుంజః. 64

ఎవని పాదపద్మయుగళమును తులసీదళాదులతో శ్రద్ధతో పూజించి, సాటిలేని విష్ణుపదవిని పొందెదరో, అట్టి యెడ ఈ వాయునందనుడు, చేయబడిన పుణ్యకర్మల రాశి కలవాడు, రామునిచే ఆలింగనభాగ్యము పొందగలిగిన - ఇతని అదృష్టము చెప్పుట కేమున్నది? (64).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో సుందరకాండ పంచమ సర్గము ॥5॥

---- ★★★★ ----

సమాప్తమిదం సుందరకాండమ్

శ్రీరామచంద్రుడు హనుమంతుని ప్రేమాధిక్యముతో గాఢాలింగనము చేసుకొనుట

॥శ్రీహరిః॥

ఓం శ్రీపరమాత్మనే నమః

అధ్యాత్మ రామాయణము

యుద్ధకాండము

ప్రథమ సర్గము

సమర సన్నాహములు

శ్రీమహాదేవ ఉవాచ

యథావద్భాషితం వాక్యం శ్రుత్వా రామో హనూమతః,
ఉవాచానంతరం వాక్యం హర్షేణ మహతావృతః. 1

కార్యం కృతం హనుమతా దేవైరపి సుదుష్కరమ్,
మనసాఽపి యదన్యేన స్మర్తుం శక్యం న భూతలే. 2

శతయోజనవిస్తీర్ణం లంఘయేత్కః పయోనిధిమ్,
లంకాం చ రాక్షసైర్గుప్తాం కో వా ధర్షయితుం క్షమః. 3

భృత్యకార్యం హనుమతా కృతం సర్వమశేషతః,
సుగ్రీవస్యేదృశో లోకే న భూతో న భవిష్యతి. 4

అహం చ రఘువంశశ్చ లక్ష్మణశ్చ కపీశ్వరః,
జానక్యా దర్శనేనాద్య రక్షితాః స్మో హనూమతా. 5

సర్వథా సుకృతం కార్యం జానక్యాః పరిమార్గణమ్,
సముద్రం మనసా స్మృత్వా సీదతీవ మనో మమ. 6

కథం నక్రఝషాకీర్ణం సముద్రం శతయోజనమ్,
లంఘయిత్వా రిపుం హన్యాం కథం ద్రక్ష్యామి జానకీమ్.7

శ్రీమహాదేవుడిట్లనెను - ''ఓ పార్వతీ! అంతట చూచినది చూచినట్లు హనుమచే చెప్పబడిన మాటలు విని రాముడు అత్యంత హర్షముతో ఈ మాట చెప్పెను - (1)''దేవతలకు సైతము దుష్కరమైనది, భూతలమందు ఉండు మరి ఎవరును మనసున కూడా ఆలోచింపజాలని కార్యమును మన హనుమ సాధించినాడు (2). శత యోజన విస్తీర్ణమగు సముద్రము లంఘించగలుగు వాడెవరు? రాక్షసులతో రహస్యముగ రక్షింపబడు లంకను చెనకగల వాడెవరు? (3) సుగ్రీవుని భృత్యుడు చేయవలసిన కార్యము అంతయు నిరవశేషముగా హనుమతో చేయబడినది! ఇట్టివాడు లోకమున ఇంతకుముందు లేడు, ఉండబోడు (4). నేను, రఘువంశము, లక్ష్మణుడు, సుగ్రీవుడు మనమందరము హనుమంతుడు జానకిని దర్శించుటచే రక్షింప బడితిమి (5). జానకీ అన్వేషణమను కార్యము సర్వము సక్రమముగా ఫలవంతమైనది. కాని ఈ సముద్రమును మనసా స్మరించినంతనే బాధ పీడించు చున్నట్లున్నది (6). మొసళ్ళు, తిమింగలములు నిండిన శత యోజనాయుత సాగరము ఎటుల తరించి, శత్రువును చంపగలము! ఎటుల జానకిని చూడగలను? (7)''

శ్రుత్వా తు రామవచనం సుగ్రీవః ప్రాహ రాఘవమ్,
సముద్రం లంఘయిష్యామో మహానక్రఝషాకులమ్. 8

లంకాం చ విధమిష్యామో హనిష్యామోఽద్య రావణమ్,

చింతాం త్యజ రఘుశ్రేష్ఠ చింతా కార్యవినాశినీ. 9

ఏతాన్పశ్య మహాసత్త్వాన్ శూరాన్వానరపుంగవాన్,
త్వత్ప్రియార్థం సముద్యుక్తా న్ప్రవేష్టుమపి పావకమ్.
10

సముద్రతరణే బుద్ధిం కురుష్వ ప్రథమం తతః,
దృష్ట్వా లంకాం దశగ్రీవో హత ఇత్యేవ మన్మహే. 11

నహి పశ్యామ్యహం కంచిత్త్రిషు లోకేషు రాఘవ,
గృహీతధనుషో యస్తే తిష్ఠేదభిముఖో రణే. 12

సర్వథా నో జయో రామ భవిష్యతి న సంశయః,
నిమిత్తాని చ పశ్యామి తథా భూతాని సర్వశః. 13

సుగ్రీవవచనం శ్రుత్వా భక్తివీర్యసమన్వితమ్,
అంగీకృత్యాబ్రవీద్రామో హనూమంతం పురఃస్థితమ్.14

యేన కేన ప్రకారేణ లంఘయామో మహార్ణవమ్,
లంకాస్వరూపం మే బ్రూహి దుస్సాధ్యం దేవదానవైః.15

జ్ఞాత్వా తస్య ప్రతీకారం కరిష్యామి కపీశ్వర,
శ్రుత్వా రామస్య వచనం హనూమాన్వినయాన్వితః.
16

ఉవాచ ప్రాంజలిర్భూత్వ యథా దృష్టం బ్రవీమి తే.

లంకా దివ్యా పురీ దేవ త్రికూటశిఖరే స్థితా. 17

స్వర్ణప్రాకారసహితా స్వర్ణాట్టాలకసంయుతా,
పరిఖాభిః పరివృతా పూర్ణాభిర్నిర్మలోదకైః. 18

రాఘవుని యీ మాట విని సుగ్రీవుడు రామునితో యిట్లనెను - ''గొప్ప నక్రములు, తిమింగలములు నిండియున్న ఈ సముద్రము నిదే దాటగలము. లంకను విధ్వంసము చేయుదము. రావణుని వధించెదము. రఘుశ్రేష్ఠా! చింతను వీడుమయ్యా! చింత కార్యనాశనము చేయును (9). మహాసత్త్వులు శూరులగు ఈ వానరపుంగవులందరిని చూడుము. నీ ప్రియమునకై అగ్నిలో దూకుటకును సిద్ధముగా నున్నారు. మొదట సముద్రతరణము ఎట్లు అనునది యోచింపుము. అంతట లంకను చేరి, దశగ్రీవుడిక నిహతుడైనాడనియే తలచుము (10-11). రాఘవా! నీవు విల్లంబులు ధరించి నిలువ రణమునందు నీ సమ్ముఖమున నిలువగలవాడు ఒక్కడును ముల్లోకము లందు కానరాడు (12).

''ఏ విధముగ చూచినను మనకు జయము కలుగును. ఇది తథ్యము. దీనికి అట్టి శుభశకునములు అంతట పొడగట్టుచున్నవి (13)''.

సుగ్రీవుని భక్తి పరాక్రమయుతములైన మాటలు విని, అంగీకరించి రాముడు తన సన్నిధి నున్న హనుమ నిట్లడిగెను (14) - ''ఏదియో విధముగా ఈ మహా సాగరమును దాటివేయుదము. దేవదానవులకు కూడ సాధింప నశక్యమైన లంకానగర స్వరూపము నాకు తెలుపుము (15). కపీశ్వరా! అది తెలిసికొని చేయతగినది చేయుదును''. రాముని యీ మాటలు విని హనుమ వినయముతో (16), అంజలి బద్ధుడై ఇట్లు చెప్పెను - ''దేవా! నేను ఎటుల చూచితినో అదే తెలిపెదను. దివ్యమగు లంకాపురి త్రికూటగిరిపై నిలచియున్నది (17). ప్రాకారములు స్వర్ణనిర్మితములు. అట్టాలకములు కూడా బంగారముతో నిర్మించిరి. నిండుగా నిర్మలమగు నీటితో కందకములచే లంక చుట్టబడియున్నది (18). వివిధము లగు